

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

క్వాంటమ్ ఏఐ పేరిట

ఘరానా దోపిడీ

21 వేల పెట్టుబడితో 22 లక్షలు ఆర్జనంటూ వల!
ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముకేశ్ అంబానీలు హామీ ఇస్తున్నట్లు ఫేక్ వీడియోలు
భారత పౌరులకు మాత్రమే అవకాశమంటూ పోస్టులు
నమ్మి పెట్టుబడులు పెట్టిన వారికి.. నయ వంచన
తెనాలి సహా పలు ప్రాంతాల్లో సైబర్ బాధితులు **14**
పట్టించుకోని పోలీసులు.. ఫిర్యాదు రాలేదని వెల్లడి

శుక్రవారం | 21-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 307

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి ఉ. 11.58 తదుపరి నవమి; నక్షత్రం: అనూరాధ మ. 3.54 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 9.54-11.37; దుర్ముహూర్తం: ఉ. 9.00-9.46, మ. 12.50-1.38; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.42, సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైతన్నపై ఫోకస్

మిర్చి రేట్లపై ఢిల్లీని కదిలించిన బాబు.. నేడు హస్తినలో కీలక భేటీ

- ధరల స్థిరీకరణ, ఎగుమతి సమస్యలపై కీలక నిర్ణయం వెలువడే అవకాశం
- ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారానికి వచ్చి అన్నదాతల సమస్యపై సీఎం ప్రత్యేక దృష్టి
- వ్యవసాయ మంత్రి చౌహాన్‌తో వర్చువల్ భేటీ
- సహకారానికి సిద్ధమైన మోదీ సర్కారు
- జలజీవన్, పోలవరంపై పాటిల్‌తో చర్చలు
- గత సీఎంలకు భిన్నంగా బాబు పర్యటనలు
- ఏపీ కోసం తరచూ కేంద్ర మంత్రుల వద్దకు
- 'గుట్టు'గా సొంత పనులపై నాడు జగన్
- ధరల పతనంపై కేంద్రమంత్రితో మాట్లాడా
- మిర్చి రైతులను ఆదుకుంటాం: చంద్రబాబు
- విదేశాల్లో డిమాండ్ తగ్గడం వల్లే మిర్చి ధర పతనమని వెల్లడి



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు



డిప్యూటీ సీఎం పవన్‌తో కరచాలనం చేసి చమత్కరిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మిర్చి రైతుల సమస్యపై గురువారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. రైతుల అంశాలకు చంద్రబాబు అత్యంత ప్రాధాన్యం ఇస్తుండటంతో కేంద్రప్రభుత్వం కూడా పూర్తిస్థాయిలో అప్రమత్తం అయింది. సాగు వ్యయాలు పెరిగిపోవడం, ఎగుమతులకు దారులు మూసుకుపోవడంతో తలెత్తిన మిర్చి రేట్ల సమస్యను చౌహాన్ దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. చంద్రబాబుతో చర్చల తర్వాత చౌహాన్ తన అధికారులతో సమీక్షించారు. ఈ సమస్యపై శుక్రవారం ఉన్నతాధికారుల స్థాయి సమావేశం నిర్వహించాలని అప్పటికప్పుడే నిర్ణయం తీసుకున్నారు. మిర్చి రైతుల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి.. ఒక స్పష్టతకు వచ్చి.. చర్యలను ప్రారంభిస్తామని చంద్రబాబుకు చౌహాన్ హామీ ఇచ్చారు. రాష్ట్ర సమస్యలను ఢిల్లీలో వినిపించడానికి, వాటికి పరిష్కారం సాధించడానికి చంద్రబాబు చురుగ్గా వేస్తున్న అడుగులు ఢిల్లీ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తున్నాయి. గతంలో అప్పటి సీఎం జగన్ ఎప్పుడు

మిగతా 13వ పేజీలో...

హిమాలయాలకు వెళ్తున్నారా?

- పవన్‌తో మోదీ చమత్కారం
- ఢిల్లీలో అసాధారణ విజయంపై మోదీకి చంద్రబాబు అభినందనలు
- రాత్రికి ఢిల్లీలోనే ఉండిపోవాలని కోరిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- మళ్లీ వస్తానని చెప్పిన సీఎం

కొంచెమైనా బాధ్యత ఉండొద్దా?

- కోడ్ ఉండగా మిర్చి యార్డుకు ఎలా వెళ్తారు?
- పైగా భద్రత కల్పించలేదంటూ యాగీ
- తన హయాంలో రైతులకు ఏమీ చేయని జగన్
- ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారు: చంద్రబాబు



గురువారం కర్నూలులో విద్యుత్ టారిఫ్ విడుదల చేస్తున్న ఏపీఈఆర్‌సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామసింగ్, సభ్యుడు వెంకట్రామరెడ్డి

కరెంట్ చార్జీల పెంపు లేదు

12,632 కోట్ల సబ్సిడీకి ప్రభుత్వం ఓకే

- అందుకే చార్జీలు పెంచడం లేదు
- ఏపీఈఆర్‌సీ ఇన్‌చార్జి చైర్మన్ వెల్లడి
- 3 డిస్కమ్‌ల రాబడి 44,323 కోట్లు
- వ్యయం అంచనా రూ.57,544 కోట్లు
- వ్యత్యాసాన్ని భరించేందుకు సర్కారు హామీ
- కర్నూలులో 2025-26 టారిఫ్ విడుదల
- తొలిసారి గంటల వారీగా విద్యుత్ కొనుగోలుకు కీలక నిర్ణయం
- ఈవీలకు యూనిట్ ధర రూ.6.70

కర్నూలు/తిరుపతి/అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచడం లేదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ ఠాకూర్ రామసింగ్ ప్రకటించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగ వ్యయం, ఆదాయం మధ్య రూ.12,632 కోట్ల తేడా ఉందని.. ఈ లోటును రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా భరించేందుకు ఆమోదం తెలిపినందున.. ప్రజలపై కరెంటు చార్జీల

మిగతా 12వ పేజీలో...

ఆ నిషేధం చెల్లదిక



22(ఏ) నుంచి ప్రైవేటు భూములకు విముక్తి

- మొత్తం సర్వే నంబర్ నిషేధ జాబితాలో వద్దు
- ప్రైవేటు భూములకు సర్వే, సబ్‌డివిజన్ చేయాలి
- ఆన్‌లైన్ విన్నపాలపై కలెక్టర్ కమిటీ పరిశీలన
- రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా మార్గదర్శకాలు
- హౌసింగ్ బోర్డు కాలనీలు, నివాస స్థలాలకూ స్వేచ్ఛ
- స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులు, మాజీ సైనికుల భూములకు విముక్తి



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో రాజకీయ ప్రత్యర్థులు, మాట వినని వారిని అదిరించి బెదిరించేందుకు భూములపై కుట్రలు చేశారు. వారి భూములను అన్యాయంగా, అక్రమంగా, చట్టవిరుద్ధంగా నిషేధ భూముల జాబితాలో చేర్చారు. వారికి కంటిమీద కునుకులేకుండా చేసిన రాజకీయ కక్షసాధింపులకు పాల్పడ్డ ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఇలా రాష్ట్రం అంతా కలిపి 38వేల ఎకరాలను 22(ఏ)(1)(ఇ) కేటగిరీలో చేర్చి వేధింపులకు పరాకాష్ఠను చూపించారు. ఇక ఆ వేధింపులకు కాలం చెల్లింది. ఆ భూములకు స్వేచ్ఛ లభించనుంది. అన్యాయంగా, అకారణంగా నిషేధ జాబితా 22(ఏ)లో చేర్చిన భూములు ఒక్క క్షణం కూడా అలా ఉండటానికి వీల్లేదని, వెంటనే స్వేచ్ఛ కల్పించాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రయోజనాలతో సంబంధం లేని, పట్టా, ప్రైవేటు భూములను 22(ఏ) నుంచి తొలగించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మార్గదర్శకాలు జారీ చేశారు. వీటితో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులు, మాజీ సైనికులు..ఇలా ఆనాడిలా, పరతుగల పట్టా భూములపై లోగడ ఇచ్చిన ఉత్తర్వులు, మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని నిషేధ విముక్తి కల్పించాలని ఆయన ఆదేశించారు. దీంతో వేలాదిమంది సాగు భూములకు స్వేచ్ఛ లభించనుంది. ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకోనుందని ఈనెల 8వ తేదీన

మిగతా 12వ పేజీలో...

భారత ఎన్నికల్లో బైడెన్ జోక్యం **2**

- అక్కడ ఎవరినో గెలిపించేందుకు యత్నించారు
- భారత్‌లో ఓటింగ్‌కు మన నిధులెందుకు?
- దీని గురించి మనం భారత ప్రభుత్వానికి తెలియజేయాలి: ట్రంప్
- విదేశీ శక్తుల ఆయుధంగా రాహుల్: బీజేపీ
- భారత్‌కు 'యూఎస్ఎయిడ్'పై శ్వేతపత్రానికి కాంగ్రెస్ డిమాండ్



ఢిల్లీలో కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం

సీఎంగా రేఖా గుప్తా ప్రమాణం
హాజరైన ప్రధాని, ఎన్డీయే సీఎంలు

హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణ

ఆందోళనకరం

ఇది న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై ప్రభావం చూపుతుంది: సుప్రీం



పూజా సామగ్రి తదితర వ్యర్థాలతో సంగమం నీళ్లు

మహా కుంభమేళా ప్రారంభానికి ముందే నీళ్ల మీద పరీక్ష జరిపి..

ఆ నివేదిక ఇస్తారా? **2**

- మా సమయాన్ని వృథా చేయదలిచారా?.. 250 పేజీల్లో ఫీకల్ కోలిఫామ్ ప్రస్తావనే లేదు
- కుంభమేళాలో నీటి కాలుష్యానికి సంబంధించి యూపీపీసీబీ అఫిడవిట్‌పై ఎన్జీటీ ఆగ్రహం
- సీపీసీబీ నివేదికతో విభేదిస్తున్నారా అని నిలదీత.. వారంలో కొత్త నివేదిక ఇస్తామన్న యూపీ
- కుంభమేళాలో మహిళా భక్తుల స్నానాల వీడియోలు!.. విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

28న రాష్ట్ర బడ్జెట్ **12**

24 నుంచి అసెంబ్లీ సమావేశాలు

పత్తి కొనుగోళ్లలో రికార్డు

పదేళ్ల తర్వాత తొలిసారి 20 లక్షల క్వింటాళ్ల కొనుగోలు **3**

తిరుపతిలో అతి పెద్ద రన్‌వే **14**

ఐఏఎస్ దినేశ్ కుమార్‌ది

రాజద్రోహం

ఎండీగా ఆయన తీరుతో ఫైబర్‌నెట్‌కు రూ.వందల కోట్ల నష్టం



- ఆ నష్టాన్ని ఆయన నుంచి రికవరీ చేయాలి
- గత యాజమాన్యంతో కుమ్మక్కు.. సంస్థ మూసివేతకు కుట్ర?
- తీసేసిన ఉద్యోగులకూ 3 నెలలుగా జీతాలు
- అధికారుల తీరుతో సంస్థకు రూ.377 కోట్ల 'జీఎస్టీ' జరిమానా
- ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ జీవీరెడ్డి తీవ్ర ఆరోపణలు **14**
- విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ముగ్గురు అధికారుల తొలగింపు

హైకోర్టులో వంశీకి షాక్



- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

వంశీ కారులో సత్యవర్ధన్!

- వాంగ్మూలం ఇచ్చాక బెజవాడ నుంచి హైదరాబాద్‌కు
- ఆ మరుసటి రోజు రెండు కార్లలో విశాఖకు తరలింపు **13**
- సీసీ కెమెరాల ఫుటేజీలను విశ్లేషిస్తున్న పోలీసులు

సేకరించిన సాక్ష్యాధారాలు నేర నిరూపణకు సరిపోవు | మార్గదర్శి కేసులో సీఐడీ కౌంటర్ **2**



పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ

కూటమి హయాంలో అందుతున్న నిధులు

- వడివడిగా సాగుతున్న అభివృద్ధి పనులు
- జగన్ పాలనలో పల్లెల సొమ్ము విద్యుత్‌కు
- ఇష్టానుసారంగా పల్లె నిధుల దారి మళ్లింపు
- ఆర్థిక సంఘం ఇచ్చే సొమ్మూలూ ఉచితాలకు
- తాము అధికారంలోకి వస్తే.. పల్లె నిధులు నేరుగా పంచాయతీలకు ఇస్తామన్న కూటమి
- పగ్గాలు చేపట్టాక.. సర్పంచ్‌ల ఖాతాలకు జమ

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ లభించింది. జగన్ పాలనలో నిధుల లేక నీరసించిన గ్రామ పంచాయతీలు కోలుకుంటున్నాయి. గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ అవుతుండడంతో పల్లెల్లో పనులు పరుగులు పెడుతున్నాయి. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు నేరుగా జమ చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవడంతో పల్లె పనులకు నిధుల కొరత తీరుతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ పాలనలో కళ తప్పిన పంచాయతీలు.. కూటమి హయాంలో గాడిన పడుతున్నాయి. పంచాయతీలకు దక్కే నిధులను గత ప్రభుత్వం దారి మళ్లిస్తే.. ప్రస్తుత సర్కారు మాత్రం ప్రతి రూపాయినీ పంచాయతీలకే అప్పగిస్తోంది. ఫలితంగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. గత జగన్ ప్రభుత్వం.. గ్రామ పంచాయతీలకు రాజ్యాంగపరంగా దక్కుతున్న కేంద్రం నిధులను సైతం ఇతర పథకాలకు మళ్లించింది. దీంతో గ్రామాల్లో తాగునీటి మోటార్లను సైతం మరమ్మతు చేసుకోలేని దుస్థితిలో పంచాయతీలు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. సీఎం చంద్రబాబు ఆదేశాలు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యం, రోడ్ల నిర్మాణాలతో పాటు 15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారం పనులు

మిగతా 2వ పేజీలో...



జొన్నవారీగా భోజనం మెనూ

- వేసవి సెలవుల వరకు పాఠశాలల్లో ట్రయల్ రన్
- ప్రాంతీయ ఆహార అలవాట్లకు ప్రాధాన్యం **12**
- ఫీడ్‌బ్యాక్ ఆధారంగా తదుపరి నిర్ణయం

పాఠశాలల్లో మెంటార్ వ్యవస్థ

- బడులు తెరిచే నాటికే విద్యార్థులకు కిట్లు
- టీచర్లకు ఇకపై ఒకటే యాప్ ఉండాలి.. సమీక్షలో లోకేశ్

ఎస్పీడీసీఎల్ మారదా?

- అధిక ధరలకు ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు సిద్ధం
- జగన్ హయాంలో అస్మదీయుల నుంచి అడ్డగోలుగా కొనుగోళ్లు
- ఆయన ఓడినా ఆ దిక్కుండ అదే తీరు.. ఒక్కో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ రూ.1,19,900కి కోట్ చేసిన సంస్థలు **12**
- తెలంగాణాతో పోలిస్తే 52,391 ఎక్కువ.. ఛత్తీస్‌గఢ్ కంటే 42 వేలు అధికం.. అట్టే.. ప్రైస్ బిడ్లు ఇంకా తెరవలేదు: సీఎండీ



జనవరి 12న సేకరించిన పాత నమూనాలతో నివేదికా?

» మా సమయాన్ని వృథా చేయడానికి ఇచ్చారా?

» కుంభమేళాలో నీటి కాలుష్యానికి సంబంధించి యూపీపీసీబీ అఫిడవిట్‌పై ఎన్జీటీ తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కోట్లాది మంది పుణ్యస్నానాలు ఆచరిస్తున్న మహా కుంభమేళా స్నానఘట్టాల్లో నీటి నాణ్యతకు సంబంధించి.. ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు(యూపీపీసీబీ) దాఖలు చేసిన ప్రమాణపత్రంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) మండిపడింది. మేళా మొదలు కావడానికి ముందు రోజైన జనవరి 12న సేకరించిన నమూనాలకు సంబంధించిన రిపోర్టులు ఇవ్వడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రయాగరాజ్‌లోని త్రివేణీ సంగమ ప్రాంతంలో నీటి నాణ్యత దారుణంగా ఉందని.. ఆ నీటిలో 'ఫీకల్ కొలీఫామ్' నిర్ణీత స్థాయిలకు వించి ఉందని, ఆ నీరు స్నానానికి పనికిరాదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఎన్జీటీకి ఇటీవలే నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 18న యూపీపీసీబీ ఆ నివేదికను ఎన్జీటీకి సమర్పించింది. ప్రయాగరాజ్‌లో నీటి నాణ్యత చాలా బాగుందని అందులో పేర్కొంది. ఎన్జీటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, జ్యుడీషియల్ మెంబర్ జస్టిస్ సుధీర్ అగర్వాల్, ఎక్స్‌పర్ట్ మెంబర్ ఎ.సెంథిల్ వేల్‌తో కూడిన బెంచ్.. 19న దీనిపై విచారణ జరిపింది. యూపీపీసీబీ తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వొకేట్ జనరల్ గరిమా ప్రసాద్.. నీటి నమూనాలు ఎక్కడ సేకరిస్తోందనే విషయంపై సీపీసీబీ నుంచి తమకు ఎలాంటి సమాచారమూ లేదని పేర్కొన్నారు. నీటిలో కాలుష్య నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నివేదికను మంగళవారమే సమర్పించినట్లు తెలిపారు. "అసలు మీరిచ్చిన 250 పేజీల నివేదికలో ఫీకల్ కొలీఫామ్ స్థాయుల గురించి ఎక్కడా లేదు. పైగా ఆ నమూనాలు సేకరించింది జనవరి 12న. ఈ మాత్రం దానికి అంత పెద్ద డాక్యుమెంట్ ఎందుకు సమర్పించారు? మా సమయాన్ని వృథా చేయడానికా?" అని నిప్పులు చెరిగింది. 'సీపీసీబీ నివేదికతో విభేదిస్తున్నారా? దాన్ని సవాల్ చేస్తున్నారా?' అని నిలదీసింది. దీనికి ఏఏజీ.. రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, ఇటీవలే యూపీపీసీబీ కొన్ని నమూనాలు సేకరించిందని, ఆ వివరాలన్నింటితో కలిపి కొత్త అఫిడవిట్‌ను వారం రోజుల్లోగా దాఖలు చేస్తామని పేర్కొన్నారు. దీంతో ఎన్జీటీ తదుపరి విచారణను ఫిబ్రవరి 28కి వాయిదా వేసింది.

మహిళా భక్తుల స్నానాల వీడియోలు!

లఖ్‌నవూ: మహాకుంభమేళాలో మహిళా భక్తులు స్నానం చేస్తున్న దృశ్యాలను రికార్డు చేసి ఆ వీడియోలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. సదరు వ్యక్తులపై యూపీ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. రెండు సోషల్ మీడియా ఖాతాలపై న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ప్రయాగ్‌రాజ్‌లోని గంగానదిలో మహిళలు స్నానం చేస్తున్న, దుస్తులు మార్చుకుంటున్న వీడియోలను కొందరు దుండగులు సోషల్ మీడియా వేదికల్లో రూ.2,000-3,000 చొప్పున విక్రయిస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ ద్వారా ఈ తరహా వీడియోలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

లోకం తీరు



పనామాలో వలసదారుల నిర్బంధం!

» అమెరికా బహిష్కరించిన 300 మందిలో భారతీయులు కూడా..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: అమెరికా నుంచి బహిష్కరణకు గురైన వందలాది మంది అక్రమ వలసదారులను ఆ దేశ మిలటరీ పనామాకు చేర్చింది. దాదాపు 300 మందిని పనామాలోని ఓ హోటల్‌లో నిర్బంధించారని, వారిలో భారతీయులు కూడా ఉన్నారని వార్తలు వచ్చాయి. కొంత మంది ఆ హోటల్ రూమ్ కిటికీల నుంచి 'కాపాడండి(హెల్ప్)', 'మా దేశంలో మేం సురక్షితంగా ఉండలేం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం కనిపించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేపట్టిన డ్రైవ్‌లో భాగంగా ఈ అక్రమ వలసదారులను వారి స్వదేశాలకు పంపే క్రమంలో పనామాకు చేర్చారు. ఐరాస శరణార్థి సంస్థ, అంతర్జాతీయ వలస సంస్థల అధికారులు వారిని తమ దేశాలకు పంపే ఏర్పాట్లు చేసే వరకు పనామా ప్రభుత్వం బయటకు పంపేందుకు అనుమతించలేదు. అక్రమ వలసదారుల్లో 40% మంది స్వచ్ఛందంగా తమ స్వదేశాలకు తిరిగి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని అక్కడి అధికారులు చెబుతున్నారు.

ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం. వివిధ దేశాల నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్యను 2.70లక్షలకు పరిమితం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్ప టి వరకూ అధికారికంగా ప్రకటన లేనప్పటికీ ఆస్ట్రేలియా ఫెడరల్ ఎన్నికల సమయానికి ఆ ప్రకటన ఉండవచ్చని పరిశీలకులు అంచనా.

సిగరెట్లపై జీఎస్టీ 40 శాతానికి పెంపు యోచన!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని 40 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రస్తుతం 28% ఉంది. దీంతోపాటు కాంపెన్సేషన్ సెస్, ఇతర చార్జీలు కలిపి 53 శాతం దాకా అవుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంపెన్సేషన్ సెస్ గడువు 2026 మార్చి 31తో ముగుస్తుంది. అయినప్పటికీ మొత్తం పన్నుపై దీని ప్రభావం పడకుండా ఉండేందుకు జీఎస్టీని పెంచాలని భావిస్తోంది. కాగా, సిగరెట్లపై పన్ను 75%దాకా ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు కన్నా తక్కువే కానుంది.

ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి20: కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ ఆస్పత్రిలో చేరారు. ఉదర సంబంధిత సమస్యలతో ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆమె శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

యువతకు కొత్త నైపుణ్యాలు నేర్పించి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ రెండో విడతకు కేంద్రప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ స్కీమ్ కింద 300పైగా కంపెనీల్లో లక్షకు పైగా అవకాశాలున్నాయి. ఇంటర్న్‌షిప్ కోసం మార్చి 12లోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://pminternship. mca.gov.in/login/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ఆ సాక్ష్యాధారాలు నేర నిరూపణకు సరిపోవు!

» సీఏ శ్రవణ్‌కుమార్ విషయంలో ఉల్లంఘనలకు పాల్పడలేదు

» హెబియస్ కార్పస్‌ను కొట్టివేయండి... హైకోర్టులో సీఐడీ కౌంటర్

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి చిట్స్‌పై నమోదు చేసిన కేసులో సేకరించిన సాక్ష్యాధారాలు నేరనిరూపణకు సరిపోవని సీఐడీ ఓ నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్(వాస్తవాలు గ్రహించడంలో పొరపడడం)' కింద కేసు మూసివేసి సంబంధిత కోర్టులో తుది నివేదిక దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని దర్యాప్తు అధికారి సీఐడీ అదనపు డీజీని కోరారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేసులో చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ) కుదరవల్లి శ్రవణ్‌కుమార్ అరెస్టుకు సంబంధించి 2023లో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో విజయవాడ సీఐడీ ప్రాంతీయ కార్యాలయం అదనపు ఎస్పీ డి.ప్రసాద్ తాజాగా వేసిన కౌంటర్‌లో ఈ అంశాలు తెలియజేశారు. 'దర్యాప్తులో భాగంగా సేకరించిన సాక్ష్యాధారాలు నేరనిరూపణకు సరిపోవని, ఈ నేపథ్యంలో నో ఎవిడెన్స్ కింద సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ వేసేందుకు తగిన సూచనలు ఇవ్వాలని పూర్వ దర్యాప్తు అధికారి(ఐవో), అదనపు ఎస్పీ రాజశేఖరరావు.. సీఐడీ ఏడీజీకి లేఖ రాశారు. ఈ విషయంలో న్యాయసలహా తీసుకున్న ఏడీజీ.. 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' కింద కేసు మూసివేతకు అనుమతిచ్చారు. పూర్వ ఐవో బదిలీ అయ్యాక విజయవాడ సీఐడీ ప్రాంతీయ కార్యాలయం డీఎస్పీ జి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా డాక్యుమెంట్ల రూపంలో సేకరించిన సాక్ష్యాలు, మౌఖిక సాక్ష్యాలు నేర నిరూపణకు సరిపోవని భావించారు. ప్రస్తుత కేసును 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా పరిగణించి సంబంధిత కోర్టుకు నివేదించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఫైనల్ రిపోర్ట్‌ను మంగళగిరి సీఐడీ ఏడీజీ కార్యాలయానికి పంపారు. కేసులో నిందితులుగా ఉన్న ఎంసీఎఫ్‌పీఎల్ ఛైర్మన్, ఎండీలకు మాత్రమే అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. సీఏ శ్రవణ్‌కుమార్ విషయంలో పోలీసులు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదు. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి నర్మద దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వీఎస్ఎస్‌వీ కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మార్గదర్శి ఛైర్మన్, ఎండీ, ఫోర్‌మెన్, ఆడిటర్ మరికొందరిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో చార్టర్డ్ అకౌంటెంట్ శ్రవణ్‌కుమార్‌ను సీఐడీ అధికారులు 2023లో అరెస్టు చేశారు. విజయవాడ మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆయనకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. తన భర్తకు రిమాండ్ విధించే అధికారం విజయవాడ మూడో ఏసీఎంఎంకు లేదంటూ ఆయన సతీమణి కె.నర్మద హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

ఆ 55 మంది వైద్యులను తక్షణమే తొలగించండి

» ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని ఆదేశాలు

కర్నూలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలల్లో పని చేస్తున్న 55 మంది ప్రొఫెసర్ స్థాయి వైద్యులను విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ ఉత్తర్వులను ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని సమర్థించారు. వెంటనే వారిని విధుల నుంచి తొలగించాలని గురువారం అధికారులకు ఆదేశాలిచ్చారు. తొలగింపునకు గురైన వైద్యులు అందరూ ముందస్తు అనుమతులు లేకుండా దీర్ఘకాలంగా సెలవుల్లో ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసుకూ స్పందించలేదు. రాష్ట్రంలో దాదాపు 78 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యులు విధులకు రాకాకుండా, అనుమతులు తీసుకోకుండా, ఏపీ లీవ్ రూల్స్-1993కి విరుద్ధంగా సెలవుల్లో ఉన్నారు. తద్వారా రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదంటూ ఓ సామాజిక కార్యకర్త లోకాయుక్తను ఆశ్రయించారు. నం.1393/2023/బీ1 ఫిర్యాదును స్వీకరించిన లోకాయుక్త విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలంటూ ఏపీ వైద్య విద్య డైరెక్టర్‌ను ఆదేశించింది. దీనిపై 2023 ఆగస్టు 10వ తేదీలోగా సమాధానం ఇవ్వాలంటూ వారికి నోటీసులు జారీ చేయగా... 55 మంది వైద్యులు స్పందించలేదు. జీఓ ఎంఎస్ నంబరు.128, 129 ప్రకారం వారిని ఉద్యోగం నుంచి అధికారికంగా తొలగిస్తూ ఏపీ వైద్య విద్య డైరెక్టర్ 2023, నవంబరు 24న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు అమలులో జాప్యం లేకుండా తక్షణమే అమలు చేయాలని ఉప లోకాయుక్త పి.రజని ఆదేశాలు జారీ చేస్తూ సదరు ఫిర్యాదును ముగించారు.

కొలువుతీరిన బీజేపీ ప్రభుత్వం

ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా.. మంత్రులుగా ఆరుగురి ప్రమాణం

» తొలి క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

» ఢిల్లీలో 'ఆయుష్మాన్ భారత్' అమలు



కొత్త మంత్రివర్గాన్ని అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి20: ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం కొలువుతీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణం చేశారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో వేలాది మంది కార్యకర్తల సమక్షంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మంత్రివర్గ ప్రమాణాలు చేయించారు. మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో పర్వేశ్ వర్మ, మంజిందర్ సింగ్ సిర్సా, కపిల్ మిశ్రా, ఆశిశ్ సూద్, రవీందర్ ఇంద్రజ్ సింగ్, పంకజ్ సింగ్ ఉన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, బీజేపీ సీఎంలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. మంత్రివర్గ ప్రమాణం తర్వాత ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఎన్డీయే నేతలకు లంచ్ ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్డీయే నేతల ను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. రానున్న రెండేళ్లలో జరగబోయే ఎన్నికల్లో విపక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత సచివాలయంలో రేఖా గుప్తా సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఢిల్లీ యమునా నదీ తీరంలోని వాసుదేవ్ ఘాట్ వద్ద నిర్వహించిన హారతి కార్యక్రమంలో కొత్త మంత్రివర్గం పాల్గొంది. ఆ తర్వాత సచివాలయంలో జరిగిన తొలి క్యాబినెట్ భేటీలో రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ఆప్ సర్కారు పదేళ్ల పాలనపై కాగ్ నివేదికను ప్రవేశపెట్టాలని నిర్ణయించామన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఢిల్లీలో అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.



ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కరచాలనం

ఎవరెవరికి ఏ పదవులు?

ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆర్థిక, విజిలెన్స్ శాఖలతో పాటు, మహిళా, శిశు సంక్షేమ, సాధారణ పరిపాలన శాఖలు తన వద్దే ఉంచుకున్నారు. పర్వేశ్ వర్మకు ప్రజాపనులు, జలవనరులు, వ్యవసాయ శాఖలు కేటాయించారు. ఆశిశ్ సూద్‌కు హోం, విద్య, పట్టణాభివృద్ధి శాఖలను కేటాయించారు. మంజిందర్ సింగ్ సిర్సాకు పరిశ్రమలు, పర్యావరణ శాఖలు, కపిల్ మిశ్రాకు న్యాయ, పర్యాటక శాఖలను, పంకజ్ కుమార్ సింగ్‌కు ఆరోగ్యశాఖ, రవీందర్ ఇంద్రజ్ సింగ్‌కు సామాజిక సంక్షేమ శాఖలను కేటాయించారు.

వికసిత్ ఢిల్లీ కోసం ఉద్యమం: రేఖ

ఇంటినుంచి బయలుదేరినప్పుడు సీఎం అవుతానని తనకు తెలియదని రేఖా గుప్తా వెల్లడించారు. తన పేరును పర్వేశ్ వర్మ ప్రతిపాదించేదాకా తనకు తెలియదన్నారు. ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని, వికసిత్ ఢిల్లీ కోసం ఉద్యమ తరహాలో శ్రమిస్తామన్నారు. కేజ్రీవాల్ హయాంలో నిర్మించిన శీశ్‌మహల్(అద్దాల మేడ)ను మ్యూజియంగా మారుస్తామన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎంపికయ్యారు. ఎన్నికల్లో ఆయన రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచారు. 2015లో నాటి ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబాపై ఎమ్మెల్యే ఓపీ శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో సభలో కలకలం రేగింది. సభలో చేపట్టిన ఆందోళనల్లో పాల్గొన్నారంటూ విజేందర్ గుప్తాను నాటి స్పీకర్ సస్పెండ్ చేశారు. అయితే బయటకు వెళ్లేందుకు నిరాకరించడంతో ఆయన్ను మార్షల్స్ సభ బయటకు తీసుకెళ్లారు. పదేళ్ల విజేందర్ గుప్తా స్పీకర్‌గా ఎంపికయ్యారు.

హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణ ఆందోళనకరం

» సుప్రీంకోర్టు వ్యాఖ్య

» వెంటనే నిలిపివేయాలని ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హైకోర్టు సిటింగ్ జడ్జిపై అందిన ఫిర్యాదులను లోక్‌పాల్ విచారణకు స్వీకరించడం 'చాలా చాలా ఆందోళనకర విషయమ'ని గురువారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇది న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై ప్రభావం చూపించేదని అభిప్రాయపడింది. అసలు లోక్‌పాల్‌కు ఆ పరిధి ఉందా అని ప్రశ్నించింది. దీనిని వెంటనే నిలిపివేయాలని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాల ప్రత్యేక ధర్మాసనం ఆదేశించింది. ఫిర్యాదును రహస్యంగా ఉంచాలని, న్యాయమూర్తి పేరును వెల్లడించకూడదంటూ ఫిర్యాదుదారుకు ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సమస్యపై వైఖరి చెప్పాలని కేంద్రం, లోక్‌పాల్ రిజిస్ట్రార్, ఫిర్యాదుదారుకు నోటీసులు పంపించింది. ఫిర్యాదుదారు పేరునూ బయటపెట్టొద్దని, ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు సూచించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ హైకోర్టు సిటింగ్ జడ్జీలు లోక్‌పాల్, లోకాయుక్త చట్టం-2013 పరిధిలోకి రారని స్పష్టం చేశా రు. గత నెల 27న ఓ హైకోర్టు జడ్జిపై జస్టిస్ ఎ.ఎం.ఖాన్విల్కర్ ఆధ్వర్యంలోని లోక్‌పాల్ బెంచ్ విచారణ ప్రక్రియను ప్రారంభించడంపై తనుకుతానుగా సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. ధర్మాసనం కార్యకలాపాలను ప్రారంభించగానే జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ లోక్‌పాల్ చేపట్టిన విచారణపై స్టే విధిస్తున్నట్టు ప్రకటించారు. తదుపరి విచారణను మార్చి 18న చేపట్టనున్నట్టు ప్రకటించారు.

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ 8 నెలల్లో 33,365 పనులు పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ 15వ ఆర్థిక సంఘం నిధులను రాబట్టుకునేందుకు పదే పదే ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి, కేంద్ర ఆర్థికమంత్రితో నిధుల విషయంపై వినతిపత్రాలు అందించారు. ఓ వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, మరో వైపు ఉపముఖ్యమంత్రి పదే పదే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేపట్టడంతో కేంద్రం నుంచి ఎప్పటికప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతున్నాయి. ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో గత వైసీపీ ప్రభుత్వం అప్రతిష్ఠ తీసుకురావడంతో దానిని సరిచేసి మళ్లీ కేంద్ర అధికారుల దృష్టి మన వైపు మళ్లించేందుకు చేసిన ప్రయత్నం ఫలించింది.

వైసీపీ హయాంలో.. నిధులు డిస్కంకు

జగన్ హయాంలో పంచాయతీల నిధులను ప్రభుత్వం పంచాయతీల అనుమతి లేకుండానే లాగేసుకుంది. కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 2022-23 సంవత్సరం వరకు రూ.2,165 కోట్లు డిస్కంకు చెల్లించేలా దారి మళ్లించారు. వీటితో పాటు ఎల్ఈడీ వీధిలైట్ల కోసం ఈఈఎస్ఎల్ సంస్థ కోసం మరో రూ.100 కోట్లు పంచాయతీ ఖాతాల్లో నుంచి చెల్లించారు. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు చెల్లించడంతో అప్పట్లో వారు ధర్నాలు, నిరసనలకు దిగారు. అయినప్పటికీ జగన్ సర్కార్ ఖాతరు చేయలేదు. నిరసనలు చేపట్టిన సర్పంచ్‌లను పోలీసులతో కట్టడి చేశారు. దీంతో వైసీపీ చెందిన సర్పంచ్‌లే ఆ ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. వైసీపీ సర్కార్ పంచాయతీ నిధులు దారిమళ్లిస్తోందని కేంద్రానికి సర్పంచ్‌లు ఫిర్యాదులు చేయడంతో 2022-23 తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా పంచాయతీల ఖాతాల్లోకే నిధులు జమ చేయాలని కేంద్రం నిబంధనలు పెట్టింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.998.64 కోట్లు 2024 మార్చిలో విడుదల చేస్తే ఆ నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం 45 రోజులపాటు అంటే మే 30 దాకా విడుదల చేయలేదు. చివరకు కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఆగస్టు 21న పంచాయతీరాజ్ సంస్థలకు నిధులు విడుదల చేయడంతో సర్పంచ్‌లు సంతోషం వ్యక్తం చేశారు.

సజావుగా నిధుల విడుదల

కూటమి ప్రభుత్వం వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల సజావుగా సాగుతోంది. 2024-25కి సంబంధించి రెండు విడతల్లో రూ.2,109 కోట్లు విడుదలయ్యాయి. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు అందిస్తామన్న హామీని కూటమి కచ్చితంగా అమలు చేస్తోంది.

సర్పంచ్‌ల విన్నపాలు..

- గతంలో మాదిరిగా డిస్కంలకు విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలు చెల్లించే విధానానికి స్వస్తి పలకాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.
- తాము వాడని విద్యుత్‌కు పంచాయతీల నుంచి నిధుల వసూలుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఆదాయాల్లేని గ్రామ పంచాయతీలకు రూ.లక్షలు విద్యుత్ చార్జీలు వసూలు చేయడంతో వందల సంఖ్యలో మైనర్ గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులన్నీ డిస్కంలకు చెల్లించారని, దీంతో చేతిలో నిధులు లేకుండా పోయాయని సర్పంచ్‌లు చెబుతున్నారు.
- డిస్కంలకు పంచాయతీల నుంచి నేరుగా నిధులు వినహాయించుకునేందుకు అప్పట్లో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఆర్థికశాఖను కోరుతున్నారు.
- పంచాయతీరాజ్ కమిషనర్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని ఇక నుంచి డిస్కంలకు గ్రామ పంచాయతీ నిధుల మళ్లింపును నిలిపేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

భారత ఎన్నికల్లో బైడెన్ జోక్యం

న్యూయార్క్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: భారత దేశ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు యూఎస్ఎయిడ్ నిధులు రూ.181 కోట్లు (21 మిలియన్ డాలర్లు) వెచ్చించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో మరెవరినో గెలిపించేందుకు నాటి బైడెన్ ప్రభుత్వం ప్రయత్నించినట్టుందని ఆరోపించారు. ఇది భారతదేశ ఎన్నికల్లో జోక్యం చేసుకోవడమేనని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉందన్నారు. గురువారం మియామీలో ఎఫ్ఐఐ ప్రయారిటీ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలోనూ అనేక సార్లు ఈ అంశాన్ని ట్రంప్ లేవనెత్తారు. బుధవారం కూడా భారత్‌లో ఓటింగ్ శాతం పెంచడానికి అమెరికా నిధులు ఎందుకివ్వాలని ట్రంప్ ప్రశ్నించారు. యూఎస్ఎయిడ్ ద్వారా వివిధ దేశాలకు అమెరికా నుంచి అందుతున్న సాయానికి సంబంధించిన జాబితాను ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ) ఇటీవల విడుదల చేసింది. భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల కమిషన్‌కు రూ.181 కోట్లు ఇవ్వడం కూడా ఆ జాబితాలో ఉంది. దీనిపై ఎఫ్ఐఐ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ తాను అధ్యక్షుడవ్వక ముందు అమెరికా నిధులు ఎలా దుర్వినియోగమయ్యాయనేందుకు ఇదొక ఉదాహరణ అన్నారు. 'భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు మనమెందుకు రూ.181 కోట్లు వెచ్చించాలి? అక్కడ మరెవరినో గెలిపించేందుకు వారు(బైడెన్ యంత్రాంగం) ప్రయత్నించి ఉంటారని నాకు అనిపిస్తోంది. మనం ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి తెలియజేయాలి. మన దేశంలో రష్యా కేవలం 173 రూపాయలు (2 డాలర్లు) వెచ్చించిందంటేనే అదొక పెద్ద డీల్ అవుతుంది. భారత ఎన్నికల్లో మనం రూ.181 కోట్లు వెచ్చించడం అదొక సంచలనమే. బంగ్లాదేశ్‌లో రాజకీయాలను బలోపేతం చేయడానికి రూ.251 కోట్లు (29 మిలియన్ డాలర్లు) వెచ్చించారు. ఆసియా దేశాలు ఆర్థికంగా బలంగా ఉన్నాయి. వాటికి మన నిధులు ఇవ్వనవసరం లేదు' అన్నారు.



నాటో దేశాలన్నింటి నుంచి అమెరికా సేనల ఉపసంహరణ?

సౌదీ అరేబియాలో ఈ వారం జరగనున్న అమెరికా, రష్యా చర్చల అనంతరం అన్ని నాటో దేశాల నుంచి అమెరికా సేనలను ఉపసంహరించనున్నట్టు జర్మనీ పత్రిక 'బిల్డ్' తాజాగా కథనాన్ని ప్రచురించింది. అయితే, ఈ కథనాన్ని ఇంతవరకు వైట్‌హౌస్ నిర్ధారించలేదు.

భారత్‌లో రాజకీయ దుమారం

ట్రంప్ తాజా వ్యాఖ్యలు భారత్‌లో రాజకీయ దుమారం రేపుతున్నాయి. తాను తిరిగి అధికారంలోకిరాకుండా అడ్డుకునేందుకు విదేశీ శక్తులు ప్రయత్నిస్తున్నాయని ప్రధాని మోదీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో చేసిన వ్యాఖ్యలను ట్రంప్ తాజా వ్యాఖ్యలు నిర్ధారిస్తున్నాయని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ గురువారం 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టారు. భారత ప్రయోజనాలను దెబ్బతీసే విదేశీ శక్తులకు రాహుల్ ఆయుధంగా మారారని ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా యూఎస్ఎయిడ్ ద్వారా భారత్‌లోని సంస్థలకు అందుతున్న సాయానికి సంబంధించి ప్రభు త్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు.

సిటీ కిల్లర్!

భూమి దిశగా దూసుకొస్తున్న భారీ గ్రహశకలం



» 2032 డిసెంబరులో భూమిని తాకొచ్చు

» దక్షిణ అమెరికా నుంచి పసిఫిక్ మహా సముద్రం, ఆఫ్రికా మీదుగా ఆసియా దాకా ఎక్కడైనా పడొచ్చు

» భారత్‌లో ముంబై, కోల్‌కతా ఆ పరిధిలో

న్యూయార్క్, ఫిబ్రవరి 20: దాదాపు 130నుంచి 300 అడుగుల విస్తీర్ణం ఉన్న భారీ గ్రహశకలం ఒకటి భూమి దిశగా గంటకు 46,800 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తోంది! ఇది భూమిని 2032 డిసెంబరు 22న ఢీకొట్టే ప్రమాదం ఉందని నాసా హెచ్చరించింది. ఈ గ్రహశకలానికి నాసా శాస్త్రజ్ఞులు '2024 వైఆర్4'గా నామకరణం చేశారు. న్యూయార్క్‌లోని స్వేచ్ఛాప్రతిమ (స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ) అంతపెద్దగా ఉండే ఈ గ్రహశకలం ఢీకొంటే భూమ్మీద ఏకంగా ఒక నగరమే నాశనమైపోతుందనే అంచనాల నేపథ్యంలో దీన్ని 'సిటీ కిల్లర్'గా కూడా వ్యవహరిస్తున్నారు. దక్షిణ అమెరికాలోని ఉత్తర భాగం నుంచి పసిఫిక్ మహాసముద్రం, సబ్-సహారన్ ఆఫ్రికా మీదుగా ఆసియా దాకా.. ఎక్కడైనా ఇది భూవాతావరణంలోకి ప్రవేశించే ముప్పుందని అంచనా వేస్తున్నారు. ఈ పరిధిలో ఈక్వెడార్, కొలంబియా, వెనెజువెలా, నైజీరియా, సూడాన్, ఇథియోపియా, పాకిస్థాన్, భారత్, బంగ్లాదేశ్ దేశాలున్నాయి. భారత్‌లో ముంబై, కోల్‌కతాలకు ముప్పుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అత్యంత వేగంతో ఈ గ్రహశకలం భూవాతావరణంలోకి ప్రవేశించినప్పుడు జరిగే పేలుడు తీవ్రత.. హిరోషిమాలో అణుబాంబు పేలుడు కన్నా 500 రెట్లు అధికంగా ఉంటుందని శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. హిరోషిమాలో అణుబాంబు పేలుడు తీవ్రత 15 కిలోటన్నుల టీఎన్‌టీ కాగా.. ఈ గ్రహశకలం పేలుడు తీవ్రత 15-30 మెగాటన్నుల టీఎన్‌టీ దాకా ఉంటుందని వారు చెబుతున్నారు. భూమిని తాకితే.. ఆ తాకిడికి 3000 అడుగులకు పైగా వెడల్పైన గొయ్యి ఏర్పడుతుందని, ఒక పెద్ద నగరం పూర్తిగా నాశనమయ్యే స్థాయిలో దాని ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ గ్రహశకలం భూమికి దాదాపుగా 37 మిలియన్ మైళ్ల దూరంలో ఉంది. ఇది భూమిని ఢీకొట్టే ప్రమాదం 3.1శాతంమేర ఉందని తొలుత మంగళవారం నాసా శాస్త్రజ్ఞులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండురోజులపాటు దాని గమనాన్ని నిశితంగా పరిశీలించిన అనంతరం.. ప్రమాద శాతాన్ని 1.5 శాతానికి తగ్గించారు.

గతంలో తుంగుస్కాలో..

1908 జూన్ 30న ఉదయం 7.15గంటల సమయంలో రష్యాలోని సైబీరియా మంచు ఎడారిలోని తుంగుస్కా నదీ పరీవాహక ప్రాంతంలో దాదాపు 177 అడుగుల విస్తీర్ణం ఉన్న భారీ గ్రహశకలం ఒకటి భూవాతావరణంలోకి ప్రవేశించి.. గాల్లోనే పేలిపోయింది. అది మంచు ఎడారికావడం, మనుషుల జాడ అత్యంత తక్కువగా ఉండే ప్రాంతం కావడంతో ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాలేదు. ఆ పేలుడు ధాటికి దాదాపు 8కోట్ల చెట్లు నిలువునా కాలిపోయాయి! 1908లోనే ఈ ఘటన జరిగినా రష్యా ప్రభుత్వం అక్కడికి 1921లో మాత్రమే శాస్త్రజ్ఞులను పంపింది. వారు అక్కడికి చేరుకోవడానికి ఆరేళ్లు పట్టింది.



భృంగి వాహనంపై శ్రీశైల మల్లన్న

శ్రీశైలం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండోరోజు గురువారం భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను భృంగివాహనంపై ఆశీనులనుజేసి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు.

ద్వారకా తిరుమల నుంచి పట్టువస్త్రాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ద్వారకా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం తరపున అధికారులు, అర్చకులు పట్టువస్త్రాలను సమర్పించారు. శుక్రవారం(నేడు) విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామిఅమ్మవార్ల దేవస్థానం తరపున భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

శ్రీవారి ఆలయ పైకప్పు మరమ్మతులు

తిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణ కోసం టీటీడీ పనులు మొదలుపెట్టింది. మూలమూర్తి కొలువైన గర్భాలయంతో పాటు పలు మండపాలు, ఉప ఆలయాల నిర్మాణం జరిగి వందల ఏళ్ల కావడంతో వాటి పైకప్పులో చాలా ప్రాంతాల్లో పగుళ్లు ఏర్పడ్డాయి. వర్షం కురిసినప్పుడు నీరు లోనికి ప్రవేశిస్తోంది. ఈ క్రమంలో గతేడాది నవంబరు 18వ తేదీన జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో ఈ సమస్యపై చర్చించి తీర్మానం చేశారు. లీకేజీల నివారణ అంశంలో అనుభవం కలిగిన టీవీఎస్ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ పనులన్నీ ఉచిత సర్వీస్ కింద చేసేందుకు ఆ సంస్థ అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా ఆ సంస్థకు చెందిన సిబ్బంది గురువారం లీకేజీ నివారణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పగుళ్లను గుర్తించి పూడ్చడంతో పాటు పెయింటింగ్ వేస్తున్నారు.

నిర్మానుష్య ముంపు గ్రామాల్లోకి వన్య మృగాలు!

- ట్రాప్ కెమెరాలో చిక్కిన చిరుత



పోలవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎగువన.. ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రామాలన్నింటినీ ఖాళీ చేయడంతో ఆయా ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. దీంతో పాపికొండల అభయారణ్యం నుంచి వన్యమృగాలు స్వేచ్ఛగా ముంపు గ్రామాల్లో సంచరిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో దొరుకుతున్న ఆహారాన్ని తీసుకుంటూ గోదావరిలో నీటిని తాగుతున్నాయి. మంచినీటి కోసం గోదావరి నదికి వెళుతున్న చిరుత ఫొటోలు పోలవరం ప్రాజెక్టు ఎగువన ముంపు గ్రామాల్లో ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలో గురువారం బయటపడ్డాయి.

రికార్డు స్థాయిలో పత్తి కొనుగోళ్లు

- 44 వేల మంది రైతుల నుంచి 20 లక్షల క్వింటాళ్లు
- పదేళ్ల తర్వాత రాష్ట్రంలో సీసీఐ కొత్త రికార్డు
- సీఎం యాప్‌తో అక్రమాలకు చెక్



సీసీఐ పత్తి కొనుగోలుకు వినియోగించే సీఎం యాప్ వెబ్‌సైట్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఈ ఏడాది రికార్డు స్థాయిలో పత్తి కొనుగోలు చేసింది. పదేళ్ల నాటి రికార్డులను సీసీఐ అధిగమించింది. రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా, కర్నూలు, అనంతపురం, పల్నాడు, పార్వతీపురం మన్యం, విజయనగరం, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన 37 కేంద్రాల్లో 20 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్టు సీసీఐ ప్రకటించింది. మొత్తం 44 వేల మంది రైతులకు మద్దతు ధర లభించింది. ఈ ఏడాది రూ.1500 కోట్ల మేర పత్తి కొనుగోళ్లు జరిగాయి. గత ఏడాది కేవలం 1.50 లక్షల బేళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసింది. ఈ ఏడాది సీఎం యాప్ వంటి సాంకేతిక పరిజ్ఞానం (డిజిటల్ ఇన్షియేటివ్)తో 3.80 లక్షల బేళ్ల పత్తిని కొనుగోలు చేశారు. చాలా రాష్ట్రాల్లో పత్తి కొనుగోళ్లలో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు కూడా తలెత్తి, కొనుగోళ్లు ఆగిపోయాయి. రాష్ట్రంలో సీఎం యాప్ వినియోగం వల్ల సమస్యలు తలెత్తలేదు. ఈ-క్రాప్‌లో పేరు నమోదు చేసుకున్న రైతు స్వయంగా సీసీఐ కేంద్రానికి వచ్చి వేలిముద్ర వేస్తేనే కొనుగోళ్లు సాగాయి. వేలిముద్ర వేసిన రైతు ఖాతాలోనే ఆధార్ ఆధారంగా నిధులు జమ చేయడంతో దళారుల ప్రమేయానికి ఆస్కారం లేకపోయింది. ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న నేతృత్వంలో రూపుదిద్దుకున్న సీఎం యాప్‌కు కూటమి ప్రభుత్వం కొత్త హంగులు తీసుకురావడంతో రైతులకు ప్రయోజనం చేకూరింది. సీజన్ ఆరంభంలో సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలులో పెద్ద రాజకీయమే జరిగింది. అప్పట్లో గుంటూరులోని సీసీఐ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తించిన మేనేజర్ పత్తి కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు సృష్టించారు. ఈ విషయం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి వెళ్లడంతో సీసీఐ మేనేజర్‌ను బదిలీ చేయించారు. సీసీఐ కొనుగోళ్ల తర్వాత ప్రైవేటు వ్యాపారులు కూడా రేటు పెంచారు. అప్పటివరకు క్వింటాల్ పత్తి ధర రూ.4,500 నుంచి రూ.5,500 వరకు మాత్రమే ఉండగా.. సీసీఐ క్వింటాల్‌కు రూ. 7,121 చెల్లించటంతో ధర పెరిగి రైతులు లాభాల బాట పట్టారు.

ఇదే టెక్నాలజీ కావాలి: ఇతర రాష్ట్రాల డిమాండ్

పత్తి కొనుగోలుకు ఏపీ ప్రభుత్వం వినియోగిస్తున్న సీఎం యాప్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు సాఫీగా సాగుతున్న విషయం తెలుసుకున్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఇక్కడకు వచ్చి.. ఇదే టెక్నాలజీ తమకూ కావాలని కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం సీసీఐ సర్వర్ సమస్యతో దేశవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయినా రాష్ట్రంలో మాత్రం యథాతథంగా జరుగుతున్నాయి.

ప్రభుత్వ సహకారంతోనే సాధ్యం



గత పదేళ్లలో సీసీఐ ద్వారా ఇంత పెద్ద మొత్తంలో పత్తి కొనుగోలు చేసినట్లు ఆధారాలు లేవు. ఈ ఏడాది సుమారు 20 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరిగాయి. ఇందుకు ప్రభుత్వ సహాయం, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడే కారణం. దీనివల్ల రైతుకు మేలు జరిగింది. ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది.

- ఇక్కుర్తి శివప్రసాద్, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ కాటన్‌టీఎంపీ అసోసియేషన్, గుంటూరు

వచ్చే ఏడాది 10 లక్షల బేళ్లు లక్ష్యం కావాలి



పత్తి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలబడింది. గత ఏడాది కూడా సీసీఐ ఉన్నా రైతులకు ఈ స్థాయిలో మేలు జరగలేదు. వచ్చే ఏడాది సీసీఐ పత్తి కొనుగోలు లక్ష్యం 10 లక్షల బేళ్లు కావాలి.

- హెచ్.వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాటన్ టీఎంపీ అసోసియేషన్, ఆదోని

సీఎం యాప్‌తో రైతులకు మేలు



సీఎం చంద్రబాబు తెచ్చిన టెక్నాలజీ పత్తి రైతులకు చాలా మేలు చేసింది. సీఎం యాప్ వల్ల రైతులే సీసీఐలో పత్తి అమ్ముకునే అవకాశం ఏర్పడింది. ఈ టెక్నాలజీతో రైతు రాజయ్యాడు.

- మన్నవ హరిబాబు, పత్తి రైతుల ప్రతినిధి



రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జగన్

పాలవలస కటుంబాన్ని పరామర్శించిన జగన్

పాలకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు గురువారం వైసీపీ అధినేత జగన్ వచ్చారు. ఇటీవల మరణించిన వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించారు. రాజశేఖరం భార్య ఇందుమతి, కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కూతురు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని ఓదార్చారు.


నేరుగా రైతుల నుంచి టమాటా కొనుగోలు

- మార్కెటింగ్ శాఖకు మంత్రి అచ్చెన్న ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): టమాటా ధరల పతనంపై తక్షణ చర్యలు తీసుకోనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. గురువారం మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత, ఉద్యానశాఖ, రైతుబజార్ల అధికారులు, జాయింట్ కలెక్టర్లతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శుక్రవారం నుంచే రైతుల నుంచి నేరుగా టమాటాలను కొనుగోలు చేసి, రైతుబజార్లలో విక్రయించాలని అధికారులను ఆదేశించారు. .

మినుము సాగును పోత్సహించాలి: అగ్రి డైరెక్టర్

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అపరాల పంటల్లో ప్రధానమైన వినుములో ప్రోటీన్ ఎక్కువ, కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. ఆరోగ్యానికి దోహదపడే మినుము సాగు, విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదన పెంచాలని రైతులకు సూచించారు. అధిక దిగుబడులిచ్చి, చీడపీడలు తట్టుకునే మినుము వంగడాలకు రూపకల్పన చేసి, రైతులకు సరఫరా చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలను కోరారు. గురువారం విజయవాడలో జాతీయ ఆహార, పోషక భద్రత మిషన్ వర్క్‌షాప్‌లో ఢిల్లీరావు మాట్లాడారు. మినుము సాగు ఎక్కువగా ఉన్న 7 జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతు ప్రతినిధులు, రంగా వర్సిటీ శాస్త్రవేత్తలు, ఏపీసీడ్స్, ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు.



కర్నూలు జీజీహెచ్‌లో జీబీఎస్ కేసు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) కేసు వెలుగు చూసింది. కర్నూలు భగత్‌సింగ్ నగర్‌కు చెందిన 44ఏళ్ల మహిళ జ్వరం, కాళ్ల నొప్పులు, బలహీనత లక్షణాలతో కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. పరీక్షల్లో ఆమెకు జీబీఎస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అధికారులు బాధిత రోగిని ఏఎంసీలో ఉంచి, ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్‌తో చికిత్స అందిస్తున్నారు. రోగి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

రాష్ట్రంలో నగరాల అభివృద్ధికి ముంబై మోడల్

- మంత్రి నారాయణ బృందం అధ్యయనం
- ముంబైలో ఎంఎంఆర్‌డీఏ అధికారులతో సమావేశం
- నగర అభివృద్ధి ప్రణాళికలపై చర్చలు



మంత్రి నారాయణకు బొకే ఇస్తున్న ముంబై అధికారులు

విజయవాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతితో పాటు ఇతర నగరాలు, పట్టణాల అభివృద్ధికి దేశ ఆర్థిక రాజధాని ముంబై నగర అభివృద్ధి మోడల్‌ను అనుసరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. నగరాభివృద్ధికి ముంబై అనుసరిస్తున్న విధానాలను మన దగ్గర కూడా అమలు చేసేందుకు ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. అక్కడి అధికారులు అనుసరిస్తున్న ప్రణాళికలపై చర్చించేందుకు మంత్రి నారాయణ బృందం ముంబైకి వెళ్లింది. గురువారం ఉదయం ముంబైలోని ఎంఎంఆర్‌డీఏ (ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులతో మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఇతర అధికారులు సమావేశమయ్యారు. ఎంఎంఆర్‌డీఏ ప్లానింగ్ డైరెక్టర్ శంకర్ దేశ్‌పాండే మంత్రికి ఘన స్వాగతం పలికారు. రోడ్లు, మెట్రోరైల్, హౌసింగ్ ప్రాజెక్టులతో సహా మహా ముంబై నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడంలో ఎంఎంఆర్‌డీఏ కీలక పాత్ర పోషిస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా ఎలా చేపడుతున్నారో మంత్రి నారాయణకు అక్కడి అధికారులు వివరించారు. విదేశీ పెట్టుబడుల సహకారంతో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు వివరించారు. అలాగే భూములను అభివృద్ధి చేయడం ద్వారా నిధులను ఎలా సమీకరిస్తున్నారో, ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణ ఏ విధంగా చేస్తున్నారనే వారు వివరించారు. మంత్రి నారాయణ బృందం పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబుతో చర్చించిన మీదట ఆయా అంశాలపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.



విద్యార్థుల పట్ల బాధ్యతతో మెలగండి

- అధికారులకు మంత్రి సవిత సూచన

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కొండపి మహాత్మాజ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల బాధ్యతతో మెలగాలని గురుకులం కార్యదర్శి మాధవీలతను ఫోన్లో ఆదేశించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని, తీవ్ర గాయాలు కావడంతో మరో మూడు రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నట్లు ఆమె తెలిపారు. మంత్రి సవిత స్పందిస్తూ బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వివరాలు అందివ్వాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కల్తీ నెయ్యి' నిందితుల బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌పై తిరుపతి రెండవ ఏడీఎం కోర్టు జడ్జి గురువారం తీర్పు రిజర్వు చేశారు. రిమాండులో వున్న నలుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారి తరపు న్యాయవాదులు ఈనెల 10వ తేదీన పిటిషన్ దాఖలు చేశారు. గురువారం కోర్టులో నిందితుల తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది వాణి వాదనలు వినిపించగా, సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్ వాదించారు. సుదీర్ఘ వాదనలు విన్న జడ్జి.. తీర్పును రిజర్వు చేశారు.

ఏప్రిల్ 30న పాలిసెట్

అమరావతి: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 30న పాలిసెట్ నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దరఖాస్తుల ప్రక్రియపై త్వరలో షెడ్యూలు జారీ చేయనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం – లాభం

అదే యుద్ధం గురించి అమెరికా నోట మొన్నటివరకూ విన్న భాష ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. బైడెన్ పోయి ట్రంప్ రాగానే యుద్ధంలో హీరోలు, విలన్లు ఒక్కసారిగా తారుమారైనారు. మూడేళ్ళ రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలో దురాక్రమణదారుడని బైడెన్‌తో అనిపించుకున్న పుతిన్‌ను ట్రంప్ సమర్థించుకొస్తున్నారు. అయ్యో పాపం అని బైడెన్ జాలిపడిన జెలెన్‌స్కీని యుద్ధపిపాసివి నీవేనంటూ తిట్టిపోస్తున్నారు. తాను శ్వేతసౌధంలో ఉండివుంటే అసలు యుద్ధమే వచ్చేది కాదని, తాను అధ్యక్షుడు కాగానే యుద్ధం ఆగిపోతుందని ట్రంప్ ఎన్నికల కాలంనుంచీ చెబుతున్నారు. సంధిలో కాస్తంత ఎక్కువ న్యాయం పుతిన్‌కు దక్కుతుందని విశ్లేషకులు సైతం ఎప్పటినుంచో అంటున్నదే. కానీ, జెలెన్‌స్కీని ట్రంప్ మరీ ఇంత నాటుగా విమర్శిస్తారని, ఆ మాటలన్నీ పూర్తిగా రష్యా పక్షాన, ఏకంగా పుతిన్ నోటనుంచి ఊడిపడినట్టుగా ఉంటాయని ఎవరూ ఊహించలేదు.

నియంత, హాస్యగాడు, ముందుచూపులేనివాడు, దుందుడుకు మనిషి ఇత్యాది మాటలతో, తక్షణమే దారికిరాకపోతే దేశాన్నే కోల్పోతావన్న హెచ్చరికలతో జెలెన్‌స్కీని ట్రంప్ ఘాటుగా బెదిరించారు. యుద్ధం ఆరంభించింది ఉక్రెయిన్ అని పుతిన్ మాటనే అమెరికా అధ్యక్షుడు వల్లెవేశారు. ఆదిలోనే రష్యాతో రాజీపడాల్సిన, యుద్ధాన్ని ముందుగానే నిలువరించాల్సిన బాధ్యత పూర్తిగా ఉక్రెయిన్ అధ్యక్షుడిదేనని ట్రంప్ తేల్చేశారు. రష్యా శక్తిముందు నువ్వెంత, నీ బలమెంత? అని శల్యసారథ్యం చేశారు. యుద్ధం చేసే బలం లేదని తెలిసీ తొడగొట్టిన ఈ దూకుడుమనిషి కారణంగానే వేలాదిమంది సైనికులు, ప్రజలూ ప్రాణాలు కోల్పోయారట. కాస్త భూమితో పోయేదాన్ని జెలెన్‌స్కీ యుద్ధం వరకూ తెచ్చాడని, ఇప్పుడు ఉన్నది కాస్తా ఊడిందంటూ ఈ యుద్ధంలో అంతిమవిజయం పుతిన్‌దేనని ట్రంప్ తేల్చేశారు. అపారమైన నష్టం, తప్పుడు నిర్ణయాలు, తెలివితక్కువతనం ఇత్యాది ట్రంప్ మాటలన్నీ పూర్తిగా జెలెన్‌స్కీని ఉద్దేశించినవే తప్ప, రష్యాను కానీ, పుతిన్‌ను కానీ ఆయన గట్టిగా తప్పుబట్టిందీ, ఘాటుగా అన్నదీ ఏమీ లేదు.

సౌదీ శాంతిచర్చలకు తనను ఆహ్వానించనందుకు జెలెన్‌స్కీ ఆగ్రహించడం, ఉక్రెయిన్ ప్రమేయం లేకుండా యుద్ధాన్ని ఎలా ముగిస్తారని ప్రశ్నించడం అసమంజసమేమీ కాదు. అందుకు ప్రతిగా ట్రంప్ ఈ స్థాయిలో విరుచుకుపడటం, జెలెన్‌స్కీ వెంటనే దిగివస్తే కోల్పోయిన భూమిని ఇప్పిస్తానని, లేదంటే ఏలుకోవడానికి దేశమే ఉండదని హెచ్చరించడం విచిత్రం. ఉక్రెయిన్‌కు స్థానం లేకుండా చర్చలు ఆరంభించాలని వారం క్రితం అమెరికా–రష్యా అధ్యక్షులు నిర్ణయించినప్పటి నుంచీ జెలెన్‌స్కీ తెగబాధపడుతున్నారు. నాటో ఇప్పటికైనా నిజాన్ని గ్రహించాలని, సొంత సైన్యాన్ని నిర్మించుకోవాలని ఏవేవో సలహాలు ఇస్తున్నారు. యుద్ధాన్ని ముగించే విషయంలో ఎవరికీ ఏ అభ్యంతరాలు ఉండవుగానీ, ఆ పని ఎలా జరగాలన్న విషయంలో ఉక్రెయిన్, యూరప్ అనుకున్నదానికి పూర్తిభిన్నంగా ట్రంప్ ఆలోచనలు ఉంటాయన్నది నిజం. ఆయన విమర్శలన్నీ ఉపరితలంలో పుతిన్ పక్షాన ఉన్నట్టు కనిపిస్తున్నప్పటికీ, పూర్తిగా అమెరికా ప్రయోజనాలు, వ్యక్తిగత లాభాల దృష్టితోనే ఆయన వ్యవహరిస్తారన్నది సుస్పష్టం. తనకు నచ్చినరీతిలో గుదిగుచ్చిన శాంతి ఒప్పందానికి, భూ పంపకాలకు జెలెన్‌స్కీని లొంగదీయడం లక్ష్యంగా ఆయన ఈ మాటలన్నీ అంటున్నారనీ, ఉక్రెయిన్ ప్రజల దృష్టిలో అమెరికాకు నచ్చని జెలెన్‌స్కీ పరువు మరింత దిగజార్చి, ఒప్పందానికి అడ్డుపడుతున్న ఆయనను ఇంతలోగానే దింపివేయాలన్నది లక్ష్యం కావచ్చు. దాదాపు రెండువందల బిలియన్ డాలర్ల ఆర్థిక, ఆయుధసాయంతో ఈ మూడేళ్ళ యుద్ధకాలంలో ఉక్రెయిన్‌ను ఆదుకున్న అమెరికా, అనంతరకాలంలో అనేక రెట్లు దోచుకుంటుందని ఎప్పటినుంచో అనుకుంటున్నదే. గాజాను రియల్‌ఎస్టేట్ కళ్ళతో చూసినట్టుగా, ఇప్పుడు ఉక్రెయిన్‌ను ఆయన ఖనిజాల గనిగా చూస్తున్నారు. అత్యంత విలువైన, అరుదైన ఖనిజాల్లో సగం తవ్వుకోనిస్తే అమెరికా మద్దతు కొనసాగుతుందని ఆయన ఈ మధ్యనే ఓ హెచ్చరికలాంటి ప్రతిపాదన చేశారు. ఇది ఐదువందల బిలియన్ డాలర్ల శాంతి ఒప్పందం అంటూ అమెరికా పత్రికలే వ్యాఖ్యానిస్తున్నాయి. కడవరకూ అండగా ఉంటానని హామీ ఇచ్చి ఇలా మిత్రుడిని నడిమధ్యలో వదిలేయడం అగ్రరాజ్యానికి పరువుతక్కువన్న హెచ్చరికలు, హితవులు ఈ తెలివైన వ్యాపారికి ఏమాత్రం పట్టవు.

రిజర్వేషన్లే సామాజిక న్యాయ మార్గమా?

ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలన్నది ఒక తప్పుడు ఆలోచన; ముస్లింల శ్రేయస్సుకు సానుకూల చర్య (అఫర్మేటివ్ యాక్షన్) తక్షణమే తప్పనిసరిగా చేపట్టవలసి ఉన్నది... ఈ రెండు అంశాలనూ నేను అంగీకరిస్తున్నాను. ఇవి సమంజసమైనవని మీరూ భావిస్తే– ఆ రెండు అంశాలనూ నేను అంగీకరిస్తున్నాను– స్వీయ వైరుధ్యం కానప్పటికీ అసంగతంగా ఆలోచిస్తున్నవారుగా కనిపించవచ్చు. అయితే అది మీ తప్పు కాదు. వర్తమాన భారతదేశంలో సామాజిక న్యాయం గురించిన సంకుచితమైన భావనలే ఆ తప్పుడు ధోరణికి ఆస్కారమిస్తున్నాయి. తత్ఫలితంగా సానుకూల చర్య అనేది రిజర్వేషన్లకు– అందునా ప్రభుత్వ విద్యా, ఉద్యోగ రంగాలలో– సమానపదమై పోయింది. సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాలు అన్నీ కోటా లేదా ఉప కోటాకు వ్యతిరేకంగా పరిణమిస్తున్నాయి. ప్రతికూలతలు లేదా వివక్ష లేదా తీరని అవసరాలతో సతమతమవుతున్న సామాజిక సమూహాలన్నీ రిజర్వేషన్లను గట్టిగా కోరుతున్నాయి. మాజీ సైనికులు, లైంగిక మైనారిటీలు, నిర్వాసితులు మొదలైన బాధిత వర్గాలు రిజర్వేషన్లను డిమాండ్ చేస్తున్నాయి. రోగికి శస్త్రచికిత్స చేసేందుకు ఒక పెద్ద కత్తితో ఆపరేషన్ టేబుల్ వద్ద నిలబడిన సర్జన్‌లా భారత రాజ్య వ్యవస్థ ఉంది.

మరి ముస్లిం మతస్థులు అందరికీ విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ సదుపాయం కల్పించాలన్న డిమాండ్ ఒకటి ఉండడంలో ఆశ్చర్యమేముంది? ముస్లింలను ఒక 'సామాజిక మత సమూహం'గా సచార్ కమిటీ నివేదిక (ఎస్‌సిఆర్) గుర్తించినప్పటి నుంచీ ఈ డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేయనప్పటికీ వారు విద్యా రంగంలో బాగా వెనుకబడి ఉన్నారని, పైగా అపరిమితమైన ఆర్థిక ప్రతికూలతలనెదుర్కొంటున్నారని ఎస్‌సిఆర్ గుర్తించింది. ముస్లిం సమాజపు ఈ కఠోర వాస్తవాలను సమగ్రంగా గుర్తించిన మొట్టమొదటి అధికారిక నివేదిక అది.

ఇటీవల విడుదలైన ఒక నివేదిక సంప్రదాయ ఆలోచనా రీతులను దాటి భిన్నమైన కొత్త ఆలోచనలకు మనలను పురిగొల్పింది. 'Rethinking Affirmative Action For Muslims in Contemporary India' అన్న ఆ నివేదికను హిలాల్ అహ్మద్, మొహద్ సన్జీర్ ఆలం, నజిమా పర్వీన్‌లు రూపొందించారు. ముస్లింలకు రిజర్వేషన్ల విషయమై చర్చను ఈ నివేదిక మూడు విధాలుగా ముందుకు తీసుకు వెళ్లింది. తొలుత ముస్లింల శ్రేయస్సుకు సానుకూల చర్య తీసుకోవల్సిన అవసరం ఎందుకు ఉన్నదో విపులంగా, సహేతుకంగా వాదించింది; (2) ముస్లిం మతస్థులు అందరికీ రిజర్వేషన్ల సదుపాయం కల్పించడం మంచి ఆలోచన కాదని అంగీకరించింది; (3) వివిధ ముస్లిం సామాజిక సమూహాలు ఎదుర్కొంటున్న వివిధ ప్రతికూలతలను తొలగించేందుకు పలు విధానాలను సూచించింది. ముస్లింల వెనుకబాటుతనం సమస్య పరిష్కారానికి ఒక సరైన ఆలోచనా చట్రాన్ని ఈ నివేదిక సమకూర్చిందనడంలో సందేహం లేదు. అది ప్రస్తావించిన అంశాలపై మరింత పరిశోధన అవశ్యం జరగవలసి ఉన్నది.



కేవలం ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ఆలంబనతో ముస్లింల సమస్యల పరిష్కారం, సంక్షేమ సాధన సాధ్యం కాదని గుర్తించాలి. స్థానిక ముస్లిం జనసముదాయాల పేదరికాన్ని రూపుమాపేందుకు ఎన్‌జీఓలు, స్వయం సహాయక బృందాలు, వితరణశీలురను ప్రోత్సహించేందుకు కొత్త రీతుల్లో ఆలోచించాల్సిన అవసరమున్నది.

భారతీయ సమాజం గురించి ప్రాథమిక అవగాహన ఉన్న వారందరికీ ఆ నివేదిక ప్రస్తావించిన మొదటి అంశం స్పష్టమే. ప్రస్తుత దేశ పాలకుల నుంచి ముప్పు ఎదుర్కొంటున్న మైనారిటీ మత వర్గం వారు మాత్రమే కాకుండా విద్య, ఆర్థిక రంగాలలో తీవ్ర ప్రతికూలతలతో సతమతమవుతున్న సామాజిక సమూహం కూడా ముస్లింలే. సచార్ కమిటీ నివేదిక నమోదు చేసిన వాస్తవాలను ఈ నివేదిక తాజాపరిచింది. సరికొత్త అధికారిక సమాచారం ఆధారంగా విద్యారంగంలో ముస్లింల పరిస్థితి దళితుల, గిరిజనుల స్థాయితో పోల్చదగినదిగా ఉన్నదని, ఆదాయం, సంపద విషయంలో ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ)తో తుల్యంగా ఉందని ఈ కొత్త నివేదిక వెల్లడించింది. విద్యా రంగంలో యువ ముస్లింలు ఎదుర్కొంటున్న ప్రతికూలతలు వారి ఆర్థిక స్థితిగతుల లేదా తల్లిదండ్రుల విద్యా స్థాయితో సంబంధం లేనివి. కుటుంబ ఆదాయం, తల్లిదండ్రుల విద్యాస్థాయికి సంబంధించి సమస్థాయిలో ఉన్న ముస్లింలతో పోల్చినప్పుడు 'అగ్రకుల' హిందువులు రెట్టింపు సంఖ్యలో ఉన్నత విద్యను పొందుతున్నారని, ప్రైవేట్ విద్యా సంస్థలలో విద్యాభ్యాసం చేస్తున్నారని, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులలో చేరుతున్నారని ఈ కొత్త నివేదిక వెల్లడించింది. కుటుంబ ఆదాయం, తల్లిదండ్రుల విద్యార్హతలు సమంగా ఉన్నప్పటికీ అగ్రకుల హిందువులు, ముస్లింలకు లభిస్తున్న అవకాశాలలో అసమానతలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. దక్షిణాది, పశ్చిమ భారత రాష్ట్రాలలో పరిస్థితులు ఇటీవల మెరుగు పడినప్పటికీ ముస్లింల అభ్యున్నతికి సానుకూల చర్యలు తక్షణమే చేపట్టవలసి ఉందనేది స్పష్టం.


■ యోగేంద్ర యాదవ్

ఇటువంటి ప్రతికూలతలు నెదుర్కొంటున్న ముస్లింలకు సామాజిక న్యాయం సమకూర్చేందుకు రిజర్వేషన్ల సదుపాయం కల్పించడమే సరైన సానుకూల చర్య కాదు, కాబోదు. ఇందుకు మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది– ఈ విషయంలో రాజ్యాంగ పరమైన సమస్య ఒకటి ఉన్నది. ఒక మతానికి చెందిన వారని 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారు'గా గుర్తించేందుకు రాజ్యాంగం అనుమతించదు. అటువంటి అనుమతికి ఆస్కారం లేదని న్యాయ వ్యవస్థ స్పష్టం చేసింది. రెండోది సామాజిక పరమైనది. ముస్లిం మతస్థులు అందరూ ఒక సజాతీయ సమూహానికి చెందినవారు కాదు. హిందూ కులాలలో మాదిరిగానే ముస్లింలలో కూడా సామాజిక హోదా, విద్యాస్థాయి, ఆర్థిక అంతస్తుల విషయంలో చాలా అంతరాలు ఉన్నాయి. మూడోది రాజకీయ పరమైనది ఇప్పుడుగానీ, సమీప భవిష్యత్తులో గానీ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగితే అందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జనసమీకరణకు రాజకీయ శక్తులు తప్పక ప్రయత్నిస్తాయి. నేటి భారతదేశంలో ముస్లింల శ్రేయస్సుకు ఇటువంటి పరిస్థితి దాపురించకుండా ఉండడం చాలా అవసరం.

మరి ముస్లింలు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక ప్రతికూలతలు, వివక్షలను రూపుమాపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటి? ముస్లింలు ఎదుర్కొంటున్న భద్రత, అస్తిత్వ పరమైన సవాళ్లను పరిగణనలోకి తీసుకుని హిలాల్ అహ్మద్ ప్రభృతుల నివేదిక ఒక ప్రత్యామ్నాయ 'కోటా పద్ధతి'ని సూచించింది. సమస్త ముస్లింలకూ రిజర్వేషన్లు కల్పించడం లేదా ముస్లింలు అందరినీ ఓబీసీలుగా పరిగణించడం కాకుండా వెనుకబడిన ముస్లిం సామాజిక సమూహాలు అన్నిటినీ ఓబీసీ జాబితాలలో చేర్చాలి. ప్రస్తుతం ముస్లింలలో సగం మంది ఓబీసీ ప్రయోజనాలు పొందడానికి అర్హులుగా ఉన్నారు. ముస్లింలలో నాలుగింట మూడు వంతుల మంది విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితులు వారిని ఓబీసీలుగా పరిగణించేందుకు అర్హులను చేస్తున్నాయి.

రెండోది ముస్లింలు అందరినీ ఒకే ఓబీసీ జాబితాలో చేర్చడం కాకుండా ఆ జాబితాను కనీసం 'బాగా వెనుకబడిన', 'వెనుకబడిన' అనే రెండు జాబితాలుగా విభజించాలి. కేరళ, కర్ణాటకలలో మాదిరిగా ముస్లిం ఓబీసీలను ఒక ప్రత్యేక ఉప కోటా వర్గంగా పరిగణించడాన్ని ఈ నివేదిక వ్యతిరేకించింది. భిన్న ముస్లిం సామాజిక సమూహాలను వాటి వాటి వెనుకబడినతనం ప్రాతిపదికన వేర్వేరు ఓబీసీ జాబితాలలో చేర్చాలి. మూడోది– 'అస్పృశ్య' ముస్లిం సామాజిక సమూహాలను ఎస్సీలుగా వర్గీకరించడంపై ప్రస్తుతమున్న నిషేధాన్ని ఎత్తివేయాలి.

ముస్లింల అభ్యున్నతి విషయమై హిలాల్ అహ్మద్ ప్రభృతుల నివేదిక 'ప్రాదేశిక దృక్కోణాన్ని' కూడా సమర్థించింది. ముస్లిం జనాభా కేంద్రీకృతమై ఉన్న ప్రాంతాలలో ప్రాథమిక పౌర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించింది. సచార్ కమిటీ నివేదిక అనంతరం ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న జిల్లాలు, మండలాలు, గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి ఆయా చోట్ల ప్రాథమిక పౌర సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు జరిగాయి. ఇటువంటి ప్రయత్నాలు సంబంధిత ప్రాంతాలలో ముస్లిమేతర జనాభా మాత్రమే లబ్ధి పొందేలా ఉండకూడదని హిలాల్ అహ్మద్ ప్రభృతుల నివేదిక స్పష్టం చేసింది. వివిధ వృత్తులకు ప్రభుత్వం ఆర్థిక మద్దతునిచ్చే 'రంగాలవారీ దృక్కోణాన్ని' కూడా ఈ నివేదిక ఆమోదించింది. నేత, తాళాల తయారీ, తివాచీ, అత్తర్ల తయారీ మొదలైన రంగాలలో ముస్లింల ప్రాబల్యమున్నది. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయా వృత్తులకు, తయారీ రంగాలకు ఇతోధిక సహాయాన్ని, ప్రోత్సాహాన్ని అందించవలసి ఉన్నది. మూడోది ప్రైవేట్ రంగ సంస్థలు కూడా ముస్లింల శ్రేయస్సుకు తోడ్పాటునిచ్చే విధంగా చూడాలి. దీనిపై ఈ నివేదిక ప్రతిపాదనలు స్పష్టంగా లేవు. ప్రైవేట్ రంగంలో మైనారిటీ మతస్థులకు కోటా సదుపాయ కల్పన వ్యతిరేక ఫలితాలు, ప్రతికూల పర్యవసానాలకు దారి తీసే అవకాశమున్నది. అయితే సబ్సిడీలు, కాంట్రాక్టులు పొందాలంటే ప్రైవేట్ సంస్థలు తమ ఉద్యోగులలో సామాజిక వైవిధ్యముండేందుకు తప్పనిసరిగా శ్రద్ధ చూపేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. కేవలం ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ఆలంబనతో ముస్లింల సమస్యల పరిష్కారం, సంక్షేమ సాధన సాధ్యం కాదని గుర్తించాలి. స్థానిక ముస్లిం జనసముదాయాల పేదరికాన్ని రూపుమాపేందుకు ఎన్‌జీఓలు, స్వయం సహాయక బృందాలు, వితరణశీలురను ప్రోత్సహించేందుకు కొత్త రీతుల్లో ఆలోచించాల్సిన అవసరమున్నది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మాతృభాష పునాదిగా ప్రపంచ పౌరులమవుదాం!

వ్యక్తుల అభివృద్ధిలోనూ, వ్యవస్థల పురోభివృద్ధిలోనూ భాషల పాత్ర చాలా కీలకం. భాషలు కేవలం మాట్లాడుకోడానికి మాత్రమే కాదు, విద్యను నేర్చుకోడానికి, దాని ద్వారా స్థిరమైన వృద్ధిని సాధించడానికి చాలా అవసరం. మాట్లాడే విధానాలు, నేర్చుకొనే పద్ధతులు, సమాజంతో మెరుగైన సంబంధాలను ఏర్పరుచుకోగలగడం వంటివి భాషా జ్ఞానం వల్లనే సాధ్యపడతాయి. భాషలు అంతరిస్తుంటే ప్రజలలో అవగాహన లోపం పెరుగుతుంది. సాంస్కృతిక వారసత్వం దెబ్బతింటుంది. వ్యక్తివ్యవస్థల వృద్ధి కుంటుపడుతుంది. ప్రపంచం అనేకమైన భాషలు మాట్లాడే ప్రజలతో నిండిన బహుభాషా వ్యవహార ప్రాంతం. దేశాలుగా పిలుచుకునే భౌగోళికమైన హద్దులకన్న, ఈ బహుభాషా వ్యవహార ప్రాంతాలు భిన్నం. భౌతికంగా ఒక ప్రాంతానికి పరిమితమైనా, బౌద్ధికంగా ప్రపంచంతో చప్పున అనుసంధానాన్ని సాధించగల తెలివిడి మనకు ఉంటుంది. అనేక భాషలలో మనకు ఉన్న వ్యవహార జ్ఞానం ఇందుకు సహకరిస్తుంది. కాబట్టి, భాషలను వేరుగా ఉంచి ఏ వృద్ధినీ కొలవలేం, ఏ అభివృద్ధినీ సాధించలేం.

యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఎనిమిదివేలకు పైగా భాషలున్నాయి. వీటిలో ఏడువేలకు పైగా భాషలు వాడుకలో ఉన్నాయి. మారుతున్న ప్రపంచం తీసుకొస్తున్న అనేక మార్పుల తాకిడి మాతృభాషలపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతోంది. తక్కువ మంది మాట్లాడే భాషలు త్వరగా అంతరించిపోతున్నాయి. భారతదేశం వంటి బహుభాషా వ్యవహార దేశాలలో ఈ మార్పును స్పష్టంగా గుర్తించవచ్చు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అండమాన్ నికోబార్ దీవుల్లోని భాషల్లో ఒకటైన 'బో' భాష మాట్లాడే చివరి వ్యవహర్త కొద్దికాలం క్రితం వచ్చిన సునామీలో చనిపోయింది. దీంతో ఆ భాషావ్యవహర్తల సమూహం అంతరించినట్టయింది. చివరి వ్యవహర్త జీవించి ఉన్నపుడు పరిశోధకులు గుర్తించి సేకరించిన వివరాలు రికార్డుల రూపంలో భద్రంగా ఉన్నాయి. కాని, ఆ సమూహపు వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యాలకు ఉనికి లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా అనేకానేక కారణాలవల్ల ఇలా తుడిచిపెట్టుకుపోతున్న మాతృభాషల సంఖ్య ప్రతి ఏటా మూడంకెల సంఖ్యలలో పెరిగిపోతుండడం మనల్ని కలవరపెట్టే అంశం.



ఇప్పుడు ప్రపంచమంతా బహుభాషా వ్యవహార ప్రాంతమే. అవకాశాలను, సందర్భాలను అనుసరించి అనేక దేశాలలో బహుభాషా విద్యాప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. మాతృభాషను విడిచిపెట్టకుండా మరిన్ని భాషలలో విద్యను నేర్పడమన్నది ఇప్పుడు ప్రపంచానికి కలిసి వస్తున్న తారకమంత్రం.

అభిప్రాయాలను వెల్లడించడానికి మాత్రమే కాక, జ్ఞానాన్ని పంచుకోడానికి, పెంచుకోడానికి కూడ భాషే మనకి ఆధారం. ప్రపంచ జ్ఞానం మనకు ఇవాళ అనేకమైన భాషల్లో అందుతోంది. విద్యావ్యవస్థ ఈ జ్ఞానాన్ని మాతృభాషలలో ఆయా సమాజాలకు అందించాలి. జ్ఞాన శాఖలలోని వైవిధ్యాన్ని మాతృ భాషలలో గ్రహింపుకు తెచ్చుకున్న సమాజాలు సులభంగా, వేగంగా వృద్ధి చెందుతాయి. అందుకే భాషావేత్తలు విద్యను మాతృభాషల్లోనే నేర్పాలి అన్నదానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు.

ప్రపంచ దేశాలతో అనుసంధానం కావడం అన్నది ఇప్పుడు ప్రతిఒక్కరికి అవసరంగా మారిపోయింది. ఇటువంటి సందర్భాలలో భాషపరంగా మనకు భిన్నమైన అనుభవాలు ఎదురవుతాయి. ప్రపంచవ్యాప్తంగా 37 శాతం కన్నా ఎక్కువమంది తమ మాతృభాషలలో కాకుండా పర భాషలలో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. కొన్ని దేశాల్లో ఇది 90 శాతం దాకా ఉంది. విద్యావ్యవస్థలోని ఈ కల్లోలం ఆయా సమాజాలలోని ప్రజలలో భాషాపరమైన, భావ పరమైన సంఘర్షణలకు కారణమవుతుంది. సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక, కళాత్మక ఆలోచనలను ఇది నిరంతరం అస్థిరపరుస్తుంది. సమాజంలో పుట్టిన ప్రతి వ్యక్తికి తమ భాషలో చదువుకొనే హక్కు ఉంటుంది. సమాజాలను పాలించే వ్యవస్థలు ఈ హక్కును గుర్తించటం, పాటించటానికి అనువైన విధానాలను రూపొందించటం విధిగా భావించి, కార్యాచరణను కట్టుదిట్టం చేయాలి.

ఇప్పుడు ప్రపంచమంతా బహుభాషా వ్యవహార ప్రాంతమే. అవకాశాలను, సందర్భాలను అనుసరించి అనేక దేశాలలో బహుభాషా విద్యాప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. మాతృభాషను విడిచిపెట్టకుండా మరిన్ని భాషలలో విద్యను నేర్పడమన్నది ఇప్పుడు ప్రపంచానికి కలిసి వస్తున్న తారకమంత్రం. దీనివల్ల విద్యార్థులలో విద్యార్జన శక్తిని, విద్యాసక్తిని పెంపొందింపజేయవచ్చు. తల్లిదండ్రులలో పిల్లల భవిష్యత్తు పట్ల ఆందోళనలను తగ్గించవచ్చు. అనేక సమాజాలతో కలసి జీవించగలిగే నైపుణ్యాన్ని పిల్లలలో వృద్ధి చేయవచ్చు. నేటి బాలలు రేపటి పౌరులు అన్నది పాతబడిన మాట. నేటి బాలలు రేపటి ప్రపంచ పౌరులు అన్నది కళ్ళకు కడుతున్న సత్యం. మనభాషతో పాటు మరిన్ని భాషలను నేర్చుకోవడం, భిన్నమైన సంస్కృతులను తెలుసుకోవడం అనేవి ఈ కాలపు పిల్లలకు మనం అందించదగిన సంపద. ఇది వారిలో వ్యక్తిగతమైన వృద్ధిని కలిగిస్తూ, సామూహిక చైతన్యానికి బాటలు వేస్తుంది. వృత్తి ఉద్యోగాలలో ఉన్నతిని కల్పించటంతో పాటు, ప్రపంచంతో అర్థవంతమైన భాగస్వామ్యం సాధించేందుకు సహకరిస్తుంది.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఒకటిగా భాషల ప్రాధాన్యాన్ని యునైటెడ్ నేషన్స్ ఏనాడో గుర్తించింది. ప్రపంచం సాధించదగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుగా యునైటెడ్ నేషన్స్ పేర్కొన్న పదిహేడింటిలో నాలుగవ లక్ష్యం 'అందరికీ నాణ్యమైన విద్య'. అలాగే 'లింగ సమానత్వం, అసమానతల తగ్గింపు', 'స్థిర అభివృద్ధిని సాధించే సమాజాలు నగరాలు'... మొదలైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలన్నిటికీ భాషలతో నేరుగా సంబంధం ఉంది. యునైటెడ్ నేషన్స్ అన్ని దేశాలకు నిర్దేశించిన ఈ లక్ష్యాల సాధనలో మాతృభాషల ద్వారా విద్యాబోధన ప్రాధాన్యాన్ని మన రాష్ట్రాలు, దేశాలు ప్రథమ ప్రాధాన్యాంశంగా గుర్తించాలి. 2015లో ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలను అన్ని దేశాలకు యునైటెడ్ నేషన్స్ సంస్థ పంపించింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆయా దేశాలు సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో 2016 నుంచి మనకు అందిస్తోంది. గడచిన తొమ్మిదేళ్ళ నివేదికల సారం ఏమిటంటే, 'సమాజాల మధ్య సంభాషణకు, విద్యకు, సమ్మిళిత వృద్ధి సాధనకు, సాధికారతకు మాతృభాషలు చాలా కీలకం' అని. 2022–2032 దశాబ్దాన్ని యునెస్కో దేశీయభాషల దశాబ్దంగా ప్రకటించి ప్రపంచదేశాలలో మాతృభాషల ద్వారా సమ్మిళిత, సుస్థిర వృద్ధిని సాధించేందుకు కృషి చేస్తోంది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంలో మనమూ, మన వ్యవస్థలూ ఈ విషయంపై దృష్టినిలపవలసిన అవసరం ఉంది.

■ ఆచార్య పమ్మి పవన్ కుమార్
తెలుగు ప్రొఫెసర్, హైదరాబాద్ యూనివర్సిటీ
(నేడు అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం)

ప్రజాఫిర్యాదులన్నీ 'అప్‌లోడ్' అవుతున్నాయా?

భూమి సమస్యల అర్జీల స్వభావం పూర్తిగా వేరని ప్రభుత్వ పెద్దలు మొదట గుర్తించాలి. గ్రామ రెవెన్యూ సదస్సులకు ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారో విచారించాలి. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలనే కాదు మండల, డివిజన్ కేంద్రాలలో కూడా వినతిపత్రాల అప్‌లోడ్‌పై దృష్టిపెట్టి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే భవిష్యత్తులో 'గ్రామ రెవెన్యూ సదస్సు'లు వంటి కార్యక్రమాల అవసరం లేదు.

అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం రెండు నెలల గడువులో రెండు రెవెన్యూ సదస్సులు జరపమని అధికారులను గ్రామాలకు పంపింది. గత ప్రభుత్వం రాష్ట్రంలో రీ సర్వే & సెటిల్‌మెంట్ మొదలు పెట్టింది. కొన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ సర్వే పూర్తి చేసామని చెప్పుకుంది. ఆ రీ సర్వేలో చాలా తప్పులు జరిగాయి. ఆ అవకతవకలపై బాధితులు ఫిర్యాదు చేసుకోవచ్చని, 2024 అక్టోబర్‌లో ప్రభుత్వం 'రీ సర్వే గ్రామ సదస్సులు' పెట్టింది. అది అయిన రెండు నెలలకు డిసెంబర్ 6 నుంచి 2025 జనవరి 8 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. గ్రామాలు, వ్యవసాయం గురించి తెలిసినవారెవరికైనా డిసెంబర్ నుంచి జనవరి మొదటి వారం వరకు పంటకోతలలో రైతులు, రైతుకూలీలు మునిగి ఉంటారని తెలుస్తుంది.

భూమిశిస్తు కమిషనర్ కార్యాలయం డిసెంబర్ 3న, నాలుగు పేజీల ఉత్తర్వు ఇస్తూ గ్రామ రెవెన్యూ సదస్సులు ఎలా నిర్వహించాలో చెప్పింది. ఆ ఉత్తర్వులోని వివరాలలోకి వెళ్లేముందు, రాష్ట్ర ప్రభుత్వ ఇంటర్‌నెట్ వెబ్ పోర్టల్ 'ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను గురించి మాట్లాడుకుందాం. స్వతంత్ర అధికారాలు గల తహశీల్దార్(ఎమ్మార్వో), రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో), కలెక్టర్ కార్యాలయాలలో ప్రతి సోమవారం 'ఫిర్యాదుల దినం' (గ్రీవెన్స్ డే)గా జరుపుకోవడం బ్రిటిష్ కాలం నుంచి ఒక ఆనవాయితీగా స్థిరపడింది. మిగిలిన రోజులలో అధికారి దొరకకపోవచ్చు కానీ సోమవారం నాడు తప్పక కార్యాలయంలో ఉంటారన్న నమ్మకం కూడా ప్రజలకు ఏర్పడింది.

నిజానికి ఈ 'గ్రీవెన్స్ డే'లో ఇచ్చిన సమస్య పరిష్కారం కంటే, వచ్చిన బాధితునితో సదరు అధికారి వ్యవహరించే తీరు ఆ అధికారి పట్ల, ఆ వ్యవస్థ పట్ల, చివరిగా అప్పటి ప్రభుత్వం పట్ల ప్రజలలో గౌరవాన్ని పెంచడమో, తుంచడమో చేస్తుంది. థామస్ మన్రో (1761–1827) పేరును 'మన్రోలప్ప'గా రాయలసీమ ప్రాంత రైతులు తమ బిడ్డలకు పెట్టుకున్నారు. నేటి అనకాపల్లి జిల్లా, రోలుగుంట మండలంలోని గదబ ఆదివాసీ గ్రామం వీరపురాజు పేట ఆదివాసీలు, 1977–78 మధ్య నర్సీపట్టణం సబ్ కలెక్టర్‌గా పని చేసిన చటర్జీ పేరును తమ గ్రామం పేరుగా మార్చుకున్నారు. నేడది 'చటర్జీపురం'. అందుచేత, 'గ్రీవెన్స్ డే' నిర్వహణలో సాంకేతికత కంటే మానవతాస్ఫూర్తి ముఖ్యం.

అనుచానంగా వస్తున్న ఈ 'గ్రీవెన్స్ డే'ని తామే ప్రత్యేకంగా కనిపెట్టినట్లు, పేర్లు పెట్టుకొని, తమ బొమ్మలు పెట్టుకునే పాడు సంస్కృతి దాపురించింది. ప్రభుత్వం మారగానే దాని పేరు మారుతుంది, నాయకుని బొమ్మ మారుతుంది... కానీ తీరు మాత్రం మారదు. గత ప్రభుత్వం దీనికి 'స్పందన' అని పేరు పెట్టింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలంటే మీకు ఆధార్, ఫోన్ నెంబర్ ఉండాలి. అవి లేకపోతే మీ సమస్య 'గ్రీవెన్స్ వెబ్ పోర్టల్'లో నమోదై, అధినేత బొమ్మతో రసీదు బయటకు రాదు. ఆ రసీదు లేకపోతే కలెక్టర్ వద్దకు మిమ్మలను దఫేదార్ పోనివ్వడు. రసీదు రావాలంటే, మీ అర్జీలోని బాధ/ సమస్య, అక్కడ ముందే సిద్ధంగా ఉన్న సమస్యల జాబితా (డ్రాప్ డౌన్)లో ఉండాలి. మీ సమస్య ఏమిటి, అది ఏ శాఖకు చెందింది, దానికి అధికారి ఎవరు, దానిని ఎన్ని రోజులలో పరిష్కరించాలి, ఇవ్వన్నీ సెలక్ట్ చేయడం ద్వారా నింపుతారు. అందులో తేడా వస్తే, వైకుంఠపాళిలో పాము మింగినట్లు మీ కథ మళ్లీ మొదటికి వస్తుంది. ఆన్‌లైన్‌లో నమోదైన పిటిషన్ ఒక ప్రత్యేక సంఖ్యతో అధికారి వద్దకు ఆన్‌లైన్‌లోనే పోతుంది. గడువులోగా పరిష్కారం అయినట్లు అధికారి జవాబు అప్‌లోడ్ చేయకపోతే దానిని 'పెండింగ్'గా చూపిస్తుంది. రాష్ట్రస్థాయిలో, తన జిల్లా నుంచి ఎక్కువ 'పెండింగ్' ఉన్నట్లు కనబడకూడదని ప్రతి జిల్లా కలెక్టర్ అనుకుంటారు. అందుచేత బాధితుని సమస్య పరిష్కారం కంటే, ఈ డేటా మేనేజ్‌మెంట్ ముఖ్యమయింది.

మన దేశంలో 'శతకోటి అపాయాలకు అనంతకోటి ఉపాయాలు' ఉంటాయి. అసలు అర్జీలను 'గ్రీవెన్స్ వెబ్ పోర్టల్'లో నమోదు చేయడం మానేస్తే 'పెండింగ్' అనే రిమార్కు. పీడ విరగడవుతుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం మినహాయిస్తే, రెవెన్యూ డివిజన్ (ఆర్డీవో), తహశీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం 'గ్రీవెన్స్ డే'లో మనం ఈ దృశ్యాన్ని చూడవచ్చు. "పరిగెడుతున్నట్లే ఉంటుంది కానీ అక్కడే ఉంచే 'ట్రెడ్ మిల్' యంత్రంలా రెవెన్యూ శాఖ పనితీరు ఉంద"ని ఆ శాఖలోని ఓ అధికారి అన్నారు.



ఈ నేపథ్యంలో ప్రభుత్వం జరిపిన గ్రామ రెవెన్యూ సదస్సులను చూడాలి. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు భూమిశిస్తు కమిషనర్ డిసెంబర్ 3న ఇచ్చిన ఉత్తర్వులలోని పేరా 6, సెక్షన్ 1లో, గ్రామసభ ప్రారంభానికి ముందు తహశీల్దార్ రెవెన్యూ గ్రామంలో ఉన్న షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) ఆవాసాలలో పర్యటించి సదస్సు జరిగే ప్రదేశానికి చేరుకోవాలి. అదే పేరాలో, సదస్సుకు వచ్చిన అర్జీలు స్వీకరించి అక్కడే వారికి రసీదులు కూడా ఇవ్వాలని ఉంది. రసీదులు అంటే రెండు రకాలు, గ్రీవెన్స్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసిన కోడ్ నెంబర్ గల రసీదు. అందుకు సమయం పడుతుందనుకుంటే, ముందు ఒక చేతి రసీదు ఇచ్చి, తరువాత కోడ్ నెంబర్ రసీదు ఇవ్వడం. రెవెన్యూ గ్రామసభలలో ఇది జరిగిందా? రెవెన్యూ సదస్సులకు వచ్చిన అన్ని అర్జీలను గ్రీవెన్స్ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారా? లేదా ఏవో కొన్ని అప్‌లోడ్ చేసి మిగిలిన వాటిని వదిలివేశారా? ఆదివాసీ రెవెన్యూ గ్రామాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం అర్జీలు ఇచ్చిన వారందరికీ సదస్సులో రసీదులు ఇవ్వలేదు.

ఒక కేస్ స్టడీ చూద్దాం. అనకాపల్లి జిల్లా, రావికమతం మండలం, చీమలపాడు రెవెన్యూ గ్రామంలో కొన్ని ఆవాస గ్రామ ఆదివాసీలు కొందరు సామాజిక కార్యకర్తల సహకారంతో 13 అర్జీలు ఇచ్చారు. అందులో మూడింటికి అక్కడే వెబ్ పోర్టల్ రసీదులు ఇచ్చారు. మిగిలిన వారికి జిరాక్స్ అర్జీలపై సంతకం, తేదీ వేసి ఇచ్చారు. కార్యాలయం ముద్ర లేదు. కార్యాలయం ముద్ర లేని ఏ పత్రానికి లీగల్ సాధికారిత ఉండదు. ఇది జరిగింది డిసెంబరు 13న. ఈ కేసు రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారుల చెవికి చేరడం, వారు నిలదీయడంతో ఫిబ్రవరి నాలుగున మిగిలిన వాటిని అప్‌లోడ్ చేశారు. అంటే ఆదివాసీలు ఇచ్చిన 50 రోజులు తరువాత. అయితే ఇందులో మరో కొస మెరుపు కూడా ఉంది. సమస్యల పరిష్కారానికి రసీదులోని గడువు 90 రోజులు పెట్టారు. ఆ లోగా సమస్యలు పరిష్కారం అవుతాయా? చిత్తశుద్ధి ఉంటే కొన్ని అవ్వవచ్చు.

ఫిబ్రవరి 8 నాటికి రాష్ట్ర గ్రీవెన్స్ వెబ్ పోర్టల్ సమాచారం ప్రకారం, మొత్తం అర్జీలు 7,44,249 కాగా, పరిష్కారం అయిపోయినవి 4,59,130 (70%). జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులలో 80% భూ సంబంధమైన అర్జీలు ఉంటున్నాయని రెవెన్యూ మంత్రి అన్నారు. మంత్రి చెప్పిన 80% లెక్కన 3.67 లక్షల భూమి సమస్యల అర్జీలు పరిష్కారం అయిపోయాయనుకోవచ్చా. భూమి సమస్యల పరిష్కారం చట్టాలు, నియమాలు, ప్రభుత్వ విధానాలు, కోర్టు తీర్పులకు లోబడి ఉంటాయి. అవి ఏదో రేషన్ కార్డు మంజూరీ లాంటివి కాదు. ఉదాహరణకు– సాగు చేస్తున్న భూమికి పట్టా ఇవ్వాలని ఒక లక్ష అర్జీలు గ్రీవెన్స్ వెబ్ పోర్టల్ నమోదైనాయనుకుందాం. ప్రభుత్వం భూ పంపిణీకి విధాన నిర్ణయం తీసుకుంటే తప్ప, తహశీల్దార్లు ఏమీ చేయలేరు. అప్పుడు ఈ అర్జీలలో ఇచ్చిన గడువు సంగతి ఏమిటి? అవి పరిష్కారం కావు. అప్పుడు అవి ఆయా తహశీల్దార్ల ఖాతాలో 'పెండింగ్' నెంబర్లుగా కనిపిస్తూ ఉంటాయి. వాటి సంఖ్యలు తగ్గించాలనే వత్తిళ్ళు కలెక్టరేట్ నుంచి ఉంటాయి. తహశీల్దార్ ఏం చేయాలి? వాటిని తిరస్కరిస్తున్నట్లుగా ఎండార్స్‌మెంట్ ఇచ్చి దానినే పరిష్కరించినట్లు లెక్కలలో చూపించాలి. అంటే 'తిరస్కారమే' 'పరిష్కారం' అన్నమాట. ఇలాంటి గణాంకాలు చూసుకొని మురిసిపోవడానికి మాత్రమే పనికివస్తాయి.

గ్రామ రెవెన్యూ సదస్సులు లేదా గ్రీవెన్స్ డేకి కలెక్టరేట్‌కు వచ్చే భూమి సంబంధిత అర్జీలను ఇతర సమస్యల అర్జీల నుంచి పూర్తిగా వేరు చేయాలి. అందులో 1. ఇంటి స్థలం–భూమి సమస్య 2. ప్రభుత్వ భూముల భూమి సమస్య 3. ప్రైవేటు భూముల భూమి సమస్య అనే ప్రాథమిక వర్గీకరణలు జరగాలి. ఇందులో మూడవ కేటగిరీ భూముల విషయంలో రెవెన్యూ అధికారులు చేయగలిగేది చాలా తక్కువ. అందుచేత భూమి సమస్యల అర్జీల స్వభావం పూర్తిగా వేరని ప్రభుత్వ పెద్దలు మొదట గుర్తించాలి. గ్రామ రెవెన్యూ సదస్సులకు ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారో విచారించాలి.

ఆ రెండు ఒకటేనని ఏ జిల్లా రెవెన్యూ అధికారి చెప్పినా, అది వట్టి అబద్ధం కాదు, పచ్చి అబద్ధం. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలనే కాదు మండల, డివిజన్ కేంద్రాలలో కూడా వినతిపత్రాల అప్‌లోడ్‌పై దృష్టిపెట్టి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే చాలు భవిష్యత్తులో 'గ్రామ రెవెన్యూ సదస్సు'లు వంటి కార్యక్రమాల అవసరం లేదు.

• పి.ఎస్. అజయ్ కుమార్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



ఆరుగొలనులో కూల్చేస్తున్న మాదాల శ్రీనివాసరావుకు చెందిన ఎరువుల దుకాణం (ఫైల్)



రేమల్లె సర్వే నంబరు 22-8,9లో నిర్వహిస్తున్న అక్రమ క్వారీయింగ్ (ఫైల్)

భూబాగోతాలు

తవ్వే కొద్దీ వెలుగులోకి వంశీ అనుచరుల కబ్జాలు!

ప్రభుత్వ భూమి కనిపిస్తే కనుమరుగే..

- వైసీపీలో చేరలేదని టీడీపీ నేతల ఆస్తుల ధ్వంసం
- అధికారుల అండతో యథేచ్ఛగా ఆక్రమణలు
- రైతులను బెదిరించి లాక్కొన్న భూముల్లో అక్రమ మైనింగ్
- గన్నవరం, బాపులపాడు మండలాల్లో అనేక అరాచకాలు



జాస్తి వెంకటేశ్వరరావుకు చెందిన భూమిలో పత్రాలు చూస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ (ఫైల్)

గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు రెచ్చిపోయారు. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో అరాచకం సృష్టించారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే గద్దల్లా వాలిపోయారు. చిన్న, సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న భూములను సైతం వదల్లేదు. ఆయా భూముల్లో అక్రమ మైనింగ్ నిర్వహించి కోట్లు కొల్లగొట్టారు. కొన్ని చోట్ల ఆ భూములకు పట్టాలు పుట్టించి జగనన్న కాలనీల కోసం ప్రభుత్వానికి అమ్మేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివాదాల్లోనూ తలదూర్చి ఆ ఆస్తులను తమ పరం చేసుకున్నారు. వైసీపీలో చేరలేదనే అక్కసుతో టీడీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారు. వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలను ఆక్రమించుకున్నారు. అధికారులను అడ్డంపెట్టుకుని ఎన్నో అడ్డదారులు తొక్కారు. గన్నవరం, బాపులపాడు మండలాల్లో ఐదేళ్ల పాటు సాగిన అరాచకాల్లో కొన్ని ఇలా..

-గన్నవరం/హనుమాన్ జంక్షన్‌రూరల్, ఆంధ్రజ్యోతి

■ అంపాపురంలో సర్వే నంబరు 109-3లో 14 ఎకరాలను పేద రైతులు సాగు చేసుకుంటుంటే ఇది ప్రభుత్వ భూమి, సాగు చేయకూడదని రెవెన్యూ శాఖతో చెప్పించి రైతులను ఖాళీ చేయించారు. ఆ తర్వాత బినామీల పేర్లతో ఆ భూములకు పట్టాలను పుట్టించి జగనన్న కాలనీ పేరుతో పట్టా భూమితో సహా అమ్మేందుకు ప్రయత్నిస్తే కొందరు నిబద్ధత గల అధికారులు అడ్డుపడటంతో అది ఆగిపోయింది. డొంకతో సహా కలిపి ఎకరా రూ.50 లక్షలకు అమ్మేందుకు సిద్ధమవ్వగా.. ప్రభుత్వం మారిపోవడంతో మరుగునపడిపోయింది.

■ రేమల్లెలో చిన్నసన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న సర్వే నంబరు 422-8,9లో 20 ఎకరాల అసైన్డ్ భూములను ఆక్రమించుకోవడంతో పాటు 20 అడుగులకుపైగా అక్రమ మైనింగ్ నిర్వహించారు. అదే గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి పోలవరం గట్టున ఉన్న మూడు ఎకరాల భూమిలో లేఅవుట్‌కు సిద్ధం చేస్తున్న విషయం తెలుసుకుని స్థానిక నాయకులతో కలిసి 26 సెంట్ల భూమిని మండల స్థాయి వైసీపీ నాయకుని పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. తదనంతరం అనుంగు సహచరులు తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరి అరాచకాలను భరించలేక ఆ వ్యక్తి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోవడం గమనార్హం.

■ మల్లవల్లి పారిశ్రామికవాడలో చదును చేస్తున్నామనే పేరుతో కన్‌స్ట్రక్షన్ వారిని అడ్డుపెట్టుకుని 100 ఎకరాలకుపైగా భూమిలో అక్రమంగా తవ్వకాలు జరపడంతో పాటు కోట్లాది రూపాయల గ్రావెల్‌ను పోర్టు అభివృద్ధి పనుల పేరుతో తరలించేశారు. మట్టి మాఫియా అయితే వేలేరు, కొత్తపల్లి, రంగన్నగూడెం, తదితర గ్రామాల్లో చెరువులను చెరపట్టి దోచుకోవడమే పనిగా అక్రమ తవ్వకాలు నిర్వహించింది.



మల్లవల్లి సర్వే నంబర్ 11లో అక్రమ తవ్వకాలు (ఫైల్)

■ బాపులపాడు మండలంలోనే సుమారు 200 ఎకరాల వరకూ అక్రమ తవ్వకాలతో గోతులు పడి ఉన్నాయి. కోట్లాది రూపాయలు మాత్రం మాజీ ఎమ్మెల్యే అనుచరుల జేబుల్లోకి వెళ్లాయి. బాపులపాడు మండలానికి తహసీల్దార్‌గా రావడానికే అధికారులు భయపడ్డారంటే పరిస్థితి అర్థమవుతోంది. ఇదే అదనుగా గన్నవరం తహసీల్దార్‌గా పనిచేసిన నరసింహారావు (బాపులపాడు మండలంలో కూడా పని చేశారు) ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ పనులను చక్కబెట్టారు.

టీడీపీ నేతల ఆస్తుల ధ్వంసం

తన గెలుపునకు కృషి చేసిన టీడీపీ నాయకులను తనతో పాటే వైసీపీలో చేరాలని వంశీ ఆదేశాలు జారీ చేశాడు. బాపులపాడు మండలంలోని నాయకులు అడ్డం తిరగడంతో వారి ఆస్తులను ధ్వంసం చేసేందుకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి భయోత్పాతం సృష్టించారు.

■ తిప్పనగుంటకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు ఎరువుల దుకాణాన్ని అర్ధరాత్రి రెవెన్యూ అధికారుల సహకారంతో నేలమట్టం మిగతా 6లో..

దుర్గగుడిలో హ్యాకింగ్

అన్ని విభాగాల ఫైల్స్ హ్యాక్ చేస్తున్న ఓ ఉద్యోగి

ఆలయ కీలక సమాచారం మొత్తం సేకరణ

- ఈ-ఫైల్స్, ఈ- నోటిఫికేషన్స్ సైతం తన సిస్టమ్‌కు బదలాయింపు
- కాంట్రాక్టర్లతో బేరసారాలు... దాతల నుంచి విరాళాల సేకరణ
- వరుస సస్పెన్షన్లు.. అయినా మళ్లీ విధుల్లోకి..
- హ్యాకింగ్‌లో మెళకువల కోసం సింగపూర్, మలేషియా పర్యటనలు!

నిఘా పెంచిన అధికారులు.. ఆధారాల కోసం అన్వేషణ



ఆంధ్రజ్యోతి -ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో కీలక విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి దెబ్బకు అధికారులు హడలిపోతున్నారు. దేవస్థానానికి సంబంధించిన అన్ని విభాగాల ఆన్‌లైన్ ఫైల్స్ సదరు ఉద్యోగి తన సిస్టమ్‌కు అనుసంధానం చేసుకున్నాడు. ఏఈవో, సూపరింటెండెంట్ నుంచి ఈవోకు వెళ్లాల్సిన కీలకమైన ఫైల్స్‌ను సైతం హ్యాక్ చేస్తున్నాడు. దేవస్థానానికి విరాళాలు ఇచ్చే దాతలు, ఇతర ముఖ్యుల ఫోన్ నంబర్లు, వివరాలు తన సిస్టమ్‌లోనే పెట్టుకుని వారితో ఆలయ ప్రతినిధిగా మాట్లాడుతూ నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విరాళాల సొమ్ము కూడా ఈవోకు తెలియకుండా తన బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిసింది. వెబ్‌సైట్లను హ్యాక్ చేయటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. హ్యాకింగ్ చేయడంలో మరిన్ని మెలకువలు నేర్చుకునేందుకు తరచూ సింగపూర్, మలేషియా వెళ్లి వస్తున్నట్లు సమాచారం. విదేశీ హ్యాకర్లు సైతం ఇతని వద్దకు వచ్చివెళ్తుంటారని వినికిడి. గతంలో టెండర్ల సమాచారం హ్యాక్ చేసి కాంట్రాక్టర్లతో పెద్ద ఎత్తున బేరసారాలు నడిపినట్లు తెలిసింది.

సస్పెండ్ చేసినా మారని తీరు

ఇటీవల ఆలయ ఈవో డిజిటల్ సిగ్నేచర్‌ను హ్యాక్ చేసి పలు అవకతవకలకు పాల్పడ్డాడు. గుర్తించిన ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ సదరు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ తర్వాత సదరు ఉద్యోగి తన పలుకుబడితో మళ్లీ విధుల్లో చేరాడు. ఈ సారి ఏకంగా ఈ- ఫైల్స్, ఈ- నోటిఫికేషన్స్‌ను హ్యాక్ చేసి డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు సమాచారం. దీంతో అతనిపై అధికారులు నిఘా పెంచారు. ఎవరెవరితో హ్యాకింగ్ కింగ్ లావాదేవీలు నడిపాడన్న దానిపై కూడా అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. గతంలో కూడా ఈ హ్యాకింగ్ కింగ్‌పై పలు ఆరోపణలు వచ్చాయి. సస్పెన్షన్‌కు గురవ్వటం, అరెస్ట్ కావటం వంటి ఘటనలు కూడా జరిగాయి. తిరిగి ఏదోవిధంగా మేనేజ్ చేసుకుని ఉద్యోగం పొందటం సదరు ఉద్యోగికి పరిపాటిగా మారింది.

ఒకరి సొమ్ము మరొకరికి జమ

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్వాకం

గ్యాంగ్ మజ్దూర్ వీరాస్వామి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఏఎన్‌ఎం జ్యోతిరాణి ఖాతాలోకి..

- అకౌంటెంట్ జనరల్ కార్యాలయం పరిశీలనలో వెలుగులోకి..
- జ్యోతిరాణి నుంచి డబ్బులు వసూలు చేసేపనిలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- చలానా ద్వారా తమకు చెల్లించాలని ట్రెజరీ అధికారుల మెలిక
- ఈ వ్యవహారంలో తనను ఇరికిస్తున్నారని కలెక్టర్‌కు దివ్యాంగ ఉద్యోగి ఫిర్యాదు



బొడ్డు జ్యోతిరాణి పేరుతో చేసిన బెనిఫిట్స్ చెల్లింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)శాఖ ఉద్యోగి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను మరో శాఖ ఉద్యోగి ఖాతాలో జమ చేసిన విషయం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... విజయవాడ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న గ్యాంగ్ మజ్దూర్ వీరాస్వామి ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఈయనకు ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ రూ.8,91,420 రావాల్సి ఉంది. అయితే ఈ నగదును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బొడ్డు జ్యోతి రాణి అనే మహిళ ఖాతాకు బదిలీ చేశారు. పెండ్యాల గ్రామానికి చెందిన జ్యోతిరాణి ఏఎన్‌ఎంగా పనిచేస్తూ నాలుగు నెలల కిందట పదవీ విరమణ చేశారు. జ్యోతి రాణి తన ఖాతాలో పడిన నగదులో కొంత మొత్తం డ్రా చేసినట్టుగా తెలిసింది. తనకు రావాల్సిన నగదు వేరే ఖాతాకు బదిలీ జరిగినట్టుగా వీరాస్వామికి తెలియదు. అరియర్స్ చెల్లింపులో ఇంకా ప్రాసెస్ జరుగుతుందని ఆయన భావిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక రోజు ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి అరియర్స్ చెల్లింపులపై వీరాస్వామికి లేఖ అందింది. తన బ్యాంకు ఖాతాలో బెనిఫిట్స్ జమ కాని విషయాన్ని వీరాస్వామి అకౌంటెంట్ జనరల్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. అకౌంటెంట్ జనరల్ కార్యాలయం అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను దీనిపై వివరణ కోరగా అసలు విషయం వెలుగు చూసింది. విజయవాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) దీనిపై పరిశీలన జరపగా, వీరాస్వామికి చెల్లించాల్సిన నగదు బొడ్డు జ్యోతి రాణికి చెల్లించినట్టుగా గుర్తించారు. దీనిపై అంతర్గత విచారణ ప్రారంభించగా.. మరో వైపు అకౌంటెంట్ జనరల్ కార్యాలయ అధికారులు కూడా రంగంలోకి దిగటంతో వివాదంగా మారింది. విజయవాడ ఈఈ కార్యాలయంలోని సూపరింటెండెంట్ మిగతా 6లో..

గతంలోనూ ఇలాంటి ఘటనలు

ఇంతకు ముందు కూడా ఆర్‌డబ్ల్యూఎస్ విజయవాడ డివిజన్ ఈఈ కార్యాలయం పరిధిలో ఇలాంటి ఉదంతాలు చోటు చేసుకున్నాయి. గతంలో జేటీవోగా పనిచేసిన నర్రా సురేష్ బాబుకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.8 లక్షలు చెల్లించారు. ఆ తర్వాత మళ్లీ రెండో సారి కూడా చెల్లింపులు చేశారు. ఈ వ్యవహారం వెనుక వాటాల పంపకాల ఒప్పందం జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో కూడా ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకు వచ్చింది. దీనిపై అప్పటి సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ ఆగ్రహం వ్యక్తం చేసి విచారణకు కూడా ఆదేశించారు. జరిగిన తప్పును సరిదిద్దుకోవటానికి అప్పటి ఇంజనీరింగ్ అధికారులు నానా తిప్పలు పడ్డారు.



మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

అంగన్వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్

13 మంది చిన్నారులకు వాంతులు, విరేచనాలు

- అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం వల్లే..
- ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు పెద్ద తండాలో ఘటన
- మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలింపు.. నిలకడగా ఆరోగ్యం



ఎ.కొండూరు/మైలవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రం (168) వద్ద అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తిన్న 13 మంది చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం పెద్ద తండాలో గురువారం సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. రోజు వలే అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్నం చిన్నారులు భోజనం చేశారు. కొద్ది సేపటి తర్వాత భూక్యా మోక్షిత(4), గుగులోతు సాయి దేవాన్ష్(5), జరబల జస్వంత్ దత్త(5), పవన్(4), అజ్మీర లవణ్యశ్రీ(3), గుగులోతు మధురియా(4), జరబల శాన్వీ(4), అజ్మీర తేజష్(4), రిషీత్(4), ఉదయశ్రీ(5) వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు 108కు సమాచారం ఇచ్చిన గంటకు కూడా అది రాకపోవడంతో టీడీపీ గిరిజన సంఘం నేత బాణావతు బీమ్లా నాయక్ ఆటోలో చిన్నారులను మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరబల చంటి కుమారుడు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎ.కొండూరు పీహెచ్‌సీ డాక్టర్ సహకారంతో మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చిన్నారులను తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పరామర్శించారు. చిన్నారులకు అస్వస్థతగా ఉన్న సాయంత్రం వరకు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని, ప్రాణాలకు హాని జరిగితే ఎవ్వరు బాధ్యత వహిస్తారని అంగన్‌వాడీ సిబ్బందిని నిలదీశారు.

అసూయతో అడ్డుకునే యత్నం!

నందిగామ వంద పడకల ఆస్పత్రి పనులకు బ్రేక్

- హైకోర్టులో రిట్ పిటిషన్
- వైద్యశాల ఇరుకు ప్రదేశంలో ఉందని వాదన
- అదే స్థానంలోనే నిర్మించి తీరుతాం : అభివృద్ధి కమిటీ

6లో

ల్యాంకో లైన్‌కు లైసెన్స్ ఉందా?

- 25వ తేదీలోపు చెప్పండి.. లేకుంటే సెంట్రల్ పవర్ మినిస్ట్రీ సెక్రటరీని పిలుస్తాం
- ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు ధర్మాసనం
- ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ పవర్ లైన్స్ లైసెన్స్‌పై సంస్థల దోబూచులాట
- ల్యాంకో లైన్‌కు లైసెన్స్ లేకపోతే.. తొలగింపునకు ఆదేశాలిచ్చే అవకాశం?
- ఇదే జరిగితే లైన్ లాస్ పేరుతో చెల్లించిన రూ.14కోట్లు ఎవరి జేబుల్లోకి..?

8లో

ఏడీసీఎల్‌కు వీఐపీ కారిడార్ బ్యూటిఫికేషన్ బాధ్యతలు

- ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 13 కిలోమీటర్లు
- అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ నుంచి ఏడీసీఎల్‌కు నిర్వహణ బాధ్యతలు
- రాజధాని పనులు ఊపందుకోనున్న నేపథ్యంలో కీలక బాధ్యతలు

8లో

ఐదుగురు విద్యార్థినుల అదృశ్యం

గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగింత 6లో

క్రమశిక్షణ నగరంగా తీర్చిదిద్దాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు 100 శాతం సమన్వయంతో కృషి చేయాలి

- స్వచ్ఛంద సంస్థలూ కీలక భాగస్వాములే
- డీఆర్‌సీసీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

6లో

జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలు 22, 23న

8లో



వీరమ్మ ఆలయంవద్ద భక్తుల తాకిడి, వీరమ్మతల్లిని దర్శించుకున్న వైవీబీ రాజేంద్రప్రసాద్ (కింద)

వీరమ్మ తిరనాళ్లకు పోటెత్తిన భక్తులు



ఉయ్యూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. శనివారంతో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో గురువారం వేకువ జామునుంచి భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పాలపొంగళ్లు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించేందుకు దుకాణాల వద్ద రద్దీ కన్పించింది.

వీరమ్మ తిరునాళ్లలో గురువారం అమ్మవారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ దర్శించి పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ స్వాగతం పలికి అమ్మవారి వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే తిరునాళ్లకు తెలుగు రాష్ట్రాలతో పాటు పలుప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. కొలిచిన వారి కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి వీరమ్మ దర్శనం మహాభాగ్యంగా భావిస్తారన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, జంపన వీర శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కోసూరువారిపాలెం వద్ద టమాట రైతులతో మార్కెటింగ్ అధికారులు

దళారులతో మోసపోవద్దు

» రైతు బజార్‌లో నేరుగా అమ్ముకోండి

» టమాట పంటను పరిశీలించిన మార్కెటింగ్ అధికారులు

మోపిదేవి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులు దళారులను నమ్మకుండా స్వయంగా రైతు బజారుకు విచ్చేసి గిట్టుబాటు ధరకు విక్రయాలు జరుపుకోవాల్సిందిగా మార్కెటింగ్‌శాఖ ఏడీ నిత్యానంద్ తెలిపారు. గురువారం మోపిదేవి మండలంలోని కోసూరువారిపాలెం, మేళ్లమర్తిలంక గ్రామాల్లోని టమాట తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలోని లంక గ్రామాలు కూరగాయలు, వాణిజ్య పంటల సాగుకు దివిసీమ ప్రాంతం విశిష్టత కలిగిందన్నారు. ప్రస్తుతం టమాట దిగుబడి అధికంగా ఉన్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర రావటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దళారులను నమ్ముకుని నష్టాల పాలవుతున్నట్టు అధికారులకు రైతులు వివరించారు. మండలంలో 117 ఎకరాల్లో టమాట సాగు చేస్తుండగా, 50 శాతం వరకు ఇప్పటికే పంట కోత కోయటం జరిగిందని తెలిపారు. మార్చినెల వరకు పంట సాగు ఉంటుందని, మచిలీపట్నం రైతుబజార్‌కు పంటను రైతులు స్వయంగా తీసుకెళ్లి అమ్ముకోవచ్చునని, కేజీకి రూ.13లకు రైతులకు ధర ఉంటుందని ఏడీ తెలిపారు. అవసరమైన పక్షంలో ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ రైతు బజారులో కూడా టమాట విక్రయించుకునేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు. అవనిగడ్డ ఉద్యానశాఖాధికారి ఎన్.రమేష్, మచిలీపట్నం రైతు అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



గో గ్రీన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

గో గ్రీన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కృష్ణలంక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల రాష్ట్ర సమాఖ్య గో-గ్రీన్ క్యాలెండర్, ఇంజినీరింగ్ డైరీని జనవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు గురువారం ఎంజీ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లకు మంత్రి అభినందనలు తెలిపారు. సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు, జనవనరులరంగ నిపుణులు, ఇంజినీరు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు సమాజంలో పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రస్తుత కుంభమేళా సమయంలో ఈనెలలో రాబోయే మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా గో-గ్రీన్ క్యాలెండర్, డైరీని రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు కృషిని అభినందించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సాగునీటి సంఘాల ప్రతినిధులు జలవనరుల రంగ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు కొమ్మారెడ్డి రాజేష్, యార్లగడ్డ రవిబాబు (కృష్ణా), పామర్తి శ్రీనివాసరావు, కఠారి కోటేశ్వరరావు (ఎన్టీఆర్), బొప్పూడి కాశీబాబు, రాపర్ల బాలకృష్ణ (ఏలూరు జిల్లా), నల్లజర్ల రవికుమార్, ఆరే పున్నారెడ్డి (గుంటూరు జిల్లా) తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కారుణ్యంపై కార్మిక సంఘాల హర్షం

బస్‌స్టేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో కారుణ్య నియమాకాలకు ప్రభుత్వం ఆమోదం తెలపటంపై ప్రజారవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్, కార్మిక పరిషత్‌లు హర్షం వెలిబుచ్చాయి. గురువారం వేర్వేరు ప్రకటనల్లో ఉద్యోగ సంఘాలు స్పందించాయి. కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ ఈ సందర్భంగా కారుణ్య నియమాకాలకు ఆదేశాలు జారీచేయటంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావులు మంత్రులు లోకేష్, రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు 600 కుటుంబాలలో అర్హత కలిగిన వారికి ఉద్యోగాలు వస్తాయని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు : ఏపీటీఎఫ్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల నేతలు ఈ ఎన్నికల్లో ప్రవేశిస్తే శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల పక్షాన ప్రాతినిధ్య వహించే వారి సంఖ్య తగ్గిపోతుందన్నారు. లక్ష్మణరావుకు ఎమ్మెల్సీగా సుదీర్ఘ అనుభవం ఉందని, మండలి వేదికగా సమస్యలపై ప్రశ్నించే అవకాశం ఆయనకు మరోసారి దక్కాలన్నారు.

అసూయతో అడ్డుకునే యత్నం!

» నందిగామ వందపడకల ఆసుపత్రి పనులకు బ్రేక్

» హైకోర్టులో రిట్ పిటిషన్

» వైద్యశాల ఇరుకు ప్రదేశంలో ఉన్నదని వాదన

» ఉన్న స్థానంలోనే నిర్మించి తీరుతాం : అభివృద్ధి కమిటీ



నందిగామ ఏరియా వైద్యశాల

నందిగామ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నందిగామ ఏరియా వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధిపై హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలైంది. సేకరించిన సమాచారం ప్రకారం.. నందిగామ ప్రాంత ప్రజలు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వంద పడకల వైద్యశాల కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. ఈమేరకు ఇటీవల జీవో విడుదల చేసిన ప్రభుత్వం రూ.34 కోట్లు నిధులు మంజూరు చేసింది. జీప్లస్-4 భవన నిర్మాణంతో పాటు వైద్యశాలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న వైద్యశాల స్థానంలోనే వంద పడకలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. సౌమ్య నిర్ణయంపై మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌లు విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఉన్న వైద్యశాల ఇరుకైన ప్రదేశంలో ఉందని, పార్కింగ్, అంబులెన్స్‌లు వచ్చేందుకు వీలుండదని వాదించారు. వంద పడకల ఆసుపత్రి కోసం గత ప్రభుత్వంలోనే చర్యలు చేపట్టామన్నారు. వైద్యశాల నిర్మాణానికి కోనాయపాలెం బైపాస్‌లో ఐదు ఎకరాలు సేకరించి సిద్ధంగా ఉంచామని, ఆ స్థలంలో వైద్యశాల నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. అయితే అధికారులు మాత్రం ఉన్న స్థానంలోనే నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఈక్రమంలో పట్టణానికి చెందిన మాడుగుల ప్రభుదాసు అనేవ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. వైద్యశాల విస్తరణ కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను పాత వైద్యశాలలో ఖర్చు చేయడం సరికాదని, దీనివల్ల రోగులు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నందున ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ప్రభుత్వం నుంచి కూడా కౌంటర్ దాఖలైనట్టు తెలిసింది.

వైసీపీ హయాంలో సేకరించిన భూమిని వదిలేసిన అధికారులు..

వైసీపీ అధికారంలో ఉండగా, వంద పడకల వైద్యశాల కోసం కోనాయపాలెం బైపాస్ పక్కన ఐదు ఎకరాల భూమిని సేకరించారు. ఎకరం రూ.60 లక్షలుగా ధర నిర్ణయించారు. కానీ రైతులకు సొమ్ము చెల్లించకుండానే భూమి రికార్డులు బదలాయించారు. ఇంతలో ఎన్నికలు రావడం, కూటమి అధికారంలోకి రావడం జరిగింది. భూయజమానులు పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా సొమ్ము విడుదల కాలేదు. పాత వైద్యశాల స్థానంలోనే వంద పడకల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో రైతుల భూమి రైతులకు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో వైద్యశాల తరలింపు వాదనకు తెరపడింది. ప్రత్యామ్నాయం లేక పోవడంతో పాత వైద్యశాల స్థానంలోనే వంద పడకలు ఏర్పాటు చేయడం అనివార్యమైంది. ఈదశలో దాఖలైన పటిషన్‌పై న్యాయ స్థానం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఈర్ష్యతోనే అడ్డుకుంటున్నారు..

వేపూరి నాగేశ్వరరావు, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్



నందిగామ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య వంద పడకల వైద్యశాల సాధించారని వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు అన్నారు. ఐదేళ్ల పాటు వైద్యశాలపై ప్రచారం చేసుకున్న మొండితోక సోదరులు కనీసం అనుమతులు కూడా తేలేక పోయారన్నారు. వైద్యశాల పరిసరాలు ఇరుకుగా ఉన్నాయన్న వాదన సరికాదన్నారు. రెండు వైపులా విశాలమైన రహదారులు ఉన్నాయన్నారు. కేవలం అసూయతోనే తన అనుచరుడితో కోర్టులో పిటిషన్ వేయించారని ఆరోపించారు. న్యాయమే గెలుస్తుందని, ఉన్న వైద్యశాల స్థానంలోనే వంద పడకలు నిర్మించి తీరుతామన్నారు.

తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు!

» కాంట్రాక్టు సంస్థపై చర్యలకు మైనింగ్ అధికారికి రూరల్ తహసీల్దార్ లేఖ

» ప్రయివేటు వ్యక్తుల పాత్రపైనా పోలీసులకు ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యావరణ అనుమతులు లేకుండా విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు చేపడుతున్న మెయిల్ సంస్థ తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు జరిపిందని, సంస్థతో పాటు పలువురు ప్రైవేటు వ్యక్తులు ఈ అక్రమ తవ్వకాలలో ఉన్నారంటూ విజయవాడ రూరల్ తహసీల్దార్ బి.సుగుణ జిల్లా మైనింగ్ అధికారికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన మెయిల్ సంస్థ, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే అక్రమ తవ్వకాలపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెయిల్‌ను అడ్డం పెట్టుకుని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడిన విషయం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ రూరల్ మండలం తాడేపల్లి గ్రామంలోని రీ సర్వే నెంబర్ 247/3ఏ1, 2బీ1లలో 2.51 ఎకరాల భూమిని మైనింగ్ చేయటానికి విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు కాంట్రాక్టు సంస్థ మెయిల్ జిల్లా మైనింగ్ అధికారికి అర్జీలు దాఖలు చేసుకోవటం జరిగింది. ఈ అర్జీపై రెవెన్యూ శాఖను నివేదిక కోరటం జరిగింది. మెయిల్ ప్రతిపాదించిన భూమి అటవీభూమికి 500 మీటర్ల లోపు ఉండటంవల్ల జిల్లా అటవీశాఖ పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా రెవెన్యూ తహసీల్దార్ కోరటం జరిగింది. అటవీశాఖ అధికారులు కొన్ని షరతులకు లోబడి అనుమతికి సిఫార్సు చేయటంతో అనుమతులు ఇవ్వటానికి జిల్లా మైనింగ్ అధికారికి రెవెన్యూ అధికారులు నివేదించటం జరిగింది. ఇదిలా ఉండగా.. విజయవాడ రూరల్ తహసీల్దార్ బి.సుగుణ జిల్లా మైనింగ్ అధికారికి తాజాగా ఒక లేఖ రాశారు. ఈ లేఖ ప్రకారం.. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన సందర్భంలో మెయిల్ సంస్థకు అనుమతించిన సర్వే నెంబర్ 247/3ఏ1, 2బీ1లలో 2.51 ఎకరాల భూమితో పాటుగా సర్వే నెంబర్ 247/3బీలో 2.60 ఎకరాలు, సర్వే నెంబర్ 247/3ఏ2 లో 0.47 సెంట్లు, సర్వే నెంబర్ 247/3ఏ3లో 0.25 సెంట్లలోని భూమిలో అక్రమ తవ్వకాలు జరిగాయని తెలిపారు. అలాగే మెయిల్ సంస్థకు మౌఖికంగా అనుమతించినా సర్వే నెంబర్ 247/3ఏ1 లో 1.51 సెంట్ల భూమికి పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు అనుమతులు రాకుండానే తవ్వకాలు జరిగాయని లేఖలో పేర్కొన్నారు. అలాగే కొత్తపేట పోలీసులకు చేసిన ఫిర్యాదులో మెయిల్ సంస్థతో పాటు, ప్రైవేటు వ్యక్తులు వాసా నాగరాజు, పోతురాజు మాధవరావులు కూడా అక్రమ మైనింగ్ జరిపారని వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేశారు.

క్రమశిక్షణ నగరంగా తీర్చిదిద్దాలి

» రోడ్డు ప్రమాదాల నివారణకు 100 శాతం సమన్వయంతో కృషిచేయాలి

» స్వచ్ఛంద సంస్థలూ కీలక భాగస్వాములే

» డీఆర్‌సీసీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ప్రాంతానికి ముఖ్య ద్వారమైన విజయవాడను ట్రాఫిక్‌పరంగా క్రమశిక్షణతో కూడిన నగరంగా తీర్చిదిద్దడంలో అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన రహదారి భద్రత కమిటీ (డీఆర్‌సీసీ) సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాద స్థితిగతులు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద తీసుకొన్న చర్యలు, రహదారి భద్రత ఉల్లంఘనలపై చర్యలు, హిట్ అండ్ రన్ మోటారు యాక్సిడెంట్ స్కీమ్-2022, ఐ-రాడ్ అమలు, రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలు తదితరాలపై చర్చించారు. 2024లో జిల్లాలో మొత్తం 1,343 రహదారి ప్రమాదాలు జరగ్గా, 431 మరణాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, రవాణా, పోలీస్, ట్రాఫిక్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు, విజయవాడ నగరపాలక సంస్థ తదితర శాఖల అధికారులతో పాటు డీఆర్‌సీసీ ఇతర భాగస్వామ్య పక్షాలు పటిష్ఠ సమన్వయంతో పనిచేసి రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందన్నారు. స్వచ్ఛంద సంస్థల నివేదికలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి రహదారి ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ కార్యాచరణ అవసరమన్నారు. ప్రతి నెలా తప్పనిసరిగా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

- జిల్లాలో ముఖ్యంగా విజయవాడలో ట్రాఫిక్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు రియల్‌టైమ్ డేటాను విశ్లేషిస్తున్నామని, ఆ ఫలితాల ఆధారంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకొంటున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. సిస్టమాటిక్ పార్కింగ్‌పైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు సీపీ వెల్లడించారు. సమావేశంలో డీసీపీలు గౌతమిశాలి, కేఎం మహేశ్వర రాజు, కేజీవీ సరిత, ఎం.కృష్ణమూర్తి నాయుడు, డీటీసీ ఎ.మోహన్, ఆర్ అండ్ బీ ఎస్ఈ టి.సత్యనారాయణ తదితరులతో పాటు వీఎంసీ, పోలీస్, ట్రాఫిక్, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న ఉమాదేవి

జీబీ సిండ్రోమ్ వ్యాధికి జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన ఉమాదేవి జీబీ సిండ్రోమ్‌తో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఆమెకు వైద్యులు సుమారు 3 లక్షల విలువగల వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. ప్రస్తుతం రోగి పరిస్థితి మెరుగవుతుందని డాక్టర్ బెస్సీ (అసిస్టెంట్ ప్రొఫెసర్) తెలిపారు. మరో మూడు రోజుల్లో రోగికి కోర్సు పూర్తవుతుందని ఆమె చెప్పారు. కోర్సు పూర్తయితే రోగి ఆరుమాసాలకు పూర్తిగా కోలుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థినుల అదృశ్యం

» గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగింత

గన్నవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఐదుగురు విద్యార్థినుల అదృశ్యం కేసును గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించారు. వారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గన్నవరం స్టేషన్ సీఐ బీవీ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాదకు చెందిన నలుగురు విద్యార్థినులు విజయవాడలోని ఒక కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిలో ఒక విద్యార్థినికి కళాశాలలో ఫీజు కట్టమని తండ్రి గత శనివారం కొంత నగదు ఇచ్చాడు. ఆ విద్యార్థిని ఆరోజు కళాశాలకు వెళ్లకుండా సహ విద్యార్థినులతో కలిసి పార్క్‌కు వెళ్లి సరదాగా గడిపారు. సాయంత్రం ఇంటికి వచ్చిన విద్యార్థిని ఫీజు కట్టలేదని తెలియడంతో తండ్రి మందలించాడు. ఈ విషయం తెలిసిన ఆమె స్నేహితులు ఇంటి దగ్గర ఉంటే తల్లిదండ్రులు తిట్టడం కొట్టడం చేస్తారని.. గురువారం ఉదయం విజయవాడ రైల్వే స్టేషన్‌లో కలవాలని నిర్ణయించుకున్నారు. ఐదుగురు కలిసి విజయవాడ వెళ్లి హైదరాబాద్ వెళ్లే రైలు ఎక్కారు. ఇంటిలో కుమార్తె కనిపించకపోవటంతో ఓ విద్యార్థిని కుటుంబీకులు వెంటనే గన్నవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులు రైలులో వెళుతున్నట్టు గుర్తించారు. పిడుగు రాళ్ల స్టేషన్‌లో ఐదుగురిని పట్టుకుని గన్నవరం తీసుకువచ్చారు. వారిని ప్రశ్నించగా తల్లిదండ్రులు తరచూ మందలిస్తున్నారని, చీటికి మాటికి తిడుతున్నారని అందుకే హైదరాబాద్ వెళ్లాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. విద్యార్థినులు, తల్లిదండ్రులను తహసీల్దారు ఎదుట హాజరు పరిచారు. కేవీ శివయ్య, సీఐ శివ ప్రసాద్‌లు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం కీలకం

» ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్‌ఎంఈడీసీ) చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా యూనిట్లు నెలకొల్పే యువపారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి సహకరించాలని ఆయన బ్యాంకర్లను కోరారు. గురువారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎంఎస్‌ఎంఈడీసీ కార్యాలయంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో శివశంకర్ మాట్లాడారు. చదువుకున్న యువత ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలన్నారు.

ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మినహాయించాలి: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలకు విధించిన పన్నులపై వడ్డీని మినహాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. ఇప్పటికే పన్నులు కట్టలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వడ్డీ మరింత భారంగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు కట్టాల్సిన పన్నులపై వడ్డీ మినహాయింపునిస్తూ జీవో విడుదల చేయాలని రామకృష్ణ కోరారు.

ఎస్జీటీలను 'టెన్త్' డ్యూటీల నుంచి మినహాయించాలి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ డ్యూటీల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లను మినహాయించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కాకి ప్రకాష్‌రావు పాఠశాల విద్యాశాఖ అధికారులను కోరారు. రాష్ట్రంలోని ఎక్కువ ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు మాత్రమే టీచర్లు పనిచేస్తున్నారని, వారికి పరీక్షల డ్యూటీలు వేస్తే బోధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.

నేటి నుంచి విజయవాడ క్లబ్‌లో మాస్టర్స్ వెటరన్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్

తాడేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బాడ్మింటన్ అసోసియేషన్, స్పాన్సర్ విజయవాడ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21 నుండి 25వరకు విజయవాడ క్లబ్‌లో ఏపి స్టేట్ మాస్టర్స్ వెటరన్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని క్లబ్ అధ్యక్షులు ఎంఎస్ చౌదరి, కార్యదర్శి పెరవలి చంద్రశేఖరరావు (చంద్రం) తెలిపారు. పురుషులు మరియు మహిళలకు నిర్వహించనున్న ఈ టోర్నమెంట్ ఈవెంట్లు పురుషులు, సింగిల్స్ మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్ మిక్సడ్ డబుల్స్‌లో పోటీలుంటాయన్నారు. 35 ఏళ్ల నుండి 75 ఏళ్ల వారి వరకు అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు రానున్నారని, క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు ఫిబ్రవరి 21 ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. మెయిన్ డ్రా మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి 21 సాయంత్రం 4 గంటలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసార శాఖల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారన్నారు. చలసాని విజయకుమార్, ఇ బుచ్చిబాబు, విజయవాడ క్లబ్‌లోని బాడ్మింటన్ క్రీడాకారులు యాజమాన్యం, స్పాన్సర్ షిప్ ప్రతినిధులుగా ఉన్నారని చెప్పారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

సంచార పశువైద్య సేవలు

» వెటర్నరీ డైరెక్టర్ దామోదర్‌నాయుడు

అమరావతి: రాష్ట్రంలో సంచార వాహనాల ద్వారా మెరుగైన పశువైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్థకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీ కాల పరిమితి ముగియడంతో అర్హత గల ఏజెన్సీల నుంచి ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించామని చెప్పారు. నిబంధనల ప్రకారం కొద్ది రోజుల్లో ఏజెన్సీని ఎంపిక చేస్తామన్నారు. అప్పటి దాకా పశువైద్య సేవలకు అంతరాయం లేకుండా 165 వాహనాల ద్వారా ప్రస్తుత ఏజెన్సీ సేవలు అందిస్తుందని చెప్పారు.

గన్నవరంలో భూ బాగోతాలు

(5వ పేజీ తరువాయి)

చేయించారు. వేరొకరి వద్ద కొనుగోలు చేసిన స్థలంలో రేకుల షెడ్డు వేసి ఎరువుల దుకాణం నడుపుతుంటే రాత్రి ఎనిమిది గంటల సమయంలో నోటీసును గోడకు అంటించి తెల్లవారుఝామున దుకాణాన్ని కూల్చివేశారు. దీనికి అప్పటి తహసీల్దార్ నరసింహారావుతో పాటు రెవెన్యూ సిబ్బంది సహకారం అందించారు. రైతులు అడ్డుకుంటే పోలీసులతో కేసులు పెట్టించి వేధించారు. నేలమట్టమయిన దుకాణం రాళ్లను కూడా అక్కడి రోడ్ల గోతులు పూడ్చేందుకు ఉపయోగించారంటే అరాచకం ఏ స్థాయిలో చేశారో అర్థం చేసుకోవచ్చు.

■ రేమల్లెకు చెందిన తుమ్మల ఉదయ్‌ను వైసీపీలో చేరాలని ఒత్తిడి చేసినా లొంగక పోవడంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని పోలీస్‌స్టేషన్ తీసుకువెళ్లి బెదిరించారు. అప్పటికీ వినకపోవడంతో అన్ని అనుమతులు తీసుకుని సాగు చేసుకుంటున్న 13 ఎకరాల రొయ్యల చెరువుకు మల్లవల్లిలో పని చేస్తున్న యంత్రాలను తీసుకువచ్చి రాత్రికి రాత్రే గండ్లు పెట్టడంతో పాటు విద్యుత్ కనెక్షన్లు కట్ చేయించారు. దీని వల్ల రూ.35 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఉదయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఆ కుటుంబాన్ని దెబ్బతీశారు.

■ విజయవాడ మధురానగర్‌కు చెందిన సుంకర సీతామహాలక్ష్మి అనే మహిళ గన్నవరం పట్టణంలో సర్వే నంబర్ 477-2లో 484 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే ఆ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రోద్బలంతో సూరపనేని అనిల్ కుమార్, వైసీపీ జిల్లా నాయకుడైన మేచినేని బాబు మేనల్లుడు శివరామకృష్ణ ఆక్రమించుకుని దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు కలెక్టర్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. దీనికి రెవెన్యూ అధికారులు సిహెచ్.నరసింహారావు, పవన్‌కుమార్, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

■ సూరంపల్లి గ్రామానికి చెందిన గొట్టిపూళ్ల రఘునాథ్‌కు సర్వే నంబర్ 366లో 5.77 ఎకరాల భూమి ఉంది. 2019లో అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అతని అనుచరులు కొమ్మా కోట్లు, సిహెచ్.రవీంద్రబాబు, ఎస్‌కె.ప్రసాద్, పి.గోపిరాజు, కె.నాగభూషణం తదితరులు తనను బెదిరించి, కుటుంబ సభ్యులను చంపుతామని భయపెట్టి రూపాయి కూడా ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు గొట్టిపూళ్ల రఘునాథ్ తెలిపారు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

■ గన్నవరం టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావుకు సూరంపల్లిలో సర్వే నంబర్ 308-4లో 99 సెంట్లు పూర్వార్జితంగా వచ్చింది. 1964లో ప్రభుత్వం బీఫారం పట్టా కూడా ఇచ్చింది. 1999లో నగదు కట్టించుకుని డిఫారం పట్టాను మంజూరు చేసింది. 2019లో వెంకటేశ్వరరావు తల్లి మృతి చెందడంతో, ఆ భూమిని తన పేరున మార్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు ఆయన వైసీపీలోకి రాలేదనే అక్కసుతో ఆ భూమిని ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులతో బోర్డులు పెట్టించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. ఆ భూమిలో ఉన్న షెడ్డును జేసీబీలతో అక్రమంగా కూల్చివేయించారు. ఇదేమని ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరించారు. ముందుగా ఆ భూమిలోకి వంశీతో పాటు వైసీపీ నాయకులు, తహసీల్దారు నరసింహారావు వెళ్లి చూశారు. ఆ తర్వాత బోర్డులు పెట్టి కూల్చేశారు.

ఒకరి సొమ్ము మరొకరికి జమ

(5వ పేజీ తరువాయి)

జ్యోతిరాణితో మాట్లాడి డబ్బులు రికవరీ చేయించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆమె డబ్బులు పూర్తిగా చెల్లించటానికి అంగీకారం తెలిపినట్టుగా సమాచారం. ఈ దశలో ట్రెజరీ అధికారులు నగదుగా వీరాస్వామికి డబ్బులు చెల్లిస్తే పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ డబ్బులను చలానా రూపంలో ట్రెజరీకి చెల్లించాలని మెలిక పెట్టారు. కానీ చలానా ఏ ప్రాతిపదికన కట్టించాలి అన్న అంశంపైనా ట్రెజరీ అధికారులు కూడా తర్జన భర్జన పడుతున్నారు.

ఉద్యోగులు కావాలని చేశారా?

గ్యాంగ్ మజ్దూర్ వీరాస్వామికి చెల్లించాల్సిన నగదును బొడ్డు జ్యోతిరాణికి చెల్లించడంలో ఆఫీసు ఉద్యోగుల పాత్రమైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆఫీసు సూపరింటెండెంట్ దీనికి బాధ్యత వహించాల్సి ఉంది. చెల్లింపులకు సంబంధించి ఆయన లాగిన్ ద్వారానే జరగాలి. దీనికి విరుద్ధంగా వై.అనిల్ కుమార్‌రెడ్డి అనే దివ్యాంగ ఉద్యోగి లాగిన్ ద్వారా డబ్బులు చెల్లించినట్టు తెలుస్తోంది. దివ్యాంగ ఉద్యోగితో లాగిన్ ఓపెన్ చేసి అతని ద్వారా పేమెంట్స్ ఎలా చేస్తారన్నది ప్రశ్నగా ఉంది. దివ్యాంగ చిరుద్యోగిని బలి పశువును చేసేందుకు ఈ పని చేశారా అన్న విమర్శలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో కార్యాలయ సూపరింటెండెంట్ పాత్రపై పలు ఆరోపణలు వస్తున్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దివ్యాంగ ఉద్యోగి

ఈ వ్యవహారంలో తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని దివ్యాంగ ఉద్యోగి వై.అనిల్ కుమార్‌రెడ్డి కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. తన పేరుతో లాగిన్ ఓపెన్ చేసి చెల్లింపులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాట్లాడలేని సదరు దివ్యాంగ ఉద్యోగి రాసి వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95,104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

కాళీమాత హుండీ ఆదాయం రూ.12 లక్షలు



కృష్ణలంక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించగా రూ.12,68,839 వచ్చినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్ ఆధ్వర్యంలో 150 రోజులకు హుండీలను లెక్కించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.పుల్లయ్య, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి నాయకుడు, లాయర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్డీఏ అభ్యర్థిగా ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారని, ఆయనకు మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. బెంజిసర్కిల్ నారాయణ విద్యా సంస్థల అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బందితో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఓటు వేసేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి అశోక్ బాబు గద్దె క్రాంతికుమార్, చెన్నుపాటి గాంధీ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్



సిద్ధార్థ మహిళా కళాశాలలో మాట్లాడుతున్న గద్దె అనురాధ

ఆలపాటికి ఓటేయండి

కృష్ణలంక: ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాల్సిందిగా తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. గురువారం కృష్ణలంక పొట్టి శ్రీరాములు హైస్కూల్‌కు వచ్చిన ఆయన ఉపాధ్యాయులను కలిసి ఆలపాటికి ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, మోటేపల్లి చిన్నా, గొరిపర్తి నామేశ్వరరావు, నిమ్మల జ్యోతిక, వల్లూరి మధు, బీజేపీ నాయకులు వాసా పల్లపురాజు పాల్గొన్నారు.

లబ్బీపేట: ఆలపాటి రాజా విజయాన్ని కాంక్షిస్తూ లబ్బీపేటలోని సిద్ధార్థ మహిళా కళాశాల, బెంజిసర్కిల్ వద్ద గల గౌతమ్ డిగ్రీ కాలేజీలోని ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ పట్టభద్రులను జిల్లా పరిషత్ మాజీ ఛైర్ పర్సన్ గద్దె అనురాధ కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పేరేపి ఈశ్వర్, మల్లెల రామకృష్ణ పాల్గొన్నారు.

పటమట: ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ 12వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు ఆధ్వర్యంలో గురువారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ కర పత్రాలను పంచుతూ తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు శాయన బుజ్జి, కాలిక్, కరీమ్, కొండవీటి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మాల్స్‌లో భద్రతా ఏర్పాట్లు చేయాలి

అగ్నిప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలన

గుణదల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరగకుండా షాపింగ్ మాల్స్, పాఠశాలల్లో ఖచ్చితంగా భద్రత ఏర్పాట్లు చేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ఉదయం చుట్టుగుంటలోని మెట్రో షాపింగ్ మాల్‌ను సందర్శించి అందులో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకున్న చర్యలను పరిశీలించారు. మెట్రోలో సెట్‌బ్యాక్‌లో చిన్న లోపాలను గమనించిన ఆయన వాటిని సరిచేస్తేనే నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేస్తానని మెట్రో మేనేజర్‌కు తెలియజేశారు. అనంతరం ఆయన గుణదల కార్మెల్‌నగర్లోని సెయింట్ మేరీ విజయ కాన్వెంట్‌ను సందర్శించి అక్కడ సిబ్బంది తీసుకున్న ముందస్తు చర్యలను స్వయంగా పరిశీలించారు. ఫైర్ ఎగ్జిట్లు సక్రమంగా ఉన్నదీ లేనిది పరిశీలించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, జిల్లా అగ్నిమాపక అధికారి మాల్యాద్రి, రీజనల్ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ అధికారి రాజా, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, మెడికల్ అధికారి డాక్టర్ సురేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.



సెయింట్ మేరీ విజయ కాన్వెంట్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

డీసిల్టింగ్ ప్రక్రియ నిరంతరం జరగాలి

భారతీనగర్: వర్షాలు పడినప్పుడు రోడ్డు మీద నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు నగరంలో నిరంతరం డీసిల్టింగ్ ప్రక్రియ జరుగుతూ ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. కమిషనర్ ధ్యానచంద్ర గురువారం గురునానక్‌కాలనీ, ఆంధ్రా లయోలా కాలేజీ రోడ్డు, ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, కోనేరు శ్రీధర్ రోడ్డు, ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డీసిల్టింగ్ పనులు కచ్చితంగా జరుగుతూ ఉండాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అవుట్‌ఫాల్ డ్రెయిన్, సర్వీస్ డ్రెయినేజీలోని పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోనేరు శ్రీధర్ రోడ్డులోని లక్ష్మీపతిఅప్పారావు సరోజిని పార్క్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, చీఫ్ సిటీప్లానర్ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఎస్ఈలు, ఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

23న టీటీడీ భజన బృందాల ఆత్మీయ సమావేశం

లబ్బీపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న టీటీడీ భజన బృందాల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశం 23న ఉదయం 10గంటలకు ఏలూరు రోడ్డు చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఈస్ట్ లైన్స్ క్లబ్‌హాల్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో తాళం భజన బృందం, పారాయణ, నామ సంకీర్తన బృందాలు, బృందాల ప్రెసిడెంట్ లేదా కార్యదర్శి, భజన గురువులు తప్పక పాల్గొనవలసిందిగా కోరుతున్నామని తెలిపారు. హాజరైన వారికి మధ్యాహ్నం ప్రసాదం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

అగ్నిబాధితులకు అమరావతి వాకర్స్ సాయం



కృష్ణలంక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక అగ్ని బాధితులకు అమరావతి వాకర్స్ క్లబ్ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షులు నిమ్మల జ్యోతిక ఆధ్వర్యంలో బాధితులకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నగదుతో పాటు వంటసామాగ్రి, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెన్నా శంకర్, యాదల రూపేంద్ర, ఎ.చెన్నయ్య, బాస రవికుమార్, ఐ.శ్రీనివాసరావు, పోతిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

పీఎంఈజీపీతో పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

గుణదల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రైమినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) ద్వారా రుణాలు పొంది నిరుద్యోగ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎంఈ కో-ఆర్డినేటర్ డాక్టర్ సంకే విశ్వనాథం తెలిపారు. 5వ డివిజన్ పరిధి ఎల్‌బీసీ కాలనీలోని జయప్రకాష్ నగర్లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో విశ్వనాథం మాట్లాడుతూ రుణాలు పొందడం ఎలా, ఏ యూనిట్స్ పెట్టుకుంటే లాభదాయకంగా ఉంటుందనే విషయమై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి దరఖాస్తు నుంచి రుణాలు పొందే వరకు ఎంపీ శివనాథ్ సహాయసహకారాలు అందించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, మాజీ కార్పొరేటర్ కాకు మల్లిఖార్జున యాదవ్, టీడీపీ రాష్ట్ర నాయకులు గురునాథం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, సిద్దెల వివేక్, జనసేన డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, షరీఫ్, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంకే విశ్వనాథం

గన్నవరం విమానాశ్రయానికి ఆర్మీ జవాన్ పార్థివదేహం

గన్నవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ జవాన్ పార్థివదేహం గన్నవరం విమానాశ్రయానికి చేరింది. బాపట్ల జిల్లా పిట్టలవాణిపాలెం గ్రామానికి చెందిన పరిశ మోహన వెంకటేశ్(26) గుజరాత్ ఆర్మీలో పని చేస్తున్నాడు. గన్ క్లీనింగ్ చేస్తుండగా మిస్ ఫైర్ అవడంతో మృతి చెందాడు. పార్థివదేహం గురువారం ఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో మధ్యాహ్నం 1.50కి తీసుకువచ్చారు. అక్కడ ఆర్మీ అధికారులు గార్డ్ ఆఫ్ హానర్ చేసి ఆర్మీ లాంఛనాలను పూర్తి చేసి పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు: ఏసీపీ

మొగల్రాజపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఏసీపీ దామోదర్‌రావు హెచ్చరించారు. మొగల్రాజపురం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక విభాగం ఆధ్వర్యంలో ర్యాగింగ్, డ్రగ్స్ వాడకం, సైబర్ క్రైం వంటి అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు గురైన వారు మానసికంగా కుంగిపోయి డిప్రెషన్‌లోకి వెళ్లి తరువాత వారు ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే అందుకు కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తోటి విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. మాచవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రకాష్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్‌లు, వాట్సప్‌లో మెసేజ్‌లకు స్పందించవద్దని చెప్పారు. ర్యాగింగ్ నిరోధక టీం హెడ్ డాక్టర్ జి.రమణను అభినందించారు. ఏసీపీ కె.దామోదర్‌రావును సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎ.సునీత అధ్యక్షత వహించగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్‌రావు

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి




పూడుకుపోయిన సైడ్‌కాల్వ

● 10వ డివిజన్ ఆర్‌ఆర్ గార్డెన్స్ ధనలక్ష్మి హైట్స్ ముందు చెత్తా చెదారం పేరుకుపోయి డ్రెయినేజీ పూర్తిగా మూసుకుపోయింది. మరో పక్క డ్రెయినేజీలో మురుగు పారుదల లేక నిలిచిపోయింది. దోమలతో, దుర్వాసనతో అల్లాడుతున్నాం.సమస్యను పరిష్కరించాలి. - శివప్రసాద్, స్థానికుడు

● త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తాం
-శివరామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పటమట, ఆంధ్రజ్యోతి



పారుదల లేక నిలిచిన మురుగు



బహుమతులు పొందిన విద్యార్థినులతో అతిథులు, కళాశాల అధ్యాపకులు

మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలి

● ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జి.వి పూర్ణచంద్

లబ్బీపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరూ మాతృభాషను పరిరక్షించటానికి కృషి చేయాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జి.వి పూర్ణచంద్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం కళాశాల తెలుగు విభాగం, తరుణీ తరంగాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రిన్స్‌పాల్ ఎస్. కల్పన మాట్లాడుతూ మాతృభాషలో చదవటం. రాయటం, మాట్లాడటం తప్పనిసరిగా అందరూ అలవాటు చేసుకోవాలని అన్నారు. వివిధ అంశాలపై జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వంలో మైనార్టీలకు పెద్దపీట

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతావుల్లా

వన్‌టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేస్తోందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా తెలిపారు. గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు మసీదు కమిటీ అకౌంట్లలో జమ చేయబోతున్నందుకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా బడ్జెట్‌లో మైనార్టీలకు రూ.4,376 కోట్లు కేటాయించారని కొనియాడారు. న్యాయశాఖ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మైనార్టీలకు ఏ సమస్యలు వచ్చినా తక్షణమే స్పందిస్తున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో మౌలానా అబ్దుల్ ఖలీద్, మౌలానా అబ్దుల్ సత్తార్ ఖాన్, మౌలానా ముకుబుల్, మౌలానా రహమ్‌తుల్లా, మౌలానా ఇక్బాల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుణదల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లుగా మాచవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గుణదల డెంటల్ కళాశాల రోడ్డులో డివైడర్‌పై పడుకుని ఉన్న ఓ వృద్ధుడు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికుల సమాచారం మేరకు మాచవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.

ఫ్రెండ్స్ సీసీ జట్టు విజయం

ఆరు వికెట్లు తీసిన బౌలర్ శివకుమార్



శివకుమార్, 6వికెట్లు ఫ్రెండ్స్ సీసీ జట్టు

విజయవాడ (స్పోర్ట్స్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకట రమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో గురువారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్ ఫ్రెండ్స్ సీసీ, ఎస్‌సి రైల్వే సీసీ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఫ్రెండ్స్ జట్టు 50ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 311భారీ స్కోర్ చేసింది.అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌సీ రైల్వే జట్టు 37.1ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 177పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. విజయం సాధించిన ఫ్రెండ్స్ సీసీ జట్టు బౌలర్ టి.శివ కుమార్ 6వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. షైనింగ్ స్టార్ సీసీ, న్యూ ఎవరెస్ట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో షైనింగ్ స్టార్ జట్టు 49.2ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 266పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూ ఎవరెస్ట్ జట్టు 42.1ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 270పరుగులు చేసి విజయం సాధించింది.

పత్రాలు లేని నాలుగు ఆటోలు సీజ్



ఆటో సీజ్ చేస్తున్న ఎస్ఐ ఆదినారాయణ

గుణదల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పత్రాలు లేకుండా నగరంలో సర్వీసు ఆటోలు నడుపుతున్న వారిని గుర్తించి నాలుగు ఆటోలు సీజ్ చేసినట్లు నాల్గవ ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ తెలిపారు. రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద ఆటోలను రోడ్డు పక్కన పెట్టించే పనిలో భాగంగా నాల్గవ ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ సిబ్బందితో గురువారం చేరుకుని వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ క్రమంలో నాలుగు సర్వీసు ఆటోలకు సదరు డ్రైవర్లు సరైన పత్రాలు చూపలేకపోయారు. దీంతో సదరు నాలుగు ఆటోలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇక మీదట రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద జాతీయ రహదారి మధ్యలో ఆటోలు నిలిపితే భారీ జరిమానా విధించనున్నట్లు అయన హెచ్చరించారు.



హెల్మెట్ లేకుండా ప్రయాణం.. పోలీసులను చూసి హెల్మెట్ పెట్టే ప్రయత్నం.. ద్విచక్రవాహనాన్ని పక్కన పెట్టాలంటూ పోలీసుల సూచన.. ఇప్పుడు హెల్మెట్ పెట్టి ఏం లాభమంటూ నిట్టూర్పు



పోలీసుల తనిఖీలను చూసి హెల్మెట్ పెట్టుకుంటున్న ద్విచక్రవాహనదారులు

అబ్బా.. ఏం తెలివి

నగరంలో పోలీసుల తనిఖీలు పెరుగుతున్నాయి. ఎక్కడికక్కడ వాహనాలను ఆపి హెల్మెట్ లేని వాహనాలకు చలానాలు విధిస్తున్నారు. దీంతో కొంతమంది వాహనదారులు అతి తెలివి చూపిస్తున్నారు. హెల్మెట్ బైక్ ట్యాంకర్‌పై ఉంచి ప్రయాణిస్తూ కొంతదూరంలో తనిఖీలు జరుగుతున్నాయని కనిపిస్తే వెంటనే ఆపేసి హెల్మెట్ పెట్టుకుని తనిఖీల ప్రదేశాన్ని దాటేశాక మళ్లీ హెల్మెట్ తీసేస్తున్నారు. మరికొందరు వెనక్కి తిరిగి ట్రాఫిక్‌కు ఎదురు వెళ్తుండటంతో మిగతా వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. వాహనదారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన నియమాలను గౌరవించకుండా, అతి తెలివితేటలతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



పోలీసుల తనిఖీలను చూసి హెల్మెట్ లేకపోవడంతో వెనుదిరుగుతున్న ద్విచక్రవాహనదారులు

ల్యాంకోలైన్‌కు లైసెన్స్ ఉందా?

● 25వ తేదీలోపు చెప్పండి.. లేకుంటే సెంట్రల్ పవర్ మినిస్ట్రీ సెక్రటరీని పిలుస్తాం ● ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు ధర్మాసనం



- ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ పవర్ లైన్స్ లైసెన్స్‌పై సంస్థల దోబూచులాట
- ల్యాంకో లైన్‌కు లైసెన్స్ లేకపోతే.. తొలగింపునకు ఆదేశాలిచ్చే అవకాశం?
- ఇదే జరిగితే లైన్ లాస్ పేరుతో చెల్లించిన రూ.14కోట్లు ఎవరి జేబుల్లోకి..?

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి వివాదాస్పదంగా మారిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్స్‌కు సంబంధించి లైసెన్స్ వివాదం తెరపైకి వచ్చింది. లైసెన్స్ లేకుండా లైన్లను నిర్వహిస్తున్నారని రైతులు కేసులు వేయడంతో హైకోర్టులో లోతైన విచారణ జరుగుతోంది. ల్యాంకో పవర్ లైన్స్‌కు సంబంధించి లైసెన్స్ లేని విషయాన్ని ఆ సంస్థ దాచి పెడుతోంది. హైకోర్టులో విచారణ సందర్భంగా ల్యాంకో పవర్ ప్రాజెక్టు నుంచి కానీ, ల్యాంకో లిక్విడేటర్ నుంచి కానీ, ఈ లైన్‌ను ఆక్షన్‌లో కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీ కానీ, లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీతో తాము ఒప్పందం కుదుర్చుకున్నామని చెబుతున్న రాధా సంస్థ కానీ ఎక్కడా హైకోర్టుకు లైసెన్స్ ఉన్నదీ, లేనిది చెప్పటం లేదు. దీంతో తాజాగా హైకోర్టు సీజే చాలా సీరియస్ అయ్యారు. మీరు కనుక మార్చి 25లోపు లైసెన్స్ విషయం తేల్చకపోతే కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ సెక్రటరీని వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీంతో ల్యాంకో ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్స్ లైసెన్స్ అంశం వివాదాస్పదంగా మారుతోంది. సెంట్రల్ పవర్ మినిస్ట్రీ సెక్రటరీ కనుక వర్చువల్‌గా హాజరై లైసెన్స్ లేదని చెబితే మాత్రం ల్యాంకో పవర్ లైన్‌నే తొలగించమని హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలిచ్చే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి వరకు ఈ లైన్‌ను అడ్డం పెట్టుకుని అలైన్‌మెంట్ మార్పు పేరుతో రైతులను నానా ఇబ్బందులు పెడుతున్న ఎన్‌హెచ్, రాధా, ల్యాంకో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు న్యాయస్థానంలో దోషులుగా నిలబడే అవకాశం ఉంటుంది.

దీంతో పాటు అన్యాయంగా ప్రభుత్వ సొమ్ము రూ.14 కోట్లను లైన్‌లాస్ పేరుతో రాధా సంస్థకు చెల్లించటం కూడా చాలా తీవ్రమైన అంశంగా మారటంతోపాటు ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో కూడా తేలనుంది.



కేంద్ర మంత్రి సతీష్‌చంద్ర దుబేతో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల, బూరగడ్డ

గనుల్లో రాష్ట్ర వాటా ఇచ్చేస్తాం

కేంద్ర గనుల మంత్రి సతీష్‌చంద్ర దుబే

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న రాష్ట్రానికి రావల్సిన వాటాను కేటాయిస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి సతీష్‌చంద్రదుబే అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని సత్య కన్వెన్షన్ సెంటర్‌లో ఎన్‌ఎల్‌సీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్ ప్రియాంక వివాహానికి కేంద్ర మంత్రి సతీష్ చంద్రదుబే గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ డిప్యూటీ స్పీకర్, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, పలువురు ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి దుబేతో మంత్రి కొల్లు రవీంద్ర గంటన్నరసేపు చర్చలు జరిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధులపై చర్చించారు. టీడీపీ స్థానిక నేత గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ ఇంట్లో చోరీ కేసులో

దొంగల కోసం రెండు బృందాల గాలింపు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విష్ణుప్రియనగర్‌లో డాక్యుమెంట్ రైటర్ ఇంట్లో చోరీకేసులో నిందితుల కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సైలు జి.రాజు, వెంకటేశ్వరరావు నేతృత్వంలో రెండు టీంలు విస్తృతంగా దర్యాప్తు చేపట్టాయి. గురువారం విజయవాడ డీసీపీ కె.వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అగంతకులు సీసీ కెమెరాలకు దొరక్కుండా ఎంవీఆర్‌ను, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లటంతో పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. కెమెరాల్లో కనపడకుండా కొన్నింటి దిక్కులు మార్చారు. నిందితులు ఉపయోగించిన స్క్రూ డ్రైవర్ లాంటి రాడ్, కటింగ్ బ్లేడ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం సభ్యులు అణువణువు పరిశీలించి ఆధారాలు సేకరించారు. దొంగలు ఉపయోగించిన వస్తువులు లభించే ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇంటి యజమాని డాక్యుమెంట్ రైటర్ రాక కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు. కుంభమేళకు వెళ్లిన యజమాని ప్రసాద్ వస్తే ఆయన ఇచ్చే సమాచారం ఆధారంగా దర్యాప్తునకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పోలీస్‌శాఖ ఒకవైపు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయించేందుకు కార్యాచరణ చేపట్టిన సమయంలో సీసీ కెమెరాల కళ్లకు దొరక్కుండా దొంగలు వేసిన ఎత్తును పోలీసులు ఎలా అధిగమిస్తారన్న ఆసక్తి వ్యక్తమవుతోంది.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

ఏడీసీఎల్‌కు బ్యూటిఫికేషన్ బాధ్యతలు

- ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 13 కిలోమీటర్లు
- అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ నుంచి ఏడీసీఎల్‌కు నిర్వహణ బాధ్యతలు
- రాజధాని పనులు ఊపందుకోనున్న నేపథ్యంలో కీలక పరిణామం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)పై వీవీపీ కారిడార్ బ్యూటిఫికేషన్ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)కు అప్పగించింది. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు 13 కిలోమీటర్ల నిడివిన బ్యూటిఫికేషన్ బాధ్యతలను ఇకపై ఏడీసీఎల్ పర్యవేక్షించనుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీవీపీ కారిడార్ బాధ్యతలను ఏడీసీఎల్‌కు అప్పగించగా తర్వాత సీఆర్‌డీఏకు బదలాయించింది. ఎన్‌హెచ్-16పై సెంట్రల్ డివైడర్, రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ డివైడర్స్‌పై ల్యాండ్‌స్కేపింగ్, బ్యూటిఫికేషన్ మెయింటెనెన్స్ పనులను సీఆర్‌డీఏ చేపట్టింది. తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఆర్‌డీఏకు నిధుల కేటాయింపు లేకపోవటంతో కొంతకాలం పర్యవేక్షణ లేకుండా పోయింది. ఆ తర్వాత విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)కు కొన్నాళ్లు, ఏపీ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్‌కు కొన్నాళ్లపాటు అప్పగించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీవీపీ కారిడార్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ నుంచి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)కు అప్పగించారు. ఇకపై ఈ బ్యూటిఫికేషన్ బాధ్యతలను ఏడీసీఎల్ నిర్వహించనుంది. అమరావతి రాజధాని ప్రాంతంలో చాలా పెద్ద ఎత్తున బ్యూటిఫికేషన్ పనులను ఏడీసీఎల్ చేపట్టారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో అయితే రకరకాల పుష్పజాతులతో ఆహ్లాదకరంగా ఉండేలా మార్చేసింది. వచ్చే నెల నుంచి రాజధాని పనులు ఊపందుకోనున్న నేపథ్యంలో అమరావతికి దేశ విదేశాల నుంచి వచ్చే వారికి వీవీపీ కారిడార్‌లో చక్కటి ఆహ్లాదం కనిపించేలా ఏడీసీఎల్ బ్యూటిఫికేషన్ చేపట్టనుంది. ప్రస్తుతం ఉన్న ల్యాండ్ స్కేపింగ్‌తో పాటు అదనంగా మరింత అందంగా ద్విగుణీకృతంగా కనిపించేలా గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేయనుంది.



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో నిడమానూరు వద్ద బ్యూటిఫికేషన్



ప్రచార చిత్రాలను ఉద్యోగినులకు అందజేస్తున్న నిర్మలాకుమారి

మహిళా ఉద్యోగులు పోటీల్లో పాల్గొనండి

● ఏపీ ఎన్జీవో మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మలాకుమారి

కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు నిర్వహించనున్న ఆటలపోటీలు, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మలా కుమారి పిలుపునిచ్చారు.మార్చి 4,5న ఇందిరాగాంధీ స్టేడియం, ఏపీ ఎన్జీవో హోం నందు నిర్వహించే మహిళల ఆటల పోటీలతో పాటు వివిధ పోటీలపై గురువారం ఆమె నగరంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించి ప్రచారం నిర్వహించారు. రవాణా శాఖ ఉద్యోగులు వి.ఉమామహేశ్వరి, రాజ్యలక్ష్మి, మాధవి, కె.శివలీల, విజయశ్రీ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అన్ని 'బార్'ల ఊన్నికలు మార్చి 27నే

● ఆదేశాలు జారీ చేసిన బార్ కౌన్సిల్ సెక్రటరీ

లీగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల ఎన్నికలు మార్చి 27నే నిర్వహించుకోవాలని రాష్ట్ర బా ర్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3న నోటీస్ బోర్డులో ఓటర్ల లిస్ట్ డిస్‌ప్లే, మార్చి 6న ఎన్నికల నోటిఫికేషన్, మార్చి 10న ఎలక్షన్ ఆఫీసర్ నియామకం, మార్చి 17న నామినేషన్‌ల దాఖలు, మార్చి 19న నామినేషన్ల పరిశీలన, మార్చి 20న నామినేషన్ల ఉపసంహరణ, మార్చి 21న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, మార్చి 27న ఎన్నికలు నిర్వహించాలని కౌన్సిల్ సెక్రటరీ ఆ ప్రకటనలో తెలిపారు. పో లింగ్ ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నా రు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లలో తేదీ ఖరారైనట్టే.

బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి: ఎంపీ కేశినేని శివనాథ్

జి.కొండూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎ.కొండూరు పెద్ద తండా అంగన్వాడీ కేంద్రంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అధికారులను ఆదేశించారు. ఢిల్లీలో ఉన్న ఆయన విషయం తెలుసుకున్న వెంటనే డీఎమ్‌అండ్‌హెచ్‌వో సుహాసినికి, మైలవరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ జయప్రకాష్‌కు కాల్ చేసి చిన్నారుల అస్వస్థతకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తన కార్యాలయ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వండి

మంత్రి లోకేశ్‌కు స్టెల్లా యాజమాన్యం విజ్ఞప్తి

పటమట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 6 దశాబ్దాలుగా కృష్ణాజిల్లాలో వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను బోధిస్తూ మంచి పేరు పొందిన సెల్టా కళాశాల విద్యార్థులకు గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్కాలర్‌షిప్స్ నిలిపివేశారని, సెల్టా యాజమాన్యం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో సెల్టా కళాశాల యాజమాన్యం మంత్రి లోకేశ్‌ను కలిసి వారి సమస్యలను వివరించారు. కళాశాలలో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని (గ్రాంట్)ను నిలిపేశారని వివరించారు. కళాశాలపై తీవ్ర ఆర్థిక భారం పడటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో వచ్చిన ఆర్థిక సాయాన్ని కొనసాగించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జసింతా క్వాడ్రస్ పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సమస్య వివరిస్తున్న సెల్టా కళాశాల యజమాన్యం

మా ఊరికి రోడ్లు వేశారోచ్

● కూటమి ప్రభుత్వం వచ్చాక నంగేగడ్డలో మూడు సీసీ రోడ్ల నిర్మాణం ● గ్రామస్థుల హర్షాతిరేకాలు

నాగాయలంక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మారుమూల గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. వసతులు కూడా ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంతో పూర్తవుతున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని రహదారులు నేడు సిమెంట్ రోడ్లుగా దర్శనమివ్వటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నంగేగడ్డ మైనరు పంచాయతీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్వాన్నంగా ఉన్న మూడు సీసీ రహదారులను మంజూరు చేసి సుమారు రూ.23 లక్షలను ఉపాధి నిధులను కేటాయించారు. సనకా బసవయ్య ఇంటి నుంచి 1వ నెంబరు పంట కాలువ వరకు 85 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, 1వ నెంబర్ కాలువ నుంచి శ్మశానం వరకు 150 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, చల్లా వెంకటేశు నుంచి తోట కృష్ణ ఇంటి వరకు 130 మీటర్ల పొడవున సీసీ రహదారి నిర్మాణానికి రూ.8 లక్షలను కేటాయించారు.



నాడు సనకా బసవయ్య ఇంటి వద్ద బురద రహదారి,
నేడు అదే ఇంటి నుంచి పంట కాలువ వరకు పూర్తయిన సీసీ రోడ్డు

జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలు 22, 23న

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సంస్థ సంస్కార భారతి విజయవాడ మహానగర్ శాఖ, సుమధుర కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలు ఫిబ్రవరి 22, 23న నిర్వహిస్తున్నట్టు సంస్కార భారతి అధ్యక్షుడు డాక్టర్ వీవీఎన్ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ప్రవేశరుసుము లేకుండా పూర్తి సేవాభావంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కూచిపూడి, ఆంధ్ర నాట్యం, భరత నాట్యం మూడు విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ప్రతి నాట్యంలోను వ్యక్తిగత విభాగంలో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. బృంద విభాగంలో శాస్త్రీయ నృత్య విభాగం (క్లాసికల్ గ్రూప్ డాన్స్), జానపద నృత్య విభాగం (ఫోక్ గ్రూప్ డాన్స్) అనే రెండు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. వ్యక్తిగత విభాగంలో 314 మంది కళాకారులు, బృంద విభాగం నుంచి 40 బృందాలు (240 మంది కళాకారులు) అన్ని విభాగాల నుంచి 564 మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోనున్నారన్నారు. లబ్ధప్రతిష్టులైన అనేకమంది గురువులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. 22న శనివారం కేబీఎన్ కళాశాలలో మూడు వేదికలు, హనుమంతరాయ గ్రంథాలయం, గాంధీనగర్, శ్రీ ధర్మ పరిషత్ అయోధ్యనగర్, సీతారామ కల్యాణ మండపం సత్యనారాయణపురం మొత్తం ఆరు వేదికలపై ఈ పోటీలు జరుగుతాయన్నారు. 23న ఆదివారం శ్రీ ఘంటసాల సంగీత నృత్య కళాశాలలో గోకరాజు లైలా గంగరాజు కళావేదికపై బృంద నృత్యాలు పోటీ, 6.45 నిమిషాలకు బహుమతి ప్రదానోత్సవ సభ జరుగుతుందన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, సృజనాత్మకత, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పి.తేజస్వి, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్‌పీ భారతి, చలువాది మల్లికార్జునరావు, సీబీఆర్ ప్రసాద్, ఎంసీ దాస్, కేబీఎన్ కళాశాల సెక్రటరీ టి.శ్రీనివాస్ హాజరవుతారని కృష్ణ తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలపై పోరాటం చేయాలి

● కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ అధ్యక్షుడు భార్గవ్

విజయవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌తోపాటు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాడాలని కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లూరు భార్గవ్ డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో మీడియాతో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆధారాలు, విధానాలతో ప్రభుత్వ పథకాల రూపకల్పన జరగాలన్నారు. టీడీపీ, జనసేన, వైసీపీ బహిరంగంగా బీజేపీకి మద్దతిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ట్రిబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందని ఎద్దేవా చేశారు. కేంద్రం బిహార్‌కు ఎక్కువ నిధులిస్తోందని, రాష్ట్రానికి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. త్వరలో జరగయే అసెంబ్లీ సమావేశాల్లో సూపర్‌సిక్స్ పథకాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నరహరశెట్టి నరసింహరావు, గురునాథం పాల్గొన్నారు.

విశేషం

శరణాగతితో అభయం

శివుడి గురించి మనకు ఎన్నో కథలు ఉన్నాయి. ఎన్నో విశ్వాసాలు ఉన్నాయి. ఆయన ఒక వ్యక్తి అనీ లేదా ఒక యోగి అనీ, ఈ భూమండలం మీద వేల ఏళ్ళ క్రితం ఆయన తిరిగాడనీ కొందరు నమ్ముతూ ఉంటారు. కానీ అది నిజం కాదు. శివుడికి కాల పరిమితులేవీ లేవు. ఆయనను 'మహాకాలుడు' అని పిలుస్తారు... అంటే ఆయనే కాల స్వరూపుడు, కాలాలకు అతీతుడు. ఇక కైలాసం అనేది ఆయన నివసించే పర్వతం కాదు. ఎక్కడైతే కేవలం ఉత్సవం మాత్రమే ఉంటుందో, ఎక్కడైతే ఆనందం మాత్రమే ఉంటుందో ఆ ప్రదేశమే కైలాసం. మీలో శివతత్త్వం నెలకొన్నప్పుడు.. మీ జీవితంలో కేవలం ఉత్సవం మాత్రమే ఉంటుంది. ఎక్కడైతే ఉత్సవం మాత్రమే ఉంటుందో... అక్కడ శివుడు కొలువుంటాడు.

అన్నీ ఆయనే...

శక్తిని మనం సృష్టించలేమనీ, నాశనం చేయలేమనీ, దాన్ని కేవలం ఒక రూపంలోంచి మరో రూపంలోకి మార్చగలమనీ శాస్త్రవేత్త అయిన అల్బర్ట్ ఐన్‌స్టీన్ సూత్రీకరించాడు. ఒక రూపం నుంచి మరో రూపానికి మారే ఆ శక్తే శివుడు. అది నిత్యం... అంటే ఎల్లప్పుడూ ఉంటుంది. ఈ సృష్టిలో శివుడు కానిది ఏదీ లేదు. ఆయన ఒక రూపంలో ఉండడు, ఏదో ఒక చోట కూర్చొని ఉండడు. ఆయన మొత్తం విశ్వమంతటా ఉన్నాడు. విశ్వంలోని ప్రతి అణువులోనూ ఆయన ఉన్నాడు. 'శివ' అనేది ఒక సూత్రం, ఒక తత్త్వం. ప్రతిదీ అక్కడినుంచే వస్తుంది, ప్రతిదీ అక్కడే స్థితిని పొందుతుంది, ప్రతిదీ అక్కడే నాశనం అవుతుంది. కాబట్టి మనం శివుడికి దూరం కావడం అనేది జరగని పని.



ఆ స్వరూపం పంచభూతాత్మకం

శివరాత్రి సాధకులకు నూతన సంవత్సరం లాంటిది. అధ్యాత్మికమైన ఎదుగుదలకు, లౌకికమైన సాఫల్యానికి శుభప్రదమైన రోజు. ఆనాటి రాత్రి నక్షత్ర మండలాలన్నీ ఒక నిర్దిష్టమైన స్థితిలో ఉంటాయి. కాబట్టి ఆ సమయంలో ధ్యానం చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు సిద్ధిస్తాయి. శివరాత్రి అంటే శివుడి రోజు. శివుడు ధ్యానానికి అధిపతి, జాగృతికి అధిపతి. శివుడు నిరాడంబరుడైన వేలుపు. ఆ నిరాడంబరతలోనే లోతైన సందేశం ఉంది. నటరాజ స్వరూపంలో ఉండే శివుడు ప్రకృతి, దైవత్వాల సంగమానికి చిహ్నం. నటరాజు చేతిలో అగ్ని ఉంటుంది. అది అగ్ని తత్త్వానికి ప్రతీక. ఆయన చేతులోని ఢమరుకం ఆకాశ తత్త్వానికి సంకేతం. ఆయన కేశాలు గాలిలో ఎగురుతూ ఉంటాయి. ఇది ఆకాశ తత్త్వాన్ని సూచిస్తుంది. నేల మీద ఉండే ఒక పాదం పృథ్వీ తత్త్వాన్ని, గాలిలో ఉండే మరో పాదం మళ్ళీ గాలినీ, జటాజూటం జలతత్త్వాన్ని సూచిస్తాయి. అదే పంచభూతాత్మకమైన శివ స్వరూపం. అభయ ముద్రలో ఉండే ఒక చెయ్యి రక్షణకు భరోసా ఇస్తుంది. నెలవైపు ఉండే మరో చెయ్యి శరణాగతి పొందాలని చెబుతుంది. మహా శివుడికి మనం శరణాగతులమైతే... మన రక్షణకు ఆయన అభయం ఇస్తాడు. పరమశివుడి నృత్యం లోకం మొత్తం కోరుకొనే ఆనందాన్ని సూచిస్తుంది. ఆయన ఉనికిని మనం అనుభూతి చెందితే పరమానందం మన సొంతం అవుతుంది. అందుకోసం మనల్ని మనం ఆయనకు సమర్పించుకోవాలి. అటువంటి సమర్పణకు, శరణాగతికి శివరాత్రి అత్యంత అనుకూలమైన రోజు.

• శ్రీశ్రీ రవిశంకర్

పర్వదినం



ప్రేమతత్త్వమే పరమేశ్వరుడు



శివుడు నిరాకారుడు, అలాగే సాకారుడు కూడా. నికారారుడని చెప్పడానికి లింగం ప్రతీక. అద్భుతమైన శివ తత్త్వాన్ని నిరాకారంగా ఉపాసన చేస్తే... అది లింగోపాసన. సాకారమైన దివ్యమంగళ విగ్రహోపాసనలో చంద్రశేఖరుడిగా, నాగాభరణ భూషితుడిగా, త్రినేత్రుడిగా, నీలకంఠునిగా... ఇలా అనేక రూపాలలో గోచరిస్తాడు. ఇవన్నీ శివచైతన్యాన్ని వ్యక్తం చేస్తాయి. జ్ఞానం, వైరాగ్యం, తపస్సు, అంతర్ముఖత్వం, కరుణ, త్యాగశీలత... ఇవన్నీ సగుణ రూపమైనా, నిర్గుణరూపమైన శివమూర్తిలో ఉండే లక్షణాలు. "ఆయన పరమ దయాళువు" అని సిస్టర్ నివేదిత వర్ణిస్తే... "శివుణ్ణి ఆరాధించడం అంటే శాంతాన్ని, సమత్వాన్ని, యోగాన్ని, నిరాడంబరతని ఆదర్శంగా భావించడమే. శాశ్వతమైన భారతీయ హృదయానికి సాకారమే శివుడు" అన్నారు స్వామి వివేకానంద. అటువంటి విశ్వగురువైన విశ్వనాథుణ్ణి ఆరాధించడానికి అనువైన రోజు... మహా శివరాత్రి. ఈ పర్వదినం గురించి ప్రసిద్ధమైన రెండు కథలు పురాణాల్లో ప్రాచుర్యం పొందాయి. ఒకప్పుడు ప్రళయకాలం ఆసన్నమవుతున్న తరుణంలో... పరాశక్తి అయిన సమస్త సృష్టి బీజాలను పోగు చేసింది, వాటిని తన ఒడిలో భద్రపరచి, పంచాక్షరీ జపం చేస్తూ... ధ్యాన నిమగ్నురాలయింది. పగలు, రాత్రీ అనేవి లేని ఆ స్థితిలో... ధ్యాన సమాధిలో ఉన్న పరమశివుడు కొంతకాలానికి కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఉన్న కాత్యాయినిని చూసి విషయం తెలుసుకున్నాడు. ఆమెను సమాధి స్థితి నుంచి మేలుకొలిపి, ఆమె పోగు చేసిన బీజాల నుంచి తిరిగి సృష్టిని ప్రారంభించాడు. ఆ రోజు మాఘ బహుళ చతుర్దశి. ఆమె కోరిక ప్రకారం ఆ రోజు 'మహా శివరాత్రి'గా ముల్లోకాలలో ప్రాచుర్యం పొందుతుందని వరమిచ్చాడు. మరో కథ ప్రకారం... బ్రహ్మ, విష్ణువుల మధ్య ఆధిపత్యం కోసం వివాదం ఏర్పడి, కలహానికి దారి తీసింది. వారిని ఉపశమింపజేసేందుకు... ఇద్దరి మధ్య అగ్నిలింగంగా శివుడు ఆవిర్భవించాడు. "పరాశక్తి ఆజ్ఞను అనుసరించి... సృష్టి, స్థితి, లయాలను నిర్వహించడానికి ఆమె ప్రతినిధులుగా మనం ఉన్నాం. మనం కర్తవ్యనిష్ఠులం మాత్రమే" అని సమాధాన పరిచాడు. లింగోద్భవమైన ఆ రాత్రి 'మహా శివరాత్రి'గా ప్రస్తుతి పొందింది.

విశ్వమే ఆయన శరీరం...

శివ స్వరూపాన్ని దర్శిస్తే ఎన్నో అద్భుతాలు గోచరిస్తాయి. జడలో జల తరంగాలు, జ్యోతిర్మండలమైన జటాజూటంలో చంద్రరేఖ, కంఠంలో గరళం... వీటన్నిటినీ గమనిస్తే విశ్వమే శివుని శరీరం అనిపిస్తుంది. ఆయన పంచభూతాత్మకుడు. పైగా చిన్న కుటుంబం. శివపత్ని అన్నపూర్ణమ్మ కన్నతల్లిలా మమకారాన్ని అందిస్తుంది. పెద్ద కుమారుడు గణపతి విఘ్నాలను రూపుమాపడమే కాకుండా, సంపదలను అనుగ్రహిస్తాడు. చిన్న కుమారుడు కుమారస్వామి విజయ కారకుడు. దాంపత్య జీవనానికి శివపార్వతులే ఆదర్శం.. ప్రేమ ధర్మానికి ప్రతీకలైన వారు ఏక శరీరులు, ఆ ముగ్గురి వాహనాలకు పరస్పర వైరం ఉన్నా... వారి సమక్షంలో పరమ మిత్రులుగా మెలుగుతాయి. ఇలా శివతత్త్వాన్ని పరిశీలిస్తే... ఎన్నో అద్భుతాలు కనిపిస్తాయి. 'ప్రేమయే శివుడు' అనేది శైవ సిద్ధాంతం. శివుడంటేనే ప్రేమ తత్త్వం. భక్తితో పిలిస్తే అక్కున చేర్చుకొనే ఆయన భోళా శంకరుడు. సమస్త సంపదలూ ఉన్నా, ఆయనలో నిరాడంబరత, వైరాగ్యం కనిపిస్తాయి. తనను నమ్మినవారికి అడిగినది ఇవ్వడమే తప్ప... ప్రతిఫలం ఆశించడు. క్షీరసాగర మథనంలో హాలాహలం బైటికి రాగానే దేవదానవులు 'శివా! శివా!' అని ప్రార్థిస్తూ అక్కడి నుంచి పారిపోయారు. పరమ దయాళువైన శివుడు వచ్చి, అభయం ఇచ్చి ఆదుకున్నాడు. ఆ తరువాత ఎన్నో సంపదలు ఆ మథనంలో నుంచి బయటకు వచ్చాయి. ఆయన ఆ సంపదల జోలికి పోలేదు.

లింగోద్భవ దర్శనం...

శ్రీరాముడి లాంటి పౌరాణిక దివ్య పురుషులే కాదు, సమస్త దేవతలు, ఋషులు... ఇలా అందరూ శివభక్తిపరాయణులే. ఆ స్వామి ఆరాధన అనాది సంప్రదాయంగా వస్తోంది. అందుకే మన దేశంలో మూలమూలలా శివాలయాలు కనిపిస్తాయి. సోమవారాలు, మాస శివరాత్రులు, మహాశివరాత్రి, కార్తికమాసంలో శివారాధనకు భక్తులు తండోపతండాలుగా ఆలయాలను సందర్శిస్తారు. అభిషేకాలు, బిల్వపత్ర పూజలు చేస్తారు. ఉపవాసాలు, జాగరణలు, వ్రతాలు చేస్తారు. శివరాత్రి నాటి లింగోద్భవ వేళకు ఎంతో ప్రత్యేకత ఉంది. పరిశీలించి చూస్తే విశ్వంలోని ప్రతి కదలిక శివచైతన్య విశేషమే. మనలోని సర్వ చైతన్యానికి మూలమైన పరంజ్యోతిని దర్శించే సందర్భం... లింగోద్భవ దర్శనం. దానితోపాటు అభిషేకం, ఉపవాసాలు, జాగరణలు, పంచాక్షరీ మంత్ర జపం.. ఇహ పర సౌఖ్యాలను అందిస్తాయనేది పెద్దల మాట

• ఆయపిళ్ళ రాజపాప

సద్బోధ

విలువ తేల్చేది కాలమే

చైనాలో క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో జీవించిన తత్త్వవేత్త చువాంగ్ ట్సూ. ఆయన గురించి ఆసక్తికరమైన కథలెన్నో ఉన్నాయి. ఆయన సామాన్యమైన జీవితం గడిపేవాడు. ప్రజలకు జ్ఞానాన్ని బోధిస్తూ, వారు ఇచ్చే భిక్ష మీద ఆధారపడి జీవించేవాడు. ఆనాటి చైనా చక్రవర్తి ఆయనకు మిత్రుడు, శిష్యుడు. తరచుగా చువాంగ్‌ను కలుసుకొనేవాడు. అప్పుడప్పుడు తన మందిరానికి ఆహ్వానించి, అనేక విషయాల గురించి చర్చిస్తూ ఉండేవాడు.

ఒకరోజు... చువాంగ్ భార్య మరణించినట్టు చక్రవర్తికి తెలిసింది. ఆయనను పరామర్శించడం కోసం ఆ సాయంత్రం బయలుదేరాడు. చువాంగ్‌ను ఓదార్చడానికి ఏ మాటలు చెప్పాలో, ఎలా చెప్పాలో ఆలోచిస్తూ... చువాంగ్ కుటీరానికి చేరుకున్నాడు. అక్కడ కనిపించిన దృశ్యం చక్రవర్తిని దిగ్భ్రాంతికి గురి చేసింది. చువాంగ్ ఒక చెట్టు కింద కూర్చొని, వాద్య పరికరం వాయిస్తూ, ఆనందంగా పాటపాడుతున్నాడు. చక్రవర్తి ఆయనను సమీపించి... "ఈ రోజు ఉదయమే మీ భార్య మరణించింది కదా? మీరేమో అప్పుడే ఆడుతూ, పాడుతూ ఆనందంగా ఉన్నారు. రోదించవలసిన సమయంలో మీరు ఇలా ఉంటే ఎలా?" అని అడిగాడు.

అప్పుడు చువాంగ్ "మహారాజా! నా భార్య



చనిపోవడం నిజమే. అయితే నేను ఎందుకు దుఃఖించాలి? ఎందుకు రోదించాలి? ఆమె శాశ్వతంగా బతికే ఉంటుందని నేను ఎప్పుడూ భావించలేదు. ఆమె ఎల్లప్పుడూ జీవించే ఉండాలని ఆశించనూ లేదు. ఏదో ఒక రోజు ఆమె మరణించవలసిందేగా? అది ఈ రోజే అయితేనేం? పైగా ఆమె నాతో పాటు ఎన్నో సంవత్సరాలు కలిసి జీవించింది. నాకు ఎన్నెన్నో సేవలు చేసింది. ఆమె మరణిస్తే నేను ఏడుస్తూ కూర్చోవాలా? లేదంటే ఆమె పట్ల నా కృతజ్ఞతా భావాన్ని తెలుపుతూ... పాటలు పాడుతూ ఆమెను ఆనందంగా సాగనంపాలా?" అని ప్రశ్నించాడు.


చువాంగ్ ట్సూకు ఒక వింత అలవాటు ఉండేది. ఎవరైనా, ఏదైనా చెప్పడానికి వస్తే... వారు ఆ విషయం పూర్తిగా చెప్పకముందే "మంచిది, చాలా మంచిది" అని అనేవాడు. ఆయన అలా అనడం కొన్ని సందర్భాల్లో ఎబ్బెట్టుగా అనిపించేది. ఒక రోజు ఒక వ్యక్తి ఆయన దగ్గరకు ఎంతో ఆత్రుతగా వచ్చి "మీ కుమారుడు చెట్టు మీద నుంచి పడి, రెండు కాళ్ళూ విరగ్గొట్టుకున్నాడు" అని చెప్పాడు. వెంటనే చువాంగ్ "మంచిది, చాలా మంచిది" అన్నాడు. "అది ఎలా?" అని అడిగాడు ఆ వ్యక్తి. "వేచి చూడండి" అన్నాడు చువాంగ్.

మరునాడు ఆ రాజ్యం పొరుగు రాజ్యంతో యుద్ధం చెయ్యాల్సిన పరిస్థితి తలెత్తింది. రాజ్యంలో యువకులందరూ సైన్యంలో చేరాలని ఆదేశాలు వచ్చాయి. చువాంగ్ కుమారుడికి కాళ్ళు విరిగిన కారణంగా యుద్ధం నుంచి మినహాయింపు లభించింది. ఎంతోమంది యుద్ధంలో మరణించినా... అతను బతికాడు. చువాంగ్ చెప్పినట్టు మంచే జరిగింది. ఓషో ఈ కథ చెబుతూ... "జ్ఞానుల మాటలు, చేతలు ఒక పట్టాన మనకు అర్థం కావు. కాలమే వాటి విలువను తేల్చి చెబుతుంది" అంటారు.

రాచమడుగు శ్రీనివాసులు

గీతాసారం

పాపం అంటే ఏమిటి?



అనాది కాలం నుంచి వేరువేరు నాగరికతలు, సంస్కృతులు విభిన్న కర్మలకు నిర్వచనాలు ఇచ్చాయి. కొన్నిటిని పాపాలుగా పేర్కొన్నాయి. ఈ జాబితా కాలక్రమేణా మారుతూ వచ్చింది. ఆధునిక యుగంలో దేశాలు తమవైన శిక్షాస్మృతిని కలిగి ఉంటాయి. ఇవి కొన్ని చర్యలను నేరాలుగా లేదా పాపాలుగా నిర్వచిస్తాయి. ఆ పనులకు పాల్పడినవారిని శిక్షిస్తాయి. అటువంటి నిషేధితమైన కర్మలను మనం చేసినప్పుడు అపరాధభావం, పశ్చాత్తాపం, అవమానభారంతో మనల్ని మనం శిక్షించుకుంటూ ఉంటాం. 'వికర్మ' లేదా 'నిషిద్ధ కర్మ', 'పాపం' అంటే ఏమిటి? అనే ప్రశ్న చాలా జటిలమైనది. అర్జునుడు కూడా ఈ సందిగ్ధంలో పడ్డాడు. యుద్ధంలో తన బంధువులను చంపడం ద్వారా 'పాపం% మాత్రమే కలుగుతుందని భావించాడు.

ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు "అంతఃకరణను, శరీర ఇంద్రియాలను జయించినవాడు, సమస్త భోగ సామగ్రిని పరిత్యజించినవాడు, ఆశారహితుడు అయిన యోగి కేవలం శరీర కర్మలను మాత్రమే ఆచరిస్తూ ఉంటాడు. అతనికి పాపాలు అంటవు" అని చెప్పాడు. "జయాపజయాలను, లాభనష్టాలను, సుఖదుఃఖాలను సమానంగా భావించి, యుద్ధానికి సిద్ధపడు. అప్పుడు నీకు పాపాలు అంటనే అంటవు" అని అంతకు ముందు స్పష్టం చేశాడు. 'ఏది పాపం?' అనే ఆలోచన చేసేటప్పుడు అర్థం చేసుకోవలసిన సూక్ష్మమైన విషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే... భౌతిక ప్రపంచంలో మనం చేసే కర్మల ఆధారంగా మనం దాన్ని అంచనా వేస్తాం. కానీ శ్రీకృష్ణుడి దృష్టిలో ఇది 'అంతర్గతమైన' విషయం. మనం ఏది చెబుతున్నాం, ఏది చేస్తున్నాం అనేది మన మానసిక స్థితి తాలూకు పరిణామం. అందుకనే మానసిక స్థాయిలో అవగాహన పొందడం అవసరమని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. ఇలాంటి ఆలోచనలు తాత్త్విక స్థాయిలో మనలో అనేక సందేహాలను లేవనెత్తుతుంది, కానీ అనుభవ స్థాయిలో మనకు స్పష్టత వస్తుంది. "ఏదైనా దొరికినప్పుడు... దాన్ని కోరుకోకపోయినా సరే, దానితో సంతుష్టి పడి, ద్వంద్వాతీతంగా ఉంటూ, అసూయ నుంచి విముక్తి పొంది, అన్నిటిపట్లా సమాన దృష్టి కలిగిన వ్యక్తి... కర్మలను చేసినా వాటి బంధాల్లో చిక్కుకోడు" అని శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. వాస్తవానికి ఈ వివరణను వివిధ సందర్భాల్లో ఎన్నో బోధనలు కలిగి ఉన్న భగవద్గీతకు సూక్ష్మరూపం అని చెప్పవచ్చు. ద్వంద్వాతీత స్థితిని పొందాలని, ప్రతిదాన్నీ విభజించే తత్త్వం ఉన్న మనస్సును కేవలం శరీర పోషణకు అవసరమైన ఆలోచనా చర్యలకు మాత్రమే ఉపయోగించాలని శ్రీకృష్ణుడు చెప్పాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సహజయోగ

దేవుడు నీలోనే ఉన్నాడు

"కులాలు, మతాలు అనేవి కేవలం మానవుల సృష్టే. భగవంతుడికి వాటితో ఎలాంటి సంబంధం లేదు. ప్రతి ఒక్కరిలో ఈ అవగాహన కల్పించి, సరైన పరివర్తన తీసుకురాగలిగితే... నవ సమాజం, వసుధైక కుటుంబం, సర్వమానవ సౌభ్రాతృత్వం, ద్వేషరహితమైన, ప్రేమపూరితమైన ప్రపంచం ఏర్పడతాయి" అని ప్రకటించడమే కాదు, అది సాధ్యమేనని సహజయోగ ధ్యాన పద్ధతిద్వారా నిరూపించారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. మిమ్మల్ని సృష్టించిన శక్తితో మీరు అనుసంధానం కానంతవరకూ... మీ జీవిత పరమార్థం ఏమిటనేది తెలుసుకోలేరని ఆమె స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక గురువుగా... తను నమ్మిన సత్యాన్ని, ధర్మాన్ని ఆమె స్వయంగా ఆచరించి చూపారు.

అదే శివుడి ఇచ్ఛాశక్తి...

తన స్వీయ తపోశక్తితో 1970 మే 5న సహజ యోగను శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించారు. తనలో నిద్రాణమైన స్థితిలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసి, బాహ్యపరంగా ఉన్న పరమాత్మ ప్రేమైక శక్తి అయిన పరమ చైతన్యంతో దాన్ని అనుసంధానం చేయడం ద్వారా.. ఆత్మ సాక్షాత్కార అనుభూతిని సాధించారు. దీనితో ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమయింది. 'సహ' అంటే 'మనతో', 'జ' అంటే 'జన్మించిన శక్తి'... 'యోగ' అంటే 'బాహ్యపరంగా ఉన్న శక్తితో కలవడం' అని అర్థం. ఈ విధంగా మనలోని కుండలినీ శక్తి విశ్వవ్యాపితమైన భగవత్ శక్తితో ఏకీకరణ పొందినప్పుడు... మనం కూడా ఆ దివ్య శక్తిలో ఒక కణంగా, భాగంగా మారిపోతాం. పరమ చైతన్యం లేదా బ్రహ్మ చైతన్యం అంటే విశ్వవ్యాపితమైన పరమాత్మ ప్రేమ శక్తి. విశ్వాన్ని, సకల చరాచర జీవులను నడిపించే ఆ భగవత్ శక్తి మానవుల మేధస్సుకు అతీతమైనది. సదాశివుని అర్ధాంగి అయిన ఆది శక్తి.. ఆయన చుట్టూ ఒక చల్లని మేఘంలా ఆవరించి ఉంటుంది. అదే బ్రహ్మ చైతన్యం. పరమ చైతన్య శక్తిగా పిలిచే ఆ శక్తే... పరమాత్మ అయిన శివుడి ఇచ్ఛాశక్తి. ఆ శక్తే విశ్వాన్ని సృష్టించింది. భూమి మీద ఉన్న జీవజాలం మీద తన పరమ చైతన్య శక్తిని వెదజల్లుతోంది. మనల్ని అంతర్గతంగా బలోపేతం చేస్తోంది. మనలో ప్రేమ శక్తిగా అంకురిస్తోంది. అందుకే ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది, సహజయోగ సాధన చేస్తున్నవారందరూ ఆ భగవంతుడి ప్రేమ శక్తిని తమ చుట్టూ ఉన్నవారికి పంచడానికి కృషి చేస్తారు. ఈ సాధన చేస్తున్నవారిలో సహస్రార చక్రం పూర్తిగా వికసిస్తుంది. అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో ఉన్న ఏడు చక్రాలు తెరుచుకుంటాయి. బ్రహ్మచైతన్యంలో అంతర్భాగాలైన అధిష్ఠాన దేవతలు మేలుకొని, వారికి ఆశీస్సులు అందజేస్తారు. కుల, సహజయోగను మత, జాతి, ప్రాంత, వయసు, లింగ భేదాలకు అతీతంగా ఎవరైనా, ఎప్పుడైనా అతి సునాయాసంగా ఆచరించవచ్చు. ఇది దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొనే శారీరక, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలన్నిటికీ చక్కటి పరిష్కారం.

అందరూ ఒక్కటే...

"నిన్ను నువ్వు తెలుసుకో.. అనేది అని మతాలలోని మూల సారాంశం. భగవంతుడు ఎక్కడో కాదు, నీలోనే ఆత్మగా ఉన్నాడు. ఇది సత్యం. ఈ సత్యాన్వేషణ... సహజయోగంలోని ఆత్మ సాక్షాత్కారంతో ముగుస్తుంది" అని ఆమె చెపారు. ప్రపంచవ్యాప్తంగా





ఉన్న సహజయోగులందరూ అందరూ అన్ని మతాల దైవాలను, ప్రవక్తలను... 'అందరూ ఒక్కటే' అనే భావనతో ఆరాధిస్తారు. కులమతాలకు అతీతంగా జరిపిన సహజయోగ వివాహాల ద్వారా వసుధైక కుటుంబానికి అసలైన నిర్వచనాన్ని శ్రీ మాతాజీ నిర్మలాదేవి ఆచరణాత్మకంగా చూపించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో, అమెరికా, ఇటలీ, కెనడాల్లో సహజయోగ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్స్ స్థాపించి... అన్ని వర్గాల విద్యార్థులకు క్రమ శిక్షణతో, పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో విద్యను అందేలా దోహదం చేశారు. మన దేశమంతటా పర్యటించి... విద్యార్థులకు, ఉద్యోగులకు, గృహిణులకు వారి సమస్యలకు పరిష్కారంగా సహజయోగను ఉచితంగా బోధించారు. ఈ కార్యక్రమం ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది. అలాగే సహజయోగ ద్వారా పొందే ప్రకంపనల సహాయంతో... సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడిని, ఆరోగ్యమైన పంటలను పండించే విధానాన్ని రైతులకు సహజయోగులు ఉచితంగా బోధిస్తున్నారు. భగవంతుని శక్తితో తమను అనుసంధానపరచుకొని... ధ్యానం ద్వారా తమను సమతుల్యతతో ఎలా ఉంచుకోవాలో, సమస్యలను స్వయంగా ఎలా పరిష్కరించుకోవడం, మత్తు పదార్థాల వ్యసనాలను వదులుకోవడం లాంటివి సహజయోగులు తెలుసుకొంటున్నారు. తమ జీవితాలను ఆనందంగా మలచుకొంటున్నారు.

సత్యావిష్కరణ...

మానవులు ఎన్నో ఏళ్ళ నుంచి, ఎన్నో జన్మల నుంచి అన్వేషిస్తున్న సత్యాన్ని... సహజయోగ ధ్యానం ద్వారా శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించారు. ఎలాంటి స్వార్థ చింతనా లేకుండా మానవాళికి అందించారు. ఎవరి దగ్గర నుంచి ఎలాంటి రుసుము తీసుకోకుండా, ప్రతిఫలాపేక్ష లేకుండా.. తన సొంత డబ్బుతో వివిధ దేశాలు పర్యటించారు. సహజయోగాన్ని ప్రపంచ వ్యాప్తం చేశారు. ఈ విధంగా తన జన్మను సార్థకం చేసుకున్న ఆమె.. 2011 ఫిబ్రవరి 23న తన సాకార రూపాన్ని చాలించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని... ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీని 'బ్రహ్మ చైతన్య దినోత్సవం'గా... ప్రపంచంలోని అన్ని సహజయోగ కేంద్రాలలో నిర్వహిస్తారు.

(23న బ్రహ్మ చైతన్య దినోత్సవం)

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ




సుభాషితం

వారికి మౌనమే అలంకారం


స్వవశము హితము మూఢతా చ్ఛాదనంబు
గాగ నీగతి నిర్మించె గమలభవుడు
సర్వ విదులగు సుజనుల సభలలోన
మౌనమె విభూషణము మూఢ మానవులకు...

భర్తృహరి 'నీతి శతకం'లోని 'స్వాయత్తమేకాంత హితం విధాత్ర...' అనే శ్లోకాన్ని అనుసరిస్తూ ఏనుగు లక్ష్మణకవి రచించిన పద్య రూపం ఇది.

భావం: ఆ బ్రహ్మదేవుడు 'మౌనం' అనే గొప్ప వరాన్ని మూర్ఖులకు అందజేశాడు.. అన్నీ తెలిసిన గొప్పవారు, పండితులు ఉన్న సభలలో... మూర్ఖులకు మౌనమే గొప్ప అలంకారం. వారు అనవసరమైన విషయాలను, తమకు ఏమాత్రం అవగాహనలేని విషయాలను మాట్లాడి నవ్వులపాలు కాకుండా, సభలను రసాభాస చేయకుండా ఆ మౌనమే వారిని రక్షిస్తుంది.



వ్యాసపీఠం



సాయి సచ్చరిత్ర

20వ శతాబ్దంలో మన దేశంలో అనేక మందిని ప్రభావితం చేసిన ఆధ్యాత్మిక గురువులలో షిరిడీ సాయిబాబా ఒకరు. హిందు, ముస్లిం అనే భేదం లేకుండా అందరినీ తన అక్కున చేర్చుకున్న అవధూత సాయిబాబా. మసీదులో తులసి మొక్కను నాటి.. 'అల్లాహ్ హో మాలిక్' అంటూ ప్రతి రోజూ వీధి వీధిలో తిరిగి.. హిందువుల గోపాలకోత్సవాన్ని, మహ్మదీయుల చందనోత్సవాలను ఒకే రీతిలో జరిపించిన సాయిబాబా అందరినీ సమానంగా చూసేవారు. అందుకే ఆయన జీవితంలో జరిగిన అనేక సంఘటనలను పారాయణంగా ప్రతి రోజు కొన్ని లక్షల మంది చదువుతూ ఉంటారు. వీరి కోసం ప్రవచనకారుడు డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు రాసిన పుస్తకం 'సాయి సచ్చరిత్ర'. సాయిబాబా జీవితంలోని అనేక విశేషమైన సంఘటనలను అతి సులభమైన భాషలో అందించే పుస్తకమిది. కేవలం సంఘటనలు మాత్రమే కాకుండా- వాటి వెనక ఉన్న తత్త్వాన్ని కూడా రచయిత వివరిస్తారు. సాయిబాబా జీవితంపై ఆసక్తి ఉన్నవారందరూ చదవాల్సిన పుస్తకమిది.

రచయిత: డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
ప్రతులకు: 9866700425

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై x బెంగళూరు
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గిల్ శతక జిగేల్

షమికి ఐదు వికెట్లు ▫ పోరాడిన బంగ్లాదేశ్ ▫ తౌహీద్ శతకం వృథా

భారత్ బోణీ

దుబాయ్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీని భారత్ విజయంతో ఆరంభించింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (101 నాటౌట్) అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ వరుసగా రెండో శతకంతో అజేయంగా నిలిచాడు. అయితే టోర్నీలో బలహీనంగా కనిపిస్తున్న బంగ్లాదేశ్ సైతం గట్టి పోటీనే ఇచ్చింది. బ్యాటింగ్‌లో అసమాన పోరాటంతో పాటు బౌలింగ్‌లోనూ ప్రభావం చూపి భారత మిడిలార్డర్‌ను కట్టడి చేసింది. కానీ గిల్‌కు జతగా కెప్టెన్ రోహిత్ (41), రాహుల్ (41 నాటౌట్) సహకారం అందించడంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. గిల్ తన చివరి నాలుగు వన్డేల్లో రెండు ఫిఫ్టీలు, రెండు సెంచరీలు సాధించడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. తౌహీద్ హ్రిదయ్ (100) కీలక శతకంతో ఆదుకున్నాడు. అతడికి జాకెర్ అలీ (68) సహకరించాడు. షమికి ఐదు, హర్షిత్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో 4 వికెట్లకు 231 పరుగులు చేసి గెలిచింది. రిషాద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.

తుదికంటా నిలిచి...: ఛేదనలో పిచ్ నెమ్మదించినా.. తొలి పవర్‌ప్లేలో భారత్ ఇన్నింగ్స్ మాత్రం వేగంగానే సాగింది. కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడు కొనసాగించగా, మరో ఓపెనర్ గిల్ అదిరే ఆటతో తుదికంటా నిలిచాడు. తొలి వికెట్‌కు 59 బంతుల్లోనే 69 పరుగులు జత చేరాక రోహిత్‌ను పేసర్ టస్కిన్ అవుట్ చేశాడు. తర్వాత గిల్, విరాట్ (22) ఇద్దరూ ఆచితూచి ఆడారు. విరాట్‌ను లెగ్ స్పిన్నర్ రిషాద్ అవుట్ చేశాడు. కాసేపటికే గిల్ వరుసగా నాలుగో అర్ధసెంచరీ పూర్తి చేయగా.. మరోవైపు శ్రేయాస్ (15), అక్షర్ (8) పెవిలియన్ చేరారు. 37వ ఓవర్‌లో రాహుల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను జాకెర్ వదిలేశాడు. ఇక ఆ తర్వాత తను చక్కటి షాట్లతో గిల్‌కు అండగా నిలిచాడు. 45వ ఓవర్‌లో 6,4తో జోరు పెంచిన గిల్ వన్డేల్లో శతకం పూర్తి చేశాడు. అటు విజయానికి ఏడు పరుగులే ఉండడంతో రాహుల్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఇద్దరి మధ్య నాలుగో వికెట్‌కు అజేయంగా 87 పరుగులు జత చేరాయి.

35/5 స్కోరు నుంచి 200+: పది ఓవర్లు కూడా పూర్తికాకుండానే సగం జట్టు పెవిలియన్‌కు చేరిన వేళ బంగ్లా బ్యాటర్లు తౌహీద్, జాకెర్ మొక్కవోని పట్టుదలతో క్రీజులో అతుక్కుపోయారు. ఆరో వికెట్‌కు తమ వన్డే చరిత్రలోనే 154 పరుగుల అత్యధిక భాగస్వామ్యాన్ని సమకూర్చారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా తొలి ఓవర్‌లోనే ఓపెనర్ సౌమ్య వికెట్ కోల్పోయింది. అతడిని షమి అవుట్ చేయగా, ఆ వెంటనే కెప్టెన్ షంటో (0) హర్షిత్‌కు చిక్కాడు. అప్పటికి స్కోరు 2/2. మెహిదీ హసన్ (5) కూడా విఫలం కాగా.. తొమ్మిదో ఓవర్‌లో జట్టుకు భారీ ఝలక్ తగిలింది. మరో ఓపెనర్ తన్‌జీద్ (25), ముష్ఫికర్ (0)లను వరుస బంతుల్లో అక్షర్ దెబ్బతీశాడు. ఈ దశలో స్కోరు 35/5 మాత్రమే. కానీ తీవ్ర ఒత్తిడిలో బ్యాటింగ్‌కు దిగిన తౌహీద్, జాకెర్ నిలకడైన ఆటతో బంగ్లా కోలుకుంది. అటు భారత ఫీల్డింగ్ వైఫల్యం కూడా ఈ జోడీకి కలిసివచ్చింది. తౌహీద్ ఓ క్యాచ్, స్టంప్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. చివరకు 206 బంతులను ఎదుర్కొన్న ఈ జోడీని 43వ ఓవర్‌లో షమి విడదీశాడు. ఆ తర్వాత బంగ్లా వేగంగా వికెట్లు కోల్పోగా తౌహీద్ 114 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. రాణా చేతిలో ఆఖరి వికెట్‌గా తను వెనుదిరగడంతో బంగ్లా ఇన్నింగ్స్ ముగిసింది.

అక్షర్ హ్యాట్రిక్ మిస్: బంగ్లాపై స్పిన్నర్ అక్షర్ పటేల్ అరుదైన హ్యాట్రిక్ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అయితే దీనికి కారణం మాత్రం కెప్టెన్ రోహిత్ శర్మనే.. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో అక్షర్ రెండు, మూడో బంతులకు తన్‌జీద్, ముష్ఫికర్ వికెట్లను తీశాడు. ఈ రెండింటిని కీపర్ రాహుల్ మెరుపు వేగంతో పట్టేశాడు. తర్వాతి బంతికి జాకెర్ అలీ కూడా పెవిలియన్‌కు చేరాల్సిందే. కానీ స్లిప్‌లో ఉన్న రోహిత్ ఈ సులువైన క్యాచ్‌ను చివరి క్షణంలో వదిలేశాడు. బంతిని వదిలేసిన రోహిత్ కూడా తనపై తనే అసహనం వ్యక్తం చేసుకుంటూ చేతితో గ్రౌండ్‌ను బాదుతూ కనిపించాడు. ఆ తర్వాత అక్షర్‌కు సారీ చెప్పడం కనిపించింది. ఇప్పటిదాకా సీటీలో విండీస్ పేసర్ జెరోమీ టేలర్ (2006లో) మాత్రమే హ్యాట్రిక్ సాధించాడు. మరోవైపు 20వ ఓవర్‌లో సెంచరీ హీరో తౌహీద్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మిడాఫ్‌లో హార్దిక్ వదిలేశాడు. ఈ రెండు క్యాచ్‌లను పట్టి ఉంటే బంగ్లా స్కోరు 100కు కూడా చేరేది కాదేమో.. ఎందుకంటే ఆ తర్వాత ఈ జోడీ ఆరో వికెట్‌కు 154 పరుగుల భాగస్వామ్యంతో విసిగించింది.


షమి (5/53)

1 ఐసీసీ టోర్నీ (చాంపియన్స్, వరల్డ్‌కప్)ల్లో భారత్ తరపున ఎక్కువ వికెట్లు (60) తీసిన బౌలర్‌గా షమి. జహీర్ (59)ను అధిగమించాడు. అలాగే వన్డేల్లో జట్టు తరపున వేగంగా (104 మ్యాచ్‌ల్లో) 200 వికెట్లు తీసిన బౌలర్‌గానూ నిలిచాడు. ఓవరాల్‌గా స్టార్క్ (102) తర్వాత రెండో బౌలర్.


గిల్ (101 నాటౌట్)



1 భారత్ తరపున తక్కువ ఇన్నింగ్స్ (51)లోనే 8 వన్డే సెంచరీలు పూర్తి చేసిన బ్యాటర్‌గా గిల్.

నేటి మ్యాచ్ అఫ్ఘానిస్థాన్ X దక్షిణాఫ్రికా
మ.2.30 నుంచి - స్టార్ స్పోర్ట్స్‌లో

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్: తన్‌జీద్ హసన్ (సి) రాహుల్ (బి) అక్షర్ 25; సౌమ్య (సి) రాహుల్ (బి) షమి 0; షంటో (సి) విరాట్ (బి) హర్షిత్ 0; మెహిదీ హసన్ (సి) గిల్ (బి) షమి 5; తౌహీద్ హ్రిదయ్ (సి) షమి (బి) హర్షిత్ 100; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అక్షర్ 0; జాకెర్ అలీ (సి) కోహ్లీ (బి) షమి 68; రిషాద్ (సి) హార్దిక్ (బి) హర్షిత్ 18; తన్‌జీమ్ హసన్ (బి) షమి 0; టస్కిన్ (సి) శ్రేయాస్ (బి) షమి 3; ముస్తాఫిజుర్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 49.4 ఓవర్లలో 228 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-26, 4-35, 5-35, 6-189, 7-214, 8-215, 9-228, 10-228; **బౌలింగ్:** షమి 10-0-53-5; హర్షిత్ 7.4-0-31-3; అక్షర్ 9-1-43-2; హార్దిక్ 4-0-20-0; జడేజా 9-0-37-0; కుల్దీప్ 10-0-43-0.

భారత్: రోహిత్ (సి) రిషాద్ (బి) టస్కిన్ 41; గిల్ (నాటౌట్) 101; విరాట్ (సి) సౌమ్య (బి) రిషాద్ 22; శ్రేయాస్ (సి) షంటో (బి) ముస్తాఫిజుర్ 15; అక్షర్ (సి అండ్ బి) రిషాద్ 8; రాహుల్ (నాటౌట్) 41; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 46.3 ఓవర్లలో 231/4. వికెట్ల పతనం:** 1-69, 2-112, 3-133, 4-144; **బౌలింగ్:** టస్కిన్ 9-0-36-1; ముస్తాఫిజుర్ 9-0-62-1; తన్‌జీమ్ 8.3-0-58-0; మెహిదీ హసన్ 10-0-37-0; రిషాద్ 10-0-38-2.

1 వన్డేల్లో భారత్ నుంచి ఎక్కువ క్యాచ్‌లు (156) అందుకుని అజరుద్దీన్‌తో కలిసి తొలి స్థానంలో నిలిచిన కోహ్లీ. ఓవరాల్‌గా జయవర్దనె (218) ముందున్నాడు.

2 వన్డేల్లో తక్కువ ఇన్నింగ్స్ (261)లోనే 11 వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా రోహిత్. విరాట్ (222) టాప్‌లో ఉన్నాడు.

పంకజ్‌కు 14వ స్వర్ణం

మరోసారి ఆసియా స్నూకర్ టైటిల్ కైవసం



దోహా: అంతర్జాతీయ స్థాయిలో తనకు తిరుగులేదని భారత ఏస్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ మరోసారి నిరూపించుకున్నాడు. 39 ఏళ్ల పంకజ్..ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. ఫైనల్లో 4-1తో ఇరాన్‌కు చెందిన అమీర్ సర్ఖోష్‌ను అడ్వాణీ ఓడించాడు. ఈ చాంపియన్‌షిప్‌లో పంకజ్‌కిది 14వ పసిడి పతకం కావడం విశేషం.

సాత్విక్ తండ్రి హఠాన్మరణం

కుమారుడి 'ఖేల్ రత్న' అవార్డు కార్యక్రమానికి వెళ్తుండగా గుండెపోటు


సాత్విక్‌తో కాశీ

అమలాపురం (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం (67) గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. 2024 ఏడాదికిగాను ఖేల్‌రత్న అవార్డును సాత్విక్ న్యూఢిల్లీలో అందుకోవాల్సి వుంది. ఈ కార్యక్రమం కోసం భార్య రంగమణితో కలసి అమలాపురం నుంచి రాజమండ్రి ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. తీసుకెళ్లిన కొద్ది సేపటికే ఆయన కన్నుమూసినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. కుమారుడు ఖేల్‌రత్న అవార్డును తీసుకునే క్షణాలను చూడాలన్న ఆకాంక్ష నెరవేరకుండానే విశ్వనాథం మరణించడంతో ఆ ఇంట విషాదఛాయలు అలముకున్నాయి. విశ్వనాథం రెండో కుమారుడు సాత్విక్. కాగా, ఇప్పటికే ఢిల్లీలో ఉన్న సాయిరాజ్.. తండ్రి మరణ వార్తతో హుటాహుటిన ఇంటికి చేరుకొన్నాడు. ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ నాయకుడు మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ ఎ. స్వామినాయుడు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌బాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సత్తిబాబులతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు కాశీకి నివాళులర్పించారు.

లలితకి స్వర్ణం, రవణికి రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ 15 పతకాలతో ముగించింది. చెన్నై వేదికగా జరుగుతున్న ఈ పోటీలకు ఆఖరి రోజైన గురువారం ఆంధ్ర పారా అథ్లెట్లు మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల టి-11 200 మీటర్ల పరుగులో కె.లలిత స్వర్ణం సాధించగా, వి.రవణి రజతంతో మెరిసింది. టి-46 లాంగ్‌జంప్‌లో వి.భవానీ (నెల్లూరు) కాంస్యం దక్కించుకుంది. మొత్తంగా ఈ క్రీడల్లో ఆంధ్ర 6 పసిడి, 2 రజతాలు, 7 కాంస్యాలు సాధించింది.

పట్టుబిగించిన విదర్భ

ముంబై లక్ష్యం 406
ప్రస్తుతం 83/3
రంజీ సెమీస్

నాగ్‌పూర్: విదర్భతో రంజీ సెమీస్ మ్యాచ్‌లో ముంబై ఎదురీదుతోంది. 406 పరుగుల లక్ష్య ఛేదనలో.. గురువారం రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 83/3 స్కోరు చేసింది. విజయానికి ముంబై ఇంకా 323 పరుగుల దూరంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 147/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 292 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (151) సెంచరీ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 383, ముంబై 270 పరుగులు సాధించాయి. కేరళతో రంజీ సెమీస్‌లో గుజరాత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంపై కన్నేసింది. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 222/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన గుజరాత్ 429/7 చేసింది. కేరళ తొలి ఇన్నింగ్స్ స్కోరు 457కు గుజరాత్ ఇంకా 28 పరుగుల దూరంలో ఉంది. ఒక్క పరుగు ఆధిక్యం లభించినా గుజరాత్ తుది పోరుకు అర్హత సాధిస్తుంది.

గాయంతో ఫఖర్ అవుట్

ఇమాముల్‌కు స్థానం

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్‌కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. న్యూజిలాండ్‌తో తొలి పోరు సందర్భంగా గాయపడిన ఓపెనర్ ఫఖర్ జమాన్ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. అతడి స్థానంలో ఇమాముల్ హక్‌కు స్థానం కల్పించారు. పాకిస్థాన్ తదుపరి కీలక మ్యాచ్‌లో భారత్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ వచ్చే ఆదివారం దుబాయ్‌లో జరగనుంది.

వీలైతే.. క్షమించేయండి బ్రో..!

ధోనీ లైఫ్ మంత్ర



ముంబై: 'కష్టమే అయినా.. క్షమించండి, మీ దారిన మీరు సాగిపోండి' ఇదే తన జీవన మంత్రం అని ధోనీ చెప్పాడు. ఇతరులు ఏమనుకొంటున్నారో అని అతిగా ఆలోచించి.. మంచి నిద్రను దూరం చేసుకోనన్నాడు. 'ధోనీ' యాప్ విడుదల సందర్భంగా అభిమానుల ప్రశ్నలకు మహీ సమాధానం చెప్పాడు. 'జీవితాన్ని నిరాడంబరంగా గడపాలి. నీకు మంచి చేసిన వారి పట్ల కృతజ్ఞతా భావంతో ఉండండి. ముఖంపై చెరగని చిరునవ్వే సగం సమస్యలను పరిష్కరిస్తుంది. కొన్ని విషయాలను ఏ మాత్రం పట్టించుకోకపోతేనే జీవితం సాఫీగా సాగుతుంది. చివరగా మన చేతుల్లోలేని వాటిని నియంత్రించాలనుకోవడం అనవసర ఒత్తిడికి దారితీస్తుందనే విషయాన్ని గుర్తించాలని మహీ పేర్కొన్నాడు.

బిజినెస్

భారత్‌లో గూగుల్ విక్రయ కేంద్రాలు



తొలుత ఢిల్లీ, ముంబై, బెంగళూరులో ఏర్పాటు!? • వచ్చే 6 నెలల్లో తొలి స్టోర్‌ను ప్రారంభించే చాన్స్

న్యూఢిల్లీ: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ సైతం యాపిల్ బాటను అనుసరిస్తోంది. భారత్‌లో గూగుల్ తన రిటైల్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది. తొలుత ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలను ఎంచుకునే అవకాశాలున్నాయని తెలిసింది. తొలి స్టోర్ కనీసం 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనుందని, మరో ఆరు నెలల్లో ఇది ప్రారంభం కావచ్చని సమాచారం. రిటైల్ స్టోర్ల ద్వారా కంపెనీ పిక్సెల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇయర్‌బడ్స్‌తో పాటు పలు టెక్ ఉత్పత్తులను విక్రయించనుంది. ప్రస్తుతం గూగుల్ కేవలం 5 స్టోర్లను నిర్వహిస్తోంది. అవన్నీ అమెరికాలోనే ఉన్నాయి. యూఎస్ తర్వాత స్టోర్ల ఏర్పాటుకు గూగుల్ భారత్‌నే ఎంచుకోవడం విశేషం. గూగుల్‌కు అతిపెద్ద, కీలక మార్కెట్లలో భారత్ ఒకటి. మన దేశంలో సాంకేతిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ తదితర కార్యక్రమాల కంపెనీల ఇప్పటికే 1,000 కోట్ల డాలర్ల పెట్టుబడులను ప్రకటించింది. కాగా, యాపిల్ తన ఉత్పత్తుల విక్రయం కోసం ఢిల్లీ, ముంబైలో ఇప్పటికే స్టోర్లను ఏర్పాటు చేసింది.

2047 నాటికి అధిక ఆదాయ దేశంగా భారత్

23-35 లక్షల కోట్ల డాలర్లకు దేశ జీడీపీ • సేవల రంగమే వృద్ధికి ప్రధాన చోదకం • బెయిన్ అండ్ కో-నాస్కామ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: వచ్చే 22 ఏళ్లలో (2047 నాటికి) భారత్ అధిక ఆదాయం కలిగిన దేశంగా అవతరించనుందని, జీడీపీ 23-35 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుందని బెయిన్ అండ్ కో, నాస్కామ్ సంయుక్తంగా గురువారం విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది. భారత సేవల రంగమే వృద్ధికి ప్రధాన చోదకం కానుందని నివేదికలో పేర్కొంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- 2047 నాటికి భారత జీడీపీలో సేవల రంగం వాటా 60 శాతానికి పెరగనుంది. మాన్యుఫాక్చరింగ్ రంగం 32 శాతం వాటా కలిగి ఉండనుంది. ఈ రెండూ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయి.
- ముున్ముందు దశాబ్దాల్లో దాదాపు 20 కోట్ల ఉద్యోగాల కల్పన జరగవచ్చు. అధికాదాయం పంచే ఆధునిక ఉద్యోగాల కల్పన ద్వారా ఆర్థికంగా బలపడే వినూత్న అవకాశం భారత్ కలిగి ఉంది. రంగాల వారీగా సాంకేతిక పురోగతి ప్రణాళికలు ఈ పరివర్తనంలో కీలక పాత్ర పోషించగలవు.
- కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చిప్ డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్‌లో పూర్తి స్థాయి యాంత్రీకరణ, విడిభాగాల తయారీ, డిజైన్‌తో తిరోగమన అనుసంధానం ద్వారా ధరలో పోటీ సామర్థ్యం, ఆవిష్కరణల సామర్థ్యాన్ని పెంచనుంది. దాంతో ఆ రంగ ఎగుమతి వాటా 24 శాతం నుంచి 2047 నాటికి 45-50శాతానికి పెంచుకునే వీలుంటుంది. అలాగే, జీడీపీలో ఈ రంగం వాటా 3 శాతం నుంచి 8-10 శాతానికి చేరుకోవచ్చు.



- 2023 నాటికి దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుత్‌లో పునరుత్పాదక ఇంధన రంగం వాటా 24 శాతంగా ఉండగా.. 2047 నాటికి 70 శాతానికి చేరుకోవచ్చు.
- ఐసీఈ మార్కెట్లో వాటా పెంచుకోవడంతో పాటు ఈవీలకు మారడం ద్వారా వాహన విడిభాగాల ఎగుమతుల రంగం 2047 నాటికి 20,000-25,000 కోట్ల స్థాయికి చేరుకోవచ్చు. ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ, రసాయనాలు, ఆటోమోటివ్, సర్వీసెస్ రంగాలు వ్యూహాత్మక వృద్ధి చోదకాలుగా పనిచేయనున్నాయి. పెరుగుతున్న ఆదాయాలు, నిపుణులతో పాటు మెరుగవుతున్న మౌలిక వసతులు ఆర్థిక వృద్ధికి దోహదపడనున్నాయి.
- భారత ఆర్థిక వ్యవస్థకు కొన్ని సవాళ్లున్నాయి. 2030 నాటికి నిపుణుల కొరత 5 కోట్లకు పెరగవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ (ఎస్‌టీఈఎం) విద్యను మరింత మెరుగుపరచడంతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. స్థానికంగా తయారీ సహా కీలక విడిభాగాల ఉత్పత్తి, డిజైనింగ్‌కు మరింత ప్రాధాన్యమివ్వాలి. తద్వారా విడిభాగాల కోసం దిగుమతులపై ఆధారం తగ్గుతుంది.
- ఏఐలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం, హరిత ఇంధనం, ఇతర కీలక రంగాలు, ఆర్ అండ్ డీలో పెట్టుబడుల పెంపు దేశీయంగా ఆవిష్కరణలకు దోహదపడటంతో పాటు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతాం.
- మౌలిక వసతుల పెంపు, నైపుణ్య కొరతను తగ్గించుకోవడంతోపాటు అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సాంకేతికత ద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయడంపైనే భారత ఆర్థిక వృద్ధి ఆధారపడి ఉంది.
- డిజిటల్, రవాణ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, దేశీయంగా తయారీ పెంపు, భాగస్వామ్యాల ద్వారా పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా భవిష్యత్ టెక్నాలజీలు, ప్రపంచ వాణిజ్యంలో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టవచ్చని నాస్కామ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంగీత గుప్తా అన్నారు. బహుముఖ, సాంకేతిక విధానం ద్వారా సమ్మిళిత, సుస్థిర వృద్ధికి బాటలు వేయవచ్చన్నారు.

పీఎన్‌బీ వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రిటైల్ రుణాలపై వడ్డీ రేటు తగ్గించింది. తమ గృహ, ఆటో, విద్య, వ్యక్తిగత రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటును పావు శాతం (0.25%) తగ్గిస్తున్నట్టు పీఎన్‌బీ ప్రకటించింది. ఈ నెల 10 నుంచే ఈ తగ్గింపు అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంతో పీఎన్‌బీ కనీస వడ్డీ రేటు గృహ రుణాలపై 8.15 శాతం, ఆటో రుణాలపై 8.5 శాతం, విద్యా రుణాలపై 7.85 శాతం, వ్యక్తిగత రుణాలపై 11.25 శాతం చొప్పున ప్రారంభమవుతుంది. కాగా వచ్చే నెలాఖరు వరకు తీసుకునే గృహ రుణాలపై ఎలాంటి ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్ చార్జీలు కూడా ఉండవని పీఎన్‌బీ తెలిపింది.

స్పెండిడ్ హాస్పిటల్స్‌తో కిమ్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్ప్లెండిడ్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా స్ప్లెండిడ్ హాస్పిటల్స్ కార్యకలాపాలు, నిర్వహణ (ఓ అండ్ ఎం)ను కిమ్స్ చేపట్టనుంది. ఈ ఒప్పంద కాలపరిమితి ఏడేళ్లు. ఆ తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకునే అవకాశం ఉంది. అలాగే వైద్య సేవలను కూడా అందించనుంది. హైదరాబాద్, కూకట్‌పల్లిలో నమోదిత కార్యాలయం కలిగి ఉన్న స్ప్లెండిడ్ హాస్పిటల్స్.. 150 పడకల సామర్థ్యం గల హాస్పిటల్‌ను నిర్మిస్తోంది. ఆ తర్వాత సామర్థ్యాన్ని 200 పడకలకు విస్తరించుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది జూన్ నాటికల్లా ఈ హాస్పిటల్ కార్యకలాపాలు ప్రారంభించవచ్చని అంచనా వేస్తోంది.

సీఈఏ నాగేశ్వరన్ పదవీకాలం పెంపు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నియామకాల కేంద్ర క్యాబినెట్ కమిటీ (ఏసీసీ) గురువారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని మరో మూడేళ్లు పొడిగించింది. 2022 జనవరి 28లో మూడేళ్ల కాలానికి ఆయన్ని ప్రభుత్వం సీఈఏగా నియమించింది. ఈ గడువు ఈ ఏడాది జనవరి 27తోనే ముగిసింది. దీంతో ఆయన పదవీ కాలాన్ని మరో మూడేళ్ల (2027 మార్చి 31 వరకు) పొడిగించాలని నిర్ణయించింది. కాగా నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం పదవీ కాలాన్నీ మరో ఏడాది వరకు పొడిగించేదుకూ ఏసీసీ ఆమోదం తెలిపింది. ఆయన ఈ నెల 24న రిటైర్ కావాల్సి ఉంది.

బీఎస్ఈలో వేగా జువెలర్స్ లిస్టింగ్



వేగా జువెలర్స్ లిమిటెడ్.. గురువారం నాడు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)లో లిస్టయింది. వేగా జువెలర్స్ ఎండీ నవీన్ కుమార్ వనమా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమా, చైర్మన్ రామ్ మోహన్ బండ్లమూడి, డైరెక్టర్ చంద్రకాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఎస్ఈలో కంపెనీని లిస్ట్ చేయటం ద్వారా తమ 20 సంవత్సరాల కల నెరవేరిందని సంస్థ ఎండీ నవీన్ కుమార్ ఈ సందర్భంగా అన్నారు. వేగా జువెలర్స్. 15,000కు పైగా ప్రత్యేకమైన డిజైన్లు, 425 మంది సిబ్బందితో పాటు 4 లక్షల మంది విశ్వసనీయమైన కస్టమర్లను కలిగిఉందన్నారు. ప్రస్తుతం వేగా జువెలర్స్. విజయవాడ, హైదరాబాద్, కాకినాడల్లో షోరూమ్స్ నిర్వహిస్తోంది.

టాటా ఈవీలపై సరికొత్త ఆఫర్లు

న్యూఢిల్లీ: విద్యుత్ వాహన (ఈవీ) రంగంలోనూ పోటీ పెరుగుతోంది. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా ఈ ఏప్రిల్‌లో భారత మార్కెట్లో తన ఈవీ మోడల్స్ విడుదల చేయబోతోంది. ఈ వార్తలతో దేశీయ ఈవీ మార్కెట్లో 62 శాతం వాటా ఉన్న టాటా మోటార్స్ అప్రమత్తమైంది. దీంతో పాత ఈవీ ఇచ్చి.. కొత్త ఈవీ తీసుకుంటే ఎక్స్ఛేంజీ ఆఫర్ కింద రూ.50,000, ఎలాంటి డౌన్‌పేమెంట్ లేకుండా వాహనం ఆన్ రోడ్ ధర మొత్తానికి ఫైనాన్స్ వంటి ఆఫర్లు ప్రకటించింది. కంపెనీ ఈవీల అమ్మకాలు రెండు లక్షల మైలురాయిని దాటిన సందర్భంగా 45 రోజుల పాటు ఈ ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయని టాటా మోటార్స్ వెల్లడించింది.

బడా షేరు బేజార్.. చిన్నస్టాక్స్ జిగేల్

» సెన్సెక్స్ 203 పాయింట్లు డౌన్
» ఒక శాతానికి పైగా పెరిగిన స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడో రోజు నష్టపోయాయి. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 203.22 పాయింట్లు కోల్పోయి 75,735.96 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 19.75 పాయింట్ల నష్టంతో 22,913.15 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెద్ద షేర్లలో అమ్మకాలకే మొగ్గుచూపడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం ఇందుకు కారణమయ్యాయి. కాగా, గత కొన్ని రోజుల్లో భారీగా క్షీణించిన చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో ట్రేడర్లు వాల్యూ బైయింగ్ జరిపారు. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.32 శాతం ఎగబాకగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్, ఆర్థిక సేవలు, ఫోకస్డ్ ఐటీ, ఎఫ్ఎంసీజీ నేలచూపులు చూడగా.. పవర్, యుటిలిటీస్, మెటల్ 2 శాతానికి పైగా పెరిగాయి.

• పబ్లిక్ ఇష్యూకి ఫోన్‌పే

దేశంలో అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల సేవల కంపెనీ ఫోన్‌పే సైతం ఐపీఓకు సన్నద్ధమవుతోంది. గడిచిన ఐదేళ్లలో ఐపీఓకు రాబోతున్న మూడో ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే కానుంది. పేటీఎం, మొబిక్విక్ ఇప్పటికే ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాయి. యూపీఐ చెల్లింపుల్లో ప్రస్తుతం ఫోన్‌పేదే 48% వాటా. 2023లో కంపెనీ మార్కెట్ విలువను 1,200 కోట్ల డాలర్ల స్థాయిలో లెక్కగట్టారు.

• వచ్చే నెలలో ఎన్ఎస్‌డీఎల్ రూ.3,000 కోట్ల ఐపీఓ

నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) రూ.3,000 కోట్ల ఐపీఓ వచ్చే నెలలో ప్రారంభం కానుంది. ఎన్ఎస్‌డీఎల్ పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనకు సెబీ గత సెప్టెంబరులోనే ఆమోదం తెలిపింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన జరగనున్న ఈ ఇష్యూ ద్వారా ఎన్ఎస్‌డీఎల్‌లో వాటాలు కలిగిన ఎన్ఎస్ఈ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కలిసి మొత్తం 5.72 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	430
చిత్తూరు	493	విశాఖపట్నం	440
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	80
కరీంనగర్	80	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	85
కర్నూలు	80	నెల్లూరు	90
విశాఖపట్నం	83	అనంతపురం	90
గోదావరి	91		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	88,040 ▲	80,700 ▲	1,07,000 ▼
విజయవాడ	89,350 ▲	83,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	86,210 ▼	79,030 ▼	97,480 ▼
రాజమండ్రి	88,040 ▲	80,700 ▲	1,00,000 ▲
ప్రొద్దుటూరు	89,050 ▲	82,460 ▲	98,500 ▲
ముంబై	86,520 ▼	79,252 ▼	97,789 ▲

ఆంధ్రజ్యోతి

చిత్రజ్యోతి

SINCE 1965

విజయవాడ ● శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

‘దృశ్యం-3’ పక్కా..



మలయాళ హీరో మోహన్ లాల్ తన అభిమానులకు శుభవార్త చెప్పారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ‘దృశ్యం-3’ చిత్రం త్వరలో పట్టాలెక్కనుందని అధికారిక ప్రకటన చేశారు. ఈమేరకు దర్శకుడు జీతూ జోసెఫ్, నిర్మాత ఆంటోనితో కలసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో మోహన్ లాల్ షేర్ చేశారు. ‘గతం ఎప్పుడూ నిశబ్దంగా ఉండదు..‘దృశ్యం-3’ పక్కా..’ అంటూ ఫొటో కింద కాప్షన్ పెట్టారు. చిత్ర తారాగణం, సాంకేతిక సిబ్బంది తదితర వివరాలను మాత్రం వెల్లడించలేదు. కాగా, 2013లో మలయాళంలో విడుదలైన ‘దృశ్యం’ ఘనవిజయం సాధించింది. ఇందులో మోహన్‌లాల్, మీనా జంటగా నటించారు.



జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించినప్పటి నుంచి ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్ మీదకు వెళుతుందా అని ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2024లో ఈ సినిమాను ప్రారంభించారు. గురువారం రెగ్యులర్ షూట్‌ను ప్రారంభించారు.

షూటింగ్ షురూ!



ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ సోషల్‌మీడియా ద్వారా తెలిపింది. భారతీయ సినీ చరిత్రలో ప్రత్యేకంగా మిగిలిపోయే సినిమా అని పేర్కొంది. కాగా, ఇది ఎన్టీఆర్ నటిస్తున్న 31వ చిత్రం. రుక్మిణీ వసంత్, టొవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 9 విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

విమానంలో వివాహ వార్షికోత్సవం



మెగాస్టార్ చిరంజీవి, సురేఖ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని గురువారం ఓ విమానంలో జరుపుకొన్నారు. ఈ వేడుకలో చిరంజీవి దంపతులతో పాటు నాగార్జున, అమల, నమ్రత తదితరులు ఉన్నారు. ఫొటోలను ఎక్స్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు చిరు. “నా కలల భాగస్వామి సురేఖ నా జీవితంలో అడుగుపెట్టిన ఈ రోజు ఎంతో ప్రత్యేకం” అని పేర్కొన్నారు. పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. వేడుకల్లో భాగంగా దుబాయ్ వెళ్తున్నట్లు తెలిపారు.

పారితోషికం లేకుండా చేసిన సినిమా



-బ్రహ్మాజీ

నటుడు బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో నటించిన డార్క్ కామెడీ డ్రామా ‘బాపు’. ‘ఏ ఫాదర్స్ స్టోరీ’ అనేది ఉప శీర్షిక. అవసరాల శ్రీనివాస్, బలగం సుధాకర్, ఆమని, ధన్య బాలకృష్ణన్ కీలక పాత్రల్లో నటించారు. దయ దర్శకత్వంలో రాజు, సి.హెచ్.భానుప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మీడియాతో చిత్రవిశేషాలను పంచుకున్నారు బ్రహ్మాజీ. “దర్శకుడు దయ రెండేళ్ల క్రితం ఈ సినిమా కథ చెప్పారు. ఇందులో నా పాత్ర పేరు మల్లన్న. చాలా సహజంగా ఉండే సినిమా ఇది. ఈ కథ మీద ప్రేమ, నమ్మకంతో పారితోషికం తీసుకోలేదు. ఒకవేళ లాభాలు వస్తే కొంత డబ్బు ఇవ్వమని చెప్పా. ఇదో యూనిక్ కాన్సెప్ట్. రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంది. అలా మల్లన్న పాత్ర ఆత్మహత్యకు ప్రయత్నించాక, ఏం జరుగుతుందనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాకు పరిశ్రమ నుంచి మంచి ప్రోత్సాహం లభించింది” అని చెప్పారు.

దర్శకుడు శంకర్ ఆస్తుల జప్తు



తమిళ దర్శకుడు ఎస్. శంకర్‌కు చెందిన రూ.10.11 కోట్ల విలువైన స్థిరాస్తులను స్తంభింపజేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ప్రకటించారు. శంకర్ చిత్రాల నిర్మాణ సంబంధిత వ్యవహారాలలో అక్రమ నగదు రవాణా పాల్పడ్డారనే ఆరోపణలపై 2022లో ఈడీ ఆయనపై కేసు నమోదు చేసి, సమన్లు కూడా జారీ చేసింది. ఆ సందర్భంగా శంకర్ తన న్యాయవాదులతో కలిసి చెన్నైలోని ఈడీ కార్యాలయంలో జరిగిన విచారణలో పాల్గొన్నారు. మూడు గంటలకు పైగా అధికారులు సంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. విచారణ అనంతరం ఈ నెల 17న ఆస్తులను స్తంభింపజేస్తూ ఈడీ నిర్ణయం తీసుకుంది.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆర్టిస్టులు లేకుండా సినిమా!



హీరో, హీరోయిన్లే కాదు ఆర్టిస్టులెవరినీ చూపించకుండా కేవలం కథ, కథనాల మీదే నడిపిస్తూ తీసిన చిత్రం ‘రారాజు’. నిజంగా ఇది సాహసోపేతమైన ప్రయత్నమే. బి. శివప్రసాద్ దర్శకత్వంలో ఇటువంటి సాహసానికి పూనుకుంది పద్మినీ సినిమాస్ సంస్థ. వారి ప్రయత్నాన్ని అభినందించి, ‘రారాజు’ చిత్రం రిలీజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. ఈ ప్రయోగం సక్సెస్ అయితే పరిశ్రమ స్వరూపమే మారిపోతుందని ఆయన అన్నారు. ట్రైలర్ కూడా ఆసక్తికరంగా ఉందన్నారు. చిత్ర దర్శకుడు శివప్రసాద్ మాట్లాడుతూ ‘మా సినిమాలో ఆర్టిస్టుల మొహాలు కనిపించవు. కథ, కథనమే ముఖ్యం అని భావించి ఓ ప్రయోగం చేశాం. మార్చి 7న విడుదలయ్యే మా చిత్రాన్ని ఆదరించి, మా ప్రయోగాన్ని అందరూ అభినందిస్తారని భావిస్తున్నాం’ అని చెప్పారు.

ఇక నుంచి నా సినిమాలో అసభ్యత ఉండదు

- విష్వక్సేన్



విష్వక్సేన్ హీరోగా రామ్‌నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘లైలా’. ఇటీవలె విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. విడుదలకు ముందే వివాదాస్పదం కావడం కూడా ఈ సినిమా ఆడకపోవడానికి ఓ కారణమైంది. ఈ నేపథ్యంలో విష్వక్సేన్ ఓ లేఖ విడుదల చేశారు. ‘ఇటీవల నా సినిమాలు అందరూ కోరుకున్న స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శలను స్వీకరిస్తున్నా. నన్ను నమ్మి, నా ప్రయాణానికి మద్దతిచ్చిన నా అభిమానులకు హృదయపూర్వక క్షమాపణలు చెబుతున్నాను. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే. ఇక నుంచి నేను చేసే ఏ సినిమాలోనూ అసభ్యత ఉండదు’ అని విష్వక్సేన్ పేర్కొన్నారు.

శక్తిమంతమైన పాత్రలో...



ఆనంది, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘శివంగి’. భరణి ధరణ్ దర్శకత్వంలో నరేశ్.పి.బాబు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో గళ్ల లుంగీ, నల్లచొక్కాలో శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు ఆనంది. విభిన్నమైన కథ, సరికొత్త కథనంతో సినిమా క్షణక్షణం థ్రిల్‌ను పంచుతుందని మేకర్స్ తెలిపారు. మార్చి 7న సినిమా విడుదలవుతోంది. జాన్‌విజయ్, కోయ కిశోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన పోలీస్ డ్యూటీ మీట్ పతక విజేతలతో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

వెల్‌డన్ బాయ్స్..!

- పోలీసు డ్యూటీ మీట్ పతక విజేతలతో డీజీపీ గుప్తా

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'వెల్‌డన్ బాయ్స్.. మీ తెలివితేటలు ఏపీ పోలీసుశాఖలో విస్తరించాలి.. రాష్ట్రంలో ఎవరు నేరం చేసినా మన నుంచి తప్పించుకోలేరు..' అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఆరు రోజులపాటు జరిగిన అఖిల భారత సర్వీసు డ్యూటీ మీట్‌లో ఏపీ పోలీసులు పాల్గొని సత్తాచాటారు. వివిధ అంశాల్లో పోటీపడి 4 స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్యాలు సాధించారు. 18 రాష్ట్రాల పోలీసులు, 8 పారామిలటరీ విభాగాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి పాల్గొనగా.. పతకాల పట్టికలో ఏపీ పోలీస్ విభాగం రెండో స్థానంలో, టీమ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ బృందం గురువారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను కలిసింది. వ్యక్తిగత విభాగంలో ఎవరికీ సాధ్యంకాని విధంగా మూడు స్వర్ణాలు సాధించిన ఎస్ఐ కృష్ణమూర్తిని డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు.

24 నుంచి అసెంబ్లీ.. 28న బడ్జెట్

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. మర్నాడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ చేపడతారు. 26,27 తేదీలు సెలవు దినాలు. 28న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెడతారు. ఈ మేరకు గవర్నర్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

పనికిరాకుండా వేబ్రిడ్జిల నిర్మాణం

- గత ప్రభుత్వంలో కమీషన్ల కక్కుర్తి
- పెందుర్తి, పద్మనాభం మండలాల్లో అవకతవకలు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కమీషన్లకు కక్కుర్తిపడి రైతు భరోసా కేంద్రాల వద్ద నిర్మించిన వేబ్రిడ్జిలు నిరుపయోగంగా మారాయి. ధాన్యం, ఇతర పంటల తూకం కోసం 2022-23లో వివిధ జిల్లాల్లోని ఆర్బీకేల వద్ద 93 వేబ్రిడ్జిలు నిర్మించారు. 60 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల వేబ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిధులు వెచ్చించింది. ఒక్కొక్క దానికి రూ.25 లక్షలు ఖర్చు చేశారు. కాగా, తూకానికి అనువు కానిచోట వేబ్రిడ్జిలకు స్థలాలను ఎంపిక చేశారని, పనుల్లో నిబంధనలు పాటించలేదని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. పలువురు ఇంజనీరింగ్ అధికారులకు పెద్దఎత్తున కమీషన్లు ముట్టినట్లు ఆరోపణలువచ్చాయి. విశాఖ జిల్లా పెందుర్తి, పద్మనాభం మండలాల్లో నిర్మించిన వేబ్రిడ్జిలపైకి లోడు లారీలు ఎక్కడానికి వీలుకానివిధంగా నిర్మించారని, నిధులు వృథా అయ్యాయని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. దీనిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారికి మెమో జారీ చేశారు.

బయోసెక్యూరిటీ ద్వారానే బర్డ్‌ఫ్లూ దూరం

- కేంద్ర పశుసంవర్థక శాఖ జేడీ ఆర్‌జీ బంబాల్

తణుకు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'బర్డ్ ఫ్లూ వైరస్ ఎలా ప్రయాణిస్తుందో తెలియదు. వైరస్ సోకిన కిలోమీటరు ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించి, ఆ ప్రాంతంలోని కోళ్లను ఖననం చేశాం. ఈ పరిధి గతంలో 3కిలోమీటర్ల వరకూ ఉండేది. రైతుల ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని కిలోమీటరుకు తగ్గించాం' అని కేంద్ర పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌జీ బంబాల్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరులో బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల ఫారాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం గురువారం పర్యటించింది. తణుకులో రైతులతో సరిగిన సమావేశంలో బంబాల్ మాట్లాడుతూ.. 'బయోసెక్యూరిటీని పాటించడం ద్వారానే బర్డ్‌ఫ్లూ నుంచి బయటపడగలరు. రైతులు తమ ఫారాల్లోని కోళ్లకు వ్యాక్సినేషన్ వేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేస్తుంది. ఆ కమిటీ సూచనల మేరకు కేంద్రం వ్యాక్సిన్ ప్రక్రియ చేపడుతుంది. ఫారం గేటు దాటకుండానే వైరస్‌ను నిర్మూలించేందుకు ప్రతీ రైతు చర్యలు తీసుకోవాలి. రాబోయే రోజుల్లో పౌల్ట్రీ ఫారాలను కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం శానిటైజ్ చేసి త్వరగా రిపోర్టులు పంపిస్తే త్వరగా కోళ్లను పెంచేందుకు అనుమతులు లభిస్తాయి' అని చెప్పారు. పౌల్ట్రీ రైతుల సూచనలను కేంద్రానికి నివేదిస్తామని తెలిపారు. నెక్ చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కోళ్లలో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం కన్నా ప్రభుత్వం విధించిన నిబంధనలను మీడియా ప్రచారం చేయడం వల్లే ప్రజల్లో అపోహలు పెరిగి పౌల్ట్రీ రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బర్డ్‌ఫ్లూ కారణంగా పౌల్ట్రీ ఉత్పత్తులపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను తొలగించాలని కోరారు. అనంతరం వేల్పూరులోని కోళ్ల ఫారాలను అధికారులు పరిశీలించారు.

ఎస్పీడీసీఎల్ మారదా?

- అధిక ధరలకు ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు సిద్ధం
- జగన్ ఉన్నప్పుడు అవసరం లేకున్నా అస్మదీయ సంస్థల కోసం తెగ కొన్నారు
- ఆయన ఓడినా ఆ డిస్కంది అదే తీరు
- ప్రైస్ బిడ్లు ఇంకా తెరవలేదు: సీఎండీ



అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అవసరం లేకపోయినా అత్యవసరం పేరిట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, ఇతర పరికరాలను అధిక ధరలకు కొనుగోలు చేయడం దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)కు అలవాటుగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అస్మదీయ సంస్థలకు మేలు చేయడానికి రెట్టింపు ధరలకు ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాల కొనుగోలు ఆ డిస్కంకు అలవాటైందన్న విమర్శలు వస్తున్నాయి. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ విచ్చలవిడిగా రెట్టింపు ధరలకు ట్రాన్స్‌ఫార్మర్లను కొన్నాయి. అప్పట్లో దీనిని బహిర్గతం చేసినా జగన్ పట్టించుకోలేదు సరికదా.. అస్మదీయ కంపెనీల నుంచి అవసరానికి మించి ట్రాన్స్‌ఫార్మర్లను కొని రాష్ట్రవ్యాప్తంగా డంప్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ఘోర పరాజయం చవిచూశాక కూడా డిస్కంల తీరులో ఏ మాత్రం మార్పురాలేదు. అధిక ధరలకు ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేస్తూనే ఉన్నాయి. ఇందుకోసం టెండర్ నిబంధనలు కూడా మార్చేస్తున్నాయి. ఎస్పీడీసీఎల్ తాజాగా పది వేల ఎస్పీఎంపీటీ-94 ట్రాన్స్‌ఫార్మర్లు (25 కేవీఏ), 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు మరో 600 కొనుగోలుకు టెండర్లు పిలిచింది. వాటి టెక్నికల్ బిడ్లు తెరిచింది. కొందరు సరఫరాదారులు కోట్ చేసిన ధరలు చూసి.. బాబోయ్ ఇంత ఎక్కువ ధరా అని పోటీదారులే ఆశ్చర్యపోతున్నారు. ఒక్కో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ధరను రూ.1,19,900గా పేర్కొన్నారు. తెలంగాణలో రూ.66,609కు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.75,496.45కు కొన్నారు. తెలంగాణతో పోలిస్తే రూ.52,391, ఛత్తీస్‌గఢ్ కంటే రూ.43 వేలు ఎక్కువగా ఉన్నాయి. అదేవిధంగా 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ధరను రూ.3,75,900గా కోట్ చేయగా.. దీనిని తెలంగాణ రూ1,64,730, ఛత్తీస్‌గఢ్ 1,62,700కు కొన్నాయి. రెట్టింపు కంటే అధిక ధరకు కొనుగోలుకు ఎస్పీడీసీఎల్ సిద్ధమవుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తుది ధర ఖరారు కాలేదు: సీఎండీ

ట్రాన్స్‌ఫార్మర్ల టెండర్లకు సంబంధించి టెక్నికల్ బిడ్లు మాత్రమే తెరిచామని, ఇంకా ప్రైస్ బిడ్ ఓపెన్ చేయలేదని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు 'ఆంధ్రజ్యోతి'కి వివరణ ఇచ్చారు. ప్రైస్ బిడ్ తెరిచాక ధరలు బహిర్గతమవుతాయని.. ఆ తర్వాత బిడ్డింగ్ సంస్థలతో సంప్రదింపులు జరిపాకే తుది ధర వస్తుందని చెప్పారు. అప్పటిదాకా టెండర్ ఖరారైనట్లు కాదన్నారు.

సౌరశక్తితో నడిచే ట్రైసైకిల్

- బ్రిక్స్ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ కాంటెస్ట్‌లో అత్యుత్తమ ప్రాజెక్టుగా ఎంపిక

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్)లో రూపొందిన సోలార్ పవర్డ్ ట్రైసైకిల్ బ్రిక్స్ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ కాంటెస్ట్-2024లో అత్యుత్తమ ప్రాజెక్టు అవార్డును గెలుచుకుంది. ఈ ట్రైసైకిల్‌ను జోన్‌లోని అసిస్టివ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) అభివృద్ధి చేసింది. ఇంటిగ్రేటెడ్ సోలార్ ప్యానల్స్, మోటారు సాయంతో పనిచేసే ఈ ట్రైసైకిల్ పర్యావరణహితంగా ఉంటుందని మెడ్‌టెక్ జోన్ గురువారం తెలిపింది. ఈ సందర్భంగా జోన్ సీఈవో జితేంద్రశర్మ మాట్లాడుతూ.. ఈ అవార్డుతో జోన్ మరో మైలురాయికి చేరిందన్నారు. ఇటీవల జరిగిన పారా అథ్లెటిక్స్, వీల్ చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఈ ట్రైసైకిల్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు.

అసిస్టివ్ టెక్నాలజీ సెంటర్ అభివృద్ధి చేసిన సౌరశక్తితో నడిచే ట్రైసైకిల్ →



ఆ నిషేధం చెల్లదిక

(మొదటి పేజీ తరువాయి)

'ఆంధ్రజ్యోతి' "నిషేధ భూములకు విముక్తి" శీర్షికన వార్తను ప్రచురించిన విషయం తెలిసిందే.

మార్గదర్శకాల్లోని కీలకాంశాలు...

ప్రభుత్వ ప్రయోజనాలతో సంబంధం లేని ప్రైవేటు భూములేవీ నిషేధ భూముల జాబితాలో ఉండటానికి వీల్లేదు. కాబట్టి నిషేధ జాబితా 22(ఏ)(1)(ఇ)లో ఉన్న పట్టా భూములను తొలగించాలి.

కొన్ని భూముల్ని కాపాడే పేరిట సబ్ డివిజన్ చేయకుండానే మొత్తం సర్వే నంబర్‌ను నిషేధ జాబితాలో చేర్చారు. దీంతో ఆ సర్వే నంబర్‌లోనే ఉన్న పట్టా భూముల రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి, ఒక సర్వే నంబర్‌లోని భూములను ప్రత్యేకంగా నిషేధ జాబితాలో చేర్చాలంటే, అందులో ఉన్న ఇతర ప్రైవేటు భూములను వేరు చేయాలి. సర్వేచేసి ఆ భూములను సబ్‌డివిజన్ చేయాలి. ఆ తర్వాతే 22(ఏ)లో చేర్చాలి.

తమ భూములను అన్యాయంగా నిషేధ జాబితాలో చేర్చారని, వాటికి మోక్షం కల్పించాలని రైతులు లిఖితపూర్వక విన్నపాలు ఇచ్చినా, లేదా ఆన్‌లైన్‌లో పిటిషన్ సమర్పించినా వాటిని జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ పరిశీలన చేయాలి. ఆ రైతు తన వాదన వినిపించేందుకు తగిన సమయం ఇవ్వాలి. ఆ భూమిపై ఆర్డీవో నుంచి కమిటీ నివేదిక తెప్పించుకొని రైతు వాదన వినాలి. ఆ తర్వాతే ఆ భూమిని నిషేధ జాబితా నుంచి తొలగించాలా? లేదా అన్నదానిపై జిల్లా కమిటీ నిర్ణయం తీసుకోవలి. అంతే తప్ప రైతుల వాదన వినకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదు.

నిషేధ భూముల తొలగింపు, జాబితాను తాజా పరిచే అంశంపై జిల్లా కమిటీ తీసుకునే నిర్ణయాలను ఎప్పటికప్పుడు జిల్లా రిజిస్ట్రార్‌కు తెలపాలి.

ఏదైనా భూమిని పొరపాటుగా నిషేధ జాబితాలో చేర్చినట్లు గుర్తిస్తే దాన్ని 22(ఏ) నుంచి తొలగించడానికి జిల్లా కమిటీ సీసీఎల్ఏ ద్వారా ప్రభుత్వానికి నివేదించాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను బట్టి జాయింట్ కలెక్టర్ లాగిన్ ద్వారా వెబ్‌ల్యాండ్‌లో తగిన మార్పులు చేపట్టాలి అని రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ సిసోడియా స్పష్టం చేశారు. అయితే, ఏ ఏ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలో లోగడ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు, మార్గదర్శకాలను ఉటంకిస్తూ వాటిపై నిర్ణయం జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని స్పష్టం చేశారు.



పుట్టపర్తి మండలంలోని జగ్‌రాజుపల్లెలో భూముల రీ సర్వే పనులను పరిశీలిస్తున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

వీటికి విముక్తి కల్పించాల్సిందే...

రాష్ట్రంలో 1954, జూన్ 18కి ముందు అసైన్ చేసిన భూములను 22(ఏ) నుంచి తొలగించాలని 2018, నవంబరు 16న ప్రభుత్వం ఇచ్చిన జీవో 575ను కలెక్టర్లు అమలుచేయాలి. అంటే, ఆ కేటగిరీలోకి వచ్చే భూములను సాధారణంగానే నిషేధ జాబితా నుంచి తొలగించాలి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్లకు రిపోర్టు ఇవ్వాలి.

రైతులకు హక్కులు దక్కిన చుక్కల భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలి. 2022, మార్చి 23న ప్రభుత్వం ఇచ్చిన మెమో ఆధారంగా రైతులకు హక్కులు ఉన్న చుక్కల భూములను 22(ఏ) నుంచి తొలగించాలి.

రాష్ట్రంలో 1954, జూన్ 18కి ముందు అసైన్ చేసిన అనాధీన భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలంటూ 2022, సెప్టెంబరు 26న ప్రభుత్వం ఇచ్చిన జీవో 649ను అమలు చేయాలి. ఈ కేటగిరీలోకి వచ్చే అనాధీనం భూములను నిషేధ జాబితా నుంచి జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ తొలగించాలి.

1954కు ముందు ఇచ్చిన షరతుగల పట్టా భూములను కూడా నిషేధ జాబితా నుంచి తొలగించాలి.

ఇంటిస్థలాలు కూడా...

ప్రభుత్వం ప్రజల నివాసం కోసం హౌసింగ్ బోర్డు కాలనీలు ఏర్పాటు చేసింది. ఇందుకోసం భూములు కేటాయించింది. ఆ తర్వాత వాటిని ప్రజలకు విక్రయించారు. అయితే, కాలక్రమేనా ఆ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలి. కానీ ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు స్థలాలు, నివాస భూములను నిషేధ జాబితాలో కొనసాగిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అన్నమయ్య, పుట్టపర్తి తదితర జిల్లాల్లో ఈ సమస్య చాలా తీవ్రంగా ఉంది. రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ సిసోడియా జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు దీనిపై భారీగా పిటిషన్‌లు వస్తున్నాయి. ఇంటిస్థలాలు, హౌసింగ్‌బోర్డు భూములను ఇంకా నిషేధ జాబితాలో కొనసాగిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి, ఈ నేపథ్యంలో అలాంటి భూములను 22(ఏ) నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌లను ఆదేశించినట్లు సిసోడియా 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. "ప్రభుత్వం హౌసింగ్ బోర్డులకు ఇంటిస్థలాలు ఇచ్చింది. వాటిని ప్రజలు కొనుక్కున్నారు. ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఆ భూములు ఇంకా 22(ఏ)లో ఉంచడం సరైంది. కాదు. ఆ రికార్డులను మార్చాలి. ఆ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌లకు ఆదేశాలు ఇచ్చాం" అన్నారు. ప్రజల సాగుభూములు, ఇంటిస్థలాలు ఏ కారణంతోనైనా నిషేధ జాబితాలో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు.

కొందరిపైనే వివక్ష!

- ఒకే తప్పునకు ఇద్దరికి వార్నింగ్, బదిలీ, సస్పెన్షన్
- మిగిలినవారికి హెచ్చరికతో సరిపెట్టిన అధికారులు
- విశాఖ సెంట్రల్ జైల్లో ఖైదీ ఆత్మహత్య ఘటనపై రచ్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

యూనిఫాం సర్వీసుల్లో పనిచేసే ఉద్యోగులు క్రమశిక్షణ తప్పితే ఆ శాఖ మాన్యువల్ లేదా విధివిధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. కానీ జైళ్ల శాఖలో ఒకే తప్పునకు సంబంధించి ఉన్నతాధికారుల హెచ్చరికలు ఎదుర్కొన్న వారిలో కొందరికే చార్జిమెమోలు జారీ చేయడం వివాదమవుతోంది. రాష్ట్ర జైళ్లశాఖలో ఘటనలు తరచూ వివాదాస్పదంగా మారుతున్నాయి. విశాఖలో గంజాయి కలకలం, సిబ్బంది ఆందోళన.. రాజమహేంద్రవరంలో ఖైదీపై అధికారి దాడి, గన్ ఫైరింగ్.. నెల్లూరులో ఖైదీల బంధువులను డబ్బులు అడిగిన సూపరింటెండెంట్ ఆడియో.. కడప జైలు అధికారులపై పులివెందులలో కేసు నమోదు.. తదితర ఘటనలు జైళ్ల శాఖ పరువును రోడ్డున పడేశాయి. ఉన్నతస్థాయి అధికారుల గ్రూపు రాజకీయాలు, సిబ్బంది వర్గాలుగా విడిపోవడం, రెండేళ్లుగా జైళ్ల శాఖకు పూర్తిస్థాయి డీజీ లేకపోవడం దీనికి కారణాలుగా తెలుస్తోంది. తాజాగా ఒక ఖైదీ ఆత్మహత్య ఘటనలో అధికారుల చర్యలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. విశాఖపట్నం సెంట్రల్ జైలులో గతేడాది జూలై 30న ఉప్పాడ గౌరీశంకర్ అనే ఖైదీ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ప్రాథమిక విచారణ చేసిన జైళ్లశాఖ ఉన్నతాధికారులు.. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పలువురికి రాతపూర్వకంగా హెచ్చరికలు జారీ చేశారు. జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌ను అనంతపురం, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు బదిలీ చేశారు. విశాఖలో ఉంటున్న తన కుటుంబాన్ని నెల్లూరు తీసుకొచ్చేందుకు అనుమతివ్వాలని వెంకటేశ్వర్లు కోరగా.. 'వైజాగ్ వెళ్తే అక్కడ ట్యాంపరింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది.. వెళ్లడానికి వీల్లేదు' అంటూ ఆశ్చర్యకరమైన కారణం చూపి నిరాకరించారు. కంటి ఆపరేషన్‌కు విశాఖలో వైద్యులు సమయం ఇచ్చారని ఆ తేదీకి వెళ్లాలని కిశోర్‌కుమార్ విన్నవించుకుంటే తిరస్కరించారు. అంతటితో ఆగకుండా ఆ ఇద్దరినీ సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో వీరిద్దరూ 25 ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ 1998 నుంచి 2024 వరకూ పలు సందర్భాల్లో ఇచ్చిన మెమోలు చూపించి వారిపై వేటేశారు. అయితే ఇదే తరహా ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ గతంలో వార్నింగ్ ఇచ్చిన ఏడుగురి గురించి మాత్రం అధికారులు నోరెత్తడం లేదు. అందులో కొందరు విశాఖలోనే పని చేస్తున్నారు. వారెవరూ టాంపరింగ్‌కు పాల్పడరా.? అనే ప్రశ్న సిబ్బంది వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది.

వివాదాల అధికారి వల్లే..

జైళ్లలో ఖైదీలను చిత్రహింసలు పెట్టడం.. నోరెత్తిన సిబ్బందిపై వేటువేయడం లాంటి వివాదాల్లో తరచూ వినిపించే ఒక అధికారి పేరు ఈ వ్యవహారంలోనూ గట్టిగా వినిపిస్తోంది. కొందరిపై వివక్ష.. మరికొందరిపై ఆపేక్ష.. చూపిస్తూ ఆయన ఇచ్చిన తప్పుడు సిఫారసులతో ఉన్నతాధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడటం అన్యాయమని సిబ్బంది అంటున్నారు. అధికారుల మెమోలు సూచన లేగాని, చర్య తీసుకునే స్థాయిలో ఉండవని అంటున్నారు. నచ్చినవారికి వత్తాసు పలకడం, నచ్చనివారిపై చర్యలు తీసుకోవడం సరికాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

జోన్లవారీగా భోజనం మెనూ

- వేసవి సెలవుల వరకు పాఠశాలల్లో ట్రయల్ రన్
- ప్రాంతీయ ఆహార అలవాట్లకు ప్రాధాన్యం
- ఫీడ్‌బ్యాక్ ఆధారంగా తదుపరి నిర్ణయం
- పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో ఇకపై మెనూ జోన్ల వారీగా అమలుచేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వేసవి సెలవుల వరకు ట్రయల్ రన్ అమలుచేస్తారు. చివర్లో అభిప్రాయాలు సేకరించి మార్పులపై నిర్ణయం తీసుకుంటారు. జోన్ 1లో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలు, జోన్ 2లో ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు, జోన్ 3లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, జోన్ 4లో ఉమ్మడి రాయలసీమ జిల్లాలు ఉంటాయి.

జోన్-1: సోమవారం- అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ; మంగళవారం-అన్నం, గుడ్డు కూర, రసం, రాగిజావ; బుధవారం- వెజ్ పలావు, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ; గురువారం- అన్నం, సాంబారు, గుడ్డు కూర, రాగిజావ; శుక్రవారం- పులిహోర, చట్నీ, ఉడికించిన గుడ్డు, చిక్కీ; శనివారం- అన్నం, కూరగాయల కూర, రసం, రాగి జావ, స్వీట్ పొంగలి.

జోన్-2: సోమవారం-అన్నం, కూరగాయలు లేదా ఆకుకూర పప్పు, ఫ్రైడ్ ఎగ్, చిక్కీ; మంగళవారం- పులిహోరా, ఉడికించిన గుడ్డు, చట్నీ, రాగిజావ; బుధవారం- అన్నం, మిక్స్‌డ్ వెజిటబుల్ కూర, ఫ్రైడ్ ఎగ్, చిక్కీ; గురువారం- కూరగాయల అన్నం లేదా వెజ్ పలావు, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, రాగిజావ; శుక్రవారం- అన్నం, ఆకుకూర పప్పు, ఫ్రైడ్ ఎగ్, చిక్కీ; శనివారం- అన్నం, మిక్స్‌డ్ వెజిటబుల్ కూర, స్వీట్ పొంగలి, రాగి జావ.

జోన్-3: సోమవారం- అన్నం, సాంబారు, ఎగ్ ఫ్రై, చిక్కీ; మంగళవారం- పులిహోరా, టమాటా లేదా పుదీనా చట్నీ, ఫ్రైడ్ ఎగ్, రాగి జావ; బుధవారం- అన్నం, మిక్స్‌డ్ వెజిటబుల్ కూర, ఎగ్ ఫ్రై, చిక్కీ; గురువారం- వెజిటబుల్ అన్నం లేదా పలావు, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, రాగి జావ; శుక్రవారం- అన్నం, గుడ్డు కూర, చిక్కీ; శనివారం- అన్నం, టమాటా పప్పు లేదా పప్పుచారు, స్వీట్ పొంగలి, రాగి జావ.

జోన్- 4: సోమవారం- అన్నం, వెజిటబుల్ కర్రీ, గుడ్డు, చిక్కీ; మంగళవారం- పులగం లేదా పులిహోర, వేరుశెనగ చట్నీ, ఉప్పుకారంతో గుడ్డు, రాగిజావ; బుధవారం- అన్నం, సాంబారు, గుడ్డు, చిక్కీ; గురువారం- వెజిటబుల్ రైస్, గుడ్డు కూర, రాగిజావ; శుక్రవారం- అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ; శనివారం- అన్నం, కందిపప్పుచారు, బెల్లం పొంగలి, రాగి జావ.



విద్యా శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి లోకేశ్

పాఠశాలల్లో మెంటార్ వ్యవస్థ

- పూర్వ విద్యార్థులు, స్కూళ్ల అభివృద్ధి కాంక్షించే వారితో ఏర్పాటు
- బడులు తెరిచే నాటికే విద్యార్థులకు కిట్లు
- టీచర్లకు ఇకపై ఒకటే యాప్: మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు, పాఠశాలల అభివృద్ధిని కాంక్షించే వారితో పాఠశాలల్లో మెంటార్ల వ్యవస్థను రూపొందించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూప్రింట్‌లో భాగంగా ఆ వ్యవస్థను తీసుకురావాలన్నారు. పాఠశాల విద్యాశాఖపై గురువారం ఉండవల్లిలోని నివాసంలో అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్షించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు విద్యార్థులకు అందాలన్నారు. టీచర్లకు ఇకపై ఒకే యాప్ ఉండాలన్నారు. టీచర్ల బోధన, హాజరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. పెద్ద పాఠశాలల్లో ఎస్టేట్ మేనేజర్ల వ్యవస్థను ప్రవేశపెట్టాలన్నారు. పాఠశాల విద్యాశాఖ అన్ని అంశాలను ఏకీకృతం చేసేలా ఒకే డ్యాష్‌బోర్డు రూపొందించాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు క్రమంగా తగ్గే చర్యలు తీసుకోవాలన్నారు.

కరెంట్ చార్జీల పెంపు లేదు

(మొదటి పేజీ తరువాయి)

భారం మోపడం లేదని వెల్లడించారు. గురువారం కర్నూలు నగర శివారులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కమిషన్ సభ్యుడు పి.వెంకట్రామరెడ్డితో కలిసి 2025-26 ఆర్థిక సంవత్సర విద్యుత్ చార్జీల టారిఫ్‌ను ఆయన విడుదల చేశారు. విద్యుత్ చార్జీల అంశంపై ఇటీవల సేకరించిన ప్రజాభిప్రాయాన్ని అధ్యయనం చేశాక డిస్కమ్‌ల ఆదాయాలను, ఖర్చులను మదింపు చేశామని ఈ సందర్భంగా చెప్పారు. విద్యుత్ శాఖలోని ఏ విభాగంలోనూ చార్జీలు పెంచడం లేదన్నారు. డిస్కమ్‌లు ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ వార్షిక వ్యయ అంచనాను రూ.58,868 కోట్లుగా ప్రతిపాదించగా.. కమిషన్ రూ.57,544.17 కోట్లకు ఆమోదం తెలిపిందన్నారు. 'మూడు డిస్కమ్‌ల ద్వారా రూ.44,323 కోట్లు ఆదాయం వస్తుంది. వ్యయ అంచనాలు, రాబడికి మధ్య రూ.12,632 కోట్ల వ్యత్యాసం ఉంది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. వ్యవసాయ వినియోగం, ఉద్యానవన నర్సరీలు, ఆక్వాకల్చర్ రైతులకు, దోబీలు, ఎస్సీ, ఎస్టీలు తదితరులకు రాష్ట్రప్రభుత్వ ఉచిత విద్యుత్/రాయితీలు కొనసాగుతాయి. స్వల్పకాలిక విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ప్రథమంగా గంటల వారీగా సమీక్ష చేపట్టే వీలు కల్పిస్తూ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తద్వారా ప్రతి గంటకూ అవసరం మేరకు కరెంటు కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించింది. ఏపీ జెన్కో పూర్తి ఉత్పత్తి సామర్థ్యం పెంచడం, ఆయా డిస్కమ్‌లు ఇతర సంస్థలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యంగా బొగ్గు సేకరణకు అనుమతి ఇచ్చాం. ఏప్రిల్ 1 నుంచి కొత్తగా లేదా పునర్నిర్మించుకునే ఇళ్లకు గతంలో మాదిరిగా కేటగిరీ-2 (వాణిజ్యం) కింద కాకుండా కేటగిరీ-1 (గృహ వినియోగం) కింద బిల్లు ఇస్తాం. తద్వారా వినియోగదారులపై ఆర్థిక భారం తగ్గుతుంది. 150 కేవీ సామర్థ్యం కలిగిన ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ఎల్‌టీ వోల్టేజ్ స్థాయి విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలకు యూనిట్ చార్జింగ్ వసూలు ధరను రూ.6.70గా నిర్ణయించాం' అని తెలిపారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా గృహ వినియోగదారులు 50 శాతం డెవలప్‌మెంట్ (అభివృద్ధి) చార్జీలు మాత్రమే చెల్లించి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ పథకం మార్చి 1 నుంచి జూన్ 30 వరకు ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా స్వచ్ఛందంగా అదనపు లోడ్‌ను ప్రకటించవచ్చని తెలిపారు. పథకం అమలు తీరుపై నెలనెలా పురోగతి నివేదికలను కమిషన్‌కు అందించాలని ఆదేశించారు. గ్రీన్‌ఎనర్జీ వినియోగంలో ప్రతి వినియోగదారుడినీ భాగస్వామిగా చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వాస్తవానికి మార్చి 31లోపు టారిఫ్ విడుదల చేయాల్సి ఉన్నా.. ముందుగానే విడుదల చేస్తున్నట్లు ఇన్‌చార్జి చైర్మన్ తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రుల్లో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదు

- వైద్యులు, సిబ్బందిపై వేటు తప్పదు: వాసంశెట్టి సుభాష్




అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఉచితంగా ఉత్తమ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటు జరిగిందని, అటువంటి లక్ష్యానికి విఘాతం కల్పించే వైద్యులు, సిబ్బందిని ఉపేక్షించబోమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. రాజమండ్రిలో విధుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని స్వయంగా గమనించిన తర్వాతే ఐదుగురు వైద్యులను, నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 78 డిస్పెన్సరీలకు అదనంగా మరో 18 డిస్పెన్సరీలను మంజూరు చేస్తామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఈఎస్ఐ డిస్పెన్సరీ పెట్టే యోచనలో తమ ప్రభుత్వం ఉందన్నారు. కొత్తగా 30 ఈఎస్ఐ డిస్పెన్సరీలను నిర్మించాలని భావిస్తున్నామన్నారు. కొన్ని ఈఎస్ఐ ఆసుపత్రుల్లో ల్యాబ్ పరికరాల కొరత ఉన్నమాట వాస్తవమేనన్నారు. అమరావతిలో 500 పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆసుపత్రితోపాటు ఈఎస్ఐ మెడికల్ కళాశాలను, 150 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కు పంపామన్నారు. తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచే చర్యలు చేపట్టామన్నారు. విశాఖ ఫార్మాసిటీలో మొబైల్ ఐసీ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జగన్‌కు లండన్ మందులు వికటించాయి

వైసీపీ నేతలు తప్పులు చేసినా.. 'నేనున్నాను' అనే భరోసాను జగన్ ఇస్తున్నారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. అధికారుల బట్టలు విప్పుతానంటూ వ్యాఖ్యలు చేయడం జగన్ మానసిక స్థితిని సూచిస్తోందని, జగన్‌కు మంచి వైద్యం చేయించాలని ఆయన సతీమణి భారతిని కోరుతున్నామన్నారు. జగన్ మానసిక స్థితి చూస్తుంటే లండన్ మందులు వికటించాయేమో అనిపిస్తోందన్నారు. వైసీపీ నేతలకు ప్రజా సమస్యలు పట్టడంలేదని, అందుకే వారంతా జైళ్లకు వెళ్తున్నారని విమర్శించారు.

మైనార్టీల సంక్షేమానికి 600 కోట్లు ఇవ్వండి

- కేంద్రమంత్రికి రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ లేఖ



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల సామాజిక ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చడానికి రాష్ట్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు కేంద్రం వాటా కింద రూ.600 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. ఈమేరకు గురువారం కేంద్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కిరణ్ రిజిజుకు లేఖ రాశారు. పీఎంజేవీకే కింద 2025-2026లో మైనార్టీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కొత్త ప్రాజెక్టులపై దృష్టి సారించడంలో భాగంగా వెయ్యి కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామని, అందులో విజయవాడ, గుంటూరు, నంద్యాల, విశాఖపట్నం, కడప, నెల్లూరుల్లో స్పోర్ట్స్ సెంటర్ల నిర్మాణం, 6 జిల్లా కేంద్రాల్లో మినీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, గుంటూరు, నంద్యాల ఆటోనగర్‌ల అభివృద్ధి, మసీదులు, దర్గాలు, చర్చిలు, జైన్ దేవాలయాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, నంద్యాల, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణం తదితర ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు.

పారదర్శకంగా దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్: కొండపల్లి



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ఎంతో పారదర్శకంగా జరుగుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల దివ్యాంగుల పింఛన్లు ఉండగా.. ఇప్పటివరకూ 1.20 లక్షల పింఛన్ల వెరిఫికేషన్ పూర్తయ్యిందన్నారు. గతంలో ఉన్న నిబంధనల ప్రకారమే వెరిఫికేషన్ జరుగుతోందని, అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదన్నారు. ఎంఎస్ఎంఈల సర్వే 50 శాతం సర్వే పూర్తయ్యిందని, మార్చి 15 కల్లా పూర్తవుతుందని తెలిపారు.

మాయా మశ్చీంద్రను మించినోడు జగన్

- 'వెలిగొండ' 30% శాతం మాత్రమే పూర్తయింది
- దానిని ప్రారంభించి, జాతికి అంకితం చేసేశారు: నిమ్మల



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'వెలిగొండ పనులు పూర్తికాకుండానే ప్రాజెక్టును జగన్ జాతికి అంకితం చేశారు. వాస్తవానికి ఆ ప్రాజెక్టు పూర్తి కావడానికి రూ.4,000 కోట్లు నిధులు, రెండేళ్ల సమయం పడుతుంది. మాయా మశ్చీంద్రకు కూడా సాధ్యం కానంతగా... జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేశారు' అని మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పనులను పూర్తి చేయకుండానే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి, జాతికి అంకితం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుంది. నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మందికి తాగు నీరు అందించే ప్రాజెక్టు ప్రధాన పనులు పూర్తి చేయలేదు. శ్రీశైలం వద్దనున్న హెడ్ రెగ్యులేటర్, రిటైనింగ్ వాల్ పనులు, మొదటి, రెండవ సొరంగం పనులను, ఫీడర్ కెనాల్ పనులను, నిర్వాసితుల కాలనీల నిర్మాణ పనులు చేయకుండానే వెలిగొండ ప్రాజెక్టును జాతికి ఎలా అంకితం చేశారో జగనే చెప్పాలి' అని మంత్రి నిమ్మల అన్నారు. ఈ క్రమంలో పెండింగ్‌లో ఉన్న పనుల జాబితాను చెపుతూ, ఒక్కో పనికి పట్టే కాలాన్ని ఆయన వివరించారు.

మార్చి 5న జీఆర్‌ఎంబీ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5న జీఆర్‌ఎంబీ చైర్మన్ ఏ కే ప్రధాన్ అధ్యక్షతన గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్‌ఎంబీ) సమావేశం జరగనుంది. హైదరాబాద్‌లోని జలసౌధలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని సభ్య కార్యదర్శి రంగసామి అజగేశన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు గురువారం సమాచారం పంపారు.

రైతుల గురించి మాట్లాడే నైతికత జగన్‌కు లేదు

వైసీపీ అధినేతపై టీడీపీ విమర్శలు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లడం, ప్రభుత్వంపై విషం చిమ్మడాన్ని టీడీపీ నేతలు తీవ్రంగా విమర్శించారు. మంత్రులు సవిత, కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ సుజయకృష్ణ రంగారావు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి సవిత మాట్లాడుతూ... రైతన్నల గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్ రెడ్డికి లేదు. రెండు రోజులు ఏపీకి వచ్చి అల్లర్లు సృష్టించి తిరిగి బెంగళూరు వెళ్లి పబ్జీ ఆడుకోవడం జగన్‌కు అలవాటుగా మారింది. అరాచకవాదిని పరామర్శించేందుకు మరో అరాచకవాది వెళ్లారు. జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలి' అని సవాల్ విసిరారు. సుజయకృష్ణ మాట్లాడుతూ... 'వంశీపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటే శాశ్వతంగా ఆయన జైల్లోనే ఉంటాడు. వైసీపీ హయాంలో అక్రమాలు, అవినీతిపై విచారణ జరుగుతోంది. వైసీపీలో ఉన్న 90శాతం మంది నాయకులు జైలుకు వెళ్లడం ఖాయం' అన్నారు. ప్రజల్లో సానుభూతి కోసం జగన్ డ్రామాలాడుతున్నారన్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

వెళ్లడమే తప్పు... పైగా భద్రత కావాలా..!: మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్, రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గుంటూరు మిర్చి యార్డుకు మాజీ సీఎం జగన్ తదితరులు వెళ్లడాన్ని మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు తప్పుపట్టారు. 'మాజీ సీఎం జగన్ నిబంధనలు అతిక్రమించి మిర్చి యార్డు వద్దకు వెళ్లారు. సెక్యూరిటీ కల్పించలేదంటూ పోలీసు అధికారులను తిట్టడం ఆశ్చర్యంగా ఉంది. ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసం అసెంబ్లీకి రాకుండా జగన్‌రెడ్డి పారిపోయి జైళ్ల చుట్టూ తిరుగుతున్నారు' అని కొల్లు ఎద్దేవా చేశారు. మిర్చియార్డులో పరామర్శల పేరుతో జగన్ చేసింది దండయాత్ర అని రామానాయుడు అన్నారు.

జగన్ మహా ముదురు.. మతి భ్రమించలేదు

- జైలు పక్షి తాటాకు చప్పుళ్లకు భయపడం: విప్ ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు మతి భ్రమించలేదు. ఆయన మహా ముదురు. ఇకపై జగన్ ప్రతి రోజూ కోర్టుకు హాజరుకావాల్సి ఉంటుంది. గతంలో మాదిరి ప్రతి శుక్రవారం ఏదో ఒక సాకుతో తప్పించుకునేందుకు వీల్లేదు' అని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అందరినీ జైలుకు పంపుతానంటున్న జగన్‌పై సీబీఐ, ఈడీ వద్ద ఎన్ని కేసులున్నాయో అందరికీ తెలుసు. త్వరలో విచారణ పూర్తవుతుంది. ఇకపై జగన్ జైలు పక్షే' అని చదిపిరాళ్ల అన్నారు.

పులివెందుల సమస్యల కోసం జగన్‌కు సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పిస్తా: బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ తన నియోజకవర్గం పులివెందుల సమస్యల పరిష్కారం కోసం సీఎం వద్దకు వస్తానంటే చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇప్పిస్తా' అని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. వేంపల్లెలోని గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేసిన బీటెక్ రవి అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'ఎన్నో ఏళ్ల నుంచి ఓట్లు వేసి గెలిపించిన పులివెందుల ప్రజలంటే మాజీ సీఎం జగన్‌కు ఏమాత్రం ప్రేమ లేదు. అక్కడ ఎన్నో సమస్యలున్నాయి. వీటిని పరిష్కరించాల్సిన బాధ్యత పులివెందుల ఎమ్మెల్యేగా జగన్‌కు ఉంది. ఆయన అసెంబ్లీకి పోకపోవడం వల్ల పులివెందులకు ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంది. ఉప ఎన్నికల్లో మళ్లీ జగన్ నిలబడ్డా గెలిచి అసెంబ్లీకి వెళ్లేది లేదు' అని బీటెక్ రవి అన్నారు.

వైసీపీ హయాంలో మిర్చి యార్డును దోచేశారు

- యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు మిర్చి యార్డును దోచేశారని యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఆరోపించారు. 'మిర్చి రైతులను నట్టేట ముంచిన రైతు ద్రోహి జగన్. యార్డులో జరిగిన సుమారు రూ.2 వేల కోట్ల అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఇక్కడ జరిగే లావాదేవీలపై వ్యాపారులు 1 శాతం సెస్సు చెల్లించడంతోపాటు జీఎస్టీ చెల్లిస్తారు. వాటిద్వారా ఐదేళ్లలో రూ.3 వేల కోట్లు రావాల్సి ఉంటే సగమే జమ అయింది. లైసెన్సుల రెన్యువల్‌లోనూ అవినీతికి పాల్పడ్డారు. రైతుల పొట్టకొట్టి వేల కోట్లు దోచేసిన జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు' అని సుబ్బారావు విమర్శించారు.

ఉద్యోగాల పేరుతో 7 కోట్లు వసూలు

- మా డబ్బులు మాకు ఇప్పించాలని టీడీపీకి నిరుద్యోగుల మొర

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'కొచ్చెర్ల ధర్మారెడ్డి అనే వ్యక్తి ఇటలీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన మా వద్ద సుమారు రూ.7 కోట్లు వరకూ వసూలు చేశాడు. మమ్మల్ని నిలువునా ముంచేశాడు. మా డబ్బులు మాకు ఇప్పించండి' అంటూ ఆ జిల్లాలకు చెందిన పలువురు నిరుద్యోగులు వాపోయారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన ప్రజావినతుల కార్యక్రమం జరిగింది. పై నాలుగు జిల్లాలకు చెందిన పలువురు యువకులు మంత్రి సవిత, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ సుజయ కృష్ణరంగారావుకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు బాధితులు తరలివచ్చి వినతులు సమర్పించారు.

సజ్జల భూములపై ప్రారంభమైన సర్వే

కడప, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల మేరకు కడప నగర శివారులోని సీకేదిన్నె మండలంలో వివిధ సర్వే నంబర్లలో వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబం ఆక్రమణలో ఉన్న భూములపై గురువారం సర్వే ప్రారంభించారు. అటవీ భూములను ఆక్రమించి తమ భూముల్లో కలిపేసుకుని సజ్జల ఎస్టేట్ ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ఏబీఎన్ వెలుగులోకి తెచ్చింది. ఇక్కడ మొత్తం 180 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో 52 ఎకరాలు అటవీశాఖ భూములని రెవెన్యూ అధికారులు గతంలోనే నిర్ధారించారు. దీనిపై సజ్జల కుటుంబీకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రెవెన్యూ, ఫారెస్టు సర్వే బృందాలతో కమిటీ ఏర్పాటుచేసి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు లావు, కలిశెట్టి, సానా తదితరులు





ఢిల్లీలో రైతులకు మద్దతు ధర, పోలవరం ప్రాజెక్టుపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, తదితరులు (ఇన్‌సెట్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్)

రైతన్నపై ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీకి వచ్చినా రాష్ట్రం కోసం కాకుండా.. ఏవో సొంత పనుల మీద వచ్చి.. కలవాల్సిన వారిని గుట్టుగా కలిసేసి వెనుదిరిగేవారని ఢిల్లీ వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి. చంద్రబాబు శైలి ఇందుకు పూర్తి భిన్నం. ఢిల్లీకి ఎప్పుడు వచ్చినా, రాష్ట్రానికి ఏం తీసుకెళ్లాలన్న తపనే ఆయనలో కనిపిస్తోందని ఈ వర్గాలు చెబుతున్నాయి. గురువారం వరుసగా ఇద్దరు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలిశారు. కేంద్ర మంత్రి చౌహాన్‌ను వర్చువల్‌గా కలిసి రైతుల సమస్యలను చర్చించారు. ఉత్తరాంధ్ర మైనర్ ఇరిగేషన్, పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో మాట్లాడారు. 'అభివృద్ధిలో గుజరాత్ మాకు ఆదర్శం. మీ రాష్ట్రంతో మమ్మల్ని పోటీ పడనివ్వండి' అంటూ పాటిల్ వద్ద సరదాగా వ్యాఖ్యానించారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్ ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి లాంటిదని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం రైతులు ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి వాజపేయితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మిర్చి ధరలు పడిపోవడంపై కేంద్రంతో చర్చించినట్లు చంద్రబాబు వివరించారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి రేట్లు పడిపోయాయన్నారు. గతంలో అంతర్జాతీయ మార్కెట్ బాగుండటంతో మిర్చి రైతులకు మంచి ధర లభించిందని తెలిపారు. ధరల పతనంపై సమీక్షిస్తానని కేంద్ర మంత్రి చౌహాన్ హామీ ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది 12 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి సేకరించాల్సి ఉండగా, ఇప్పటికే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చిందని వివరించారు. "మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 25 శాతం మాత్రమే ఇస్తారు. సాగు ఖర్చులను లెక్కలు వేసి ధరలు నిర్ణయించాలి. అవన్నీ సరిచేయాలని కేంద్ర మంత్రిని కోరాం. దీనిపై శుక్రవారం సమావేశమై చర్చించిన తర్వాత స్పష్టత ఇస్తామని కేంద్రమంత్రి చెప్పారు. ఏ విధంగానైనా రైతులను ఆదుకోవడమే కావాలి. శనివారం వ్యాపారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి ధరల పతనానికి కారణాలు తెలుసుకుంటాను" అని సీఎం తెలిపారు.

జల్‌జీవన్ పనులకు రూ.27వేల కోట్లు

జల్‌జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టుపై జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించినట్టు చంద్రబాబు తెలిపారు. "నదుల అనుసంధానంపై చర్చించాం. పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం కోరాం. దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రతినిధులు త్వరలో ఏపీకి వస్తారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికీ సురక్షిత నీటిని అందించే జల్‌జీవన్‌మిషన్‌ను వైసీపీ ప్రభుత్వం ఒక శాతం కూడా ఉపయోగించుకోలేకపోయింది. ఏపీకి రూ.27 వేల కోట్లను మంజూరు చేసినా పైపులైన్ల ద్వారా కాకుండా బోరు బావుల ద్వారా ఇస్తామనే పరిస్థితికి వచ్చింది. జల్‌జీవన్ నిబంధనలు కేంద్రం మార్చి 2028కి పనులు పూర్తిచేయాలని గడువు పెంచింది. దానిప్రకారం గతంలో కేటాయించిన రూ.27వేల కోట్లు మాత్రమే వస్తాయి. అన్ని ప్రాంతాల్లో కుళాయి ద్వారా నీరివ్వాలంటే అదనంగా రూ.54 వేల కోట్లు అవసరం. ఈ అంశంపై కేంద్రంతో మళ్లీ సంప్రదిస్తాం. ప్రస్తుతం రూ.27 వేల కోట్లకు డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రాన్ని నిధులు కోరతాం. ఒక ప్రభుత్వం అనుసరించే తప్పుడు విధానాలతో ప్రజలు ఏ విధంగా నష్టపోతారో తెలిపేందుకు జల్‌జీవన్ మిషన్ ఒక ఉదాహరణ. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఐదేళ్లా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది." అని చంద్రబాబు వివరించారు.

నీటి పంపిణీ సున్నితమైన అంశం..

కృష్ణా నీటి తరలింపు అంశం సున్నితమైన సమస్య అని, దానిపై రాజకీయం చేయడం తగదని సీఎం చంద్రబాబు సూచించారు. "నదులు ప్రవహించే వరుసలో చూస్తే ఏపీ చిట్టచివర ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నేను తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టులు పూర్తి చేసి తెలంగాణకు నీళ్లందించాం. ఇప్పుడు సముద్రంలోకి వెళ్లే నీరు ఉపయోగించుకోవాలని చూస్తున్నాం. వృదాగా సముద్రంలోకి పోయే నీటిని ఏపీ ఉపయోగించుకునే అవకాశం ఉంది. వాటినే వాడుకుంటున్నాం. కృష్ణా జలాల సమస్య ఉంది. ఇప్పటివరకు పాత విధానం ప్రకారమే ముందుకు వెళుతున్నాం. పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో రాజీ పడబోం. నీటి నిల్వసామర్థ్యం 45.72 మీటర్లు ఉంటుంది" అని సీఎం తెలిపారు. వంశీ అరెస్టుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, చట్టం తన పని తాను చేసుకుని పోతుందన్నారు. ఇందులో రాజకీయాలకు చోటు లేదన్నారు.

నేడు ఉన్నత స్థాయి సమావేశం

ఏపీలో మిర్చి ధరల పతనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన విజ్ఞప్తితో కేంద్రం రంగంలోకి దిగింది. 2024-25 సీజన్‌లో ఉత్పత్తి అయిన మిర్చి ధరలపై చర్చించేందుకు శుక్రవారం ఉదయం 11 గంటలకు న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేసింది. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రైస్(ఎంఐపీ) కింద ఏపీలో మిర్చి ధరల స్థిరీకరణపైనా, ఏపీ నుంచి మిర్చి ఎగుమతులను ప్రోత్సహించడంపైనా కీలకనిర్ణయాలు తీసుకోనున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్‌జనరల్, అపెడా చైర్మన్, వ్యవసాయ, ఉద్యానశాఖల ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

బాధ్యత ఉండొద్దా?

- కోడ్ ఉండగా మిర్చి యార్డుకు ఎలా వెళ్తారు?
- తన హయాంలో రైతులకు ఏమీ చేయని జగన్
- ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారు : చంద్రబాబు

ప్రజాసమస్యల పరిష్కారం కోసం రాజకీయాలను చేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏమీ చేయనివారు ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారంటూ మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా జగన్ బాధ్యత లేకుండా గుంటూరు మిర్చి యార్డులోకి వెళ్లారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. "వైసీపీ హయాంలో రైతులకు ఒక్క పైసా ఇవ్వలేదు. వారికోసం చేసిందేమీ లేదు. రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2019కి ముందు ధరలు తగ్గితే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.138 కోట్లు విడుదల చేసి మిర్చి రైతులను ఆదుకున్నాం" అని గుర్తుచేశారు. బుధవారం గుంటూరు మిర్చి యార్డును జగన్ సందర్శించిన సమయంలో జరిగిన ఘటనలపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం దేశంలోని రాజకీయ పార్టీలు నడుచుకుంటాయి. ఈసీ వెళ్లొద్దని చెప్పినా వినకుండా జగన్ మిర్చి యార్డుకు వెళ్లారు. తమ అక్రమ పనులకు భద్రత కల్పించాలని కోరడం సరికాదు. రాజకీయనేతలు ప్రజాస్వామ్యయుతంగా ప్రవర్తించాలేగానీ రౌడీయిజం చేస్తామనడం సరికాదు. చట్టవిరుద్ధ పనులకు భద్రత ఇవ్వడం ఎప్పుడన్నా చూశామా? మీరు చేసే చట్ట వ్యతిరేక పనులకు పోలీసులు రక్షణగా ఉండాలా? ఇది సరికాదు. ఇలాంటి రాజకీయ నాయకులను, పార్టీలను ఎప్పుడూ చూడలేదు." అని జగన్‌పై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "మిర్చి రైతుల సమస్యలపై సీఎం, మంత్రికి లేఖ రాయొచ్చు. గవర్నర్‌కు, కేంద్రానికి చెప్పొచ్చు. అసెంబ్లీలో మాట్లాడొచ్చు. ఆ పార్టీలు అవలంబించే తీరు ముఖ్యం. రైతుల మేలు కోసం ఎవరూ ఏం చెప్పినా వింటామ"ని సీఎం చంద్రబాబు తెలిపారు.

హైకోర్టులో వంశీకి షాక్

- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత
- పోలీస్ కస్టడీ పిటిషన్‌పై బెజవాడ కోర్టు తీర్పు నేడు

అమరావతి/విజయవాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి వ్యవహారంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వంశీ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ఉమ్మడి గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గత ఏడాది ఆగస్టులో వంశీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై నిర్ణయం వెల్లడించే వరకు వంశీకి అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం ఇటీవల తుది విచారణ జరిపింది. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. వంశీ వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని, దానిని కొట్టివేయాలని కోరారు. వంశీ తరఫున సీనియర్ న్యాయవాది పట్టాభి, న్యాయవాది దేవి సత్యశ్రీ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో నిర్ణయం వాయిదా వేసిన న్యాయస్థానం.. వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది.

కస్టడీ పిటిషన్‌పై తీర్పు నేడు

వల్లభనేని వంశీని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు శుక్రవారం తీర్పును వెలువరించనుంది. ఈ పిటిషన్‌పై వాదనలు గురువారం ముగిశాయి. వంశీ నుంచి కీలకమైన సమాచారం రాబట్టడానికి ఆయనను కస్టడీకి ఇవ్వాలని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్, ప్రాసిక్యూటర్ కల్యాణి వాదించారు. ఆయన నుంచి రికవరీ చేసుకోవలసిన వస్తువులు ఉన్నాయని వివరించారు. దీనికి లక్ష్మీపతి తరఫు న్యాయవాది తానికొండ చిరంజీవి అభ్యంతరం తెలిపారు. కాగా, వంశీ విషయంలో భద్రతాపరంగా జైలులో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని విజయవాడ జిల్లా జైలు సూపరింటెండెంట్ పాల్ హంస ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టుకు వివరించారు. ఆయన ఉన్న బ్యారక్‌లో కొత్తగా ఎటువంటి సీసీ కెమెరాలూ ఏర్పాటు చేయలేదని, ఇంతకుముందు ఏర్పాటు చేసినవే ఉన్నాయని స్పష్టం చేశారు. ఇంటి నుంచి భోజనం అనుమతించాలని, మంచం ఏర్పాటు చేయించాలని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో విచారణ జరిగింది. వంశీ తరఫు న్యాయవాదులు ఆయన ఆరోగ్య సమస్యలపై వైద్యులు ఇచ్చిన నివేదికను కోర్టు ముందు ఉంచారు. ఈ నివేదికలు పాతవని, వాటిని పరిశీలించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేనని జైలు అధికారి రోషన్ చెప్పారు. ఈ పిటిషన్‌పై తీర్పును శుక్రవారానికి రిజర్వ్ చేస్తున్నట్టు న్యాయాధికారి హిమబిందు వెల్లడించారు.

వంశీ కారులో సత్యవర్ధన్!

- వాంగ్మూలం ఇచ్చాక బెజవాడ నుంచి హైదరాబాద్‌కు
- 10వ తేదీ రాత్రంతా వల్లభనేని ఫ్లాట్‌లోనే
- ఆ మరుసటి రోజు రెండు కార్లలో విశాఖకు తరలింపు
- సీసీ కెమెరాల ఫుటేజీలను విశ్లేషిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్ ఈ కేసుతో తనకు సంబంధం లేదని వాంగ్మూలం ఇచ్చిన తర్వాత వంశీ స్వయంగా కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారా? ఆ రోజు వంశీ విజయవాడలో ఉన్నారా? సత్యవర్ధన్ తరలింపునకు క్రెటా కారును ఉపయోగించారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో తవ్వే కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నెల 10న సత్యవర్ధన్ విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో వాంగ్మూలం ఇచ్చి బయటకు రాగానే క్రెటా కారులో ఆయన్ను ఎక్కించినట్టు పోలీసులు భావిస్తున్నారు. వంశీని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన తర్వాత రెండు పోలీసు బృందాలు హైదరాబాద్‌లో గచ్చిబౌలిలోని మైహోం భూజాలో ఉన్న ఆయన ఫ్లాట్‌కు వెళ్లారు. అక్కడి నుంచి వివిధ సీసీ కెమెరాలను పరిశీలించి ఫుటేజీ తీసుకొచ్చారు. వాటిని ప్రస్తుతం సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషిస్తున్నారు. సత్యవర్ధన్‌ను డీల్ చేయడంలో వంశీ ప్రధాన అనుచరులు కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగా కీలకంగా వ్యవహరించారని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ప్రస్తుతం వారిద్దరూ పరారీలో ఉన్నారు. న్యాయాధికారి ముందు ఏం చెప్పాలో ముందుగానే సత్యవర్ధన్‌కు శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత కోర్టు వద్దకు కారులో తీసుకొచ్చారు. అతడు న్యాయాధికారి ముందు వాంగ్మూలం ఇచ్చిన తర్వాత బయటకు రాగానే కారులో ఎక్కించుకుని హైదరాబాద్‌కు తరలించినట్టు నిర్ధారించారు. ఈ కారులో సత్యవర్ధన్ ఉన్నాడని తేల్చిన పోలీసులు ఇంకా ఎవరెవరు ఉన్నారో కనుగొనే పనిలో పడ్డారు. ఈ కారులో వంశీతోపాటు హనుమాన్ జంక్షన్‌కు చెందిన ఎర్రంశెట్టి రామాంజనేయులు ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. 10న సాయంత్రం విజయవాడ నుంచి బయలుదేరిన వారు అర్ధరాత్రి 12 గంటలకు మైహోం భూజాకు చేరుకున్నట్టు సమాచారం. 11న అక్కడి నుంచి వంశీ ఒక కారులో, సత్యవర్ధన్‌తో ఆయన అనుచరులు మరో కారులో వైజాగ్‌కు బయలుదేరారు. ఖమ్మం మీదుగా అతడిని విశాఖపట్నం తరలించి వంశీకి పరిచయం ఉన్న చేబ్రోలు శ్రీనుకు అప్పగించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లేటప్పుడు కోదాడ మార్గం గుండా వెళ్లినట్టు సమాచారం.

మాజీ సీఎం జగన్‌కు రక్షణ కల్పించాలి

- గవర్నర్‌కు వైసీపీ నేతల వినతి

విజయవాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి భద్రత పట్ల మాకు ఆందోళనగా ఉంది. ఆయనకు రక్షణ కల్పించాలి' అని వైసీపీ నాయకులు గవర్నర్‌కు మొరపెట్టుకున్నారు. గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వారు ఆమేరకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వైసీపీ నేత బొత్స సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. 'జడ్ ప్లస్ సెక్యూరిటీలో ఉన్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గుంటూరులో బుధవారం మిర్చి యార్డు సందర్శనకు వెళ్లినపుడు జగన్‌కు భద్రత ఇవ్వవద్దని జిల్లా పోలీసులకు ముందే ప్రభుత్వం చెప్పింది. ఇది ప్రభుత్వం, పోలీసుల వైఫల్యమే' అని బొత్స అన్నారు.

బొత్స మాటలు..
దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'బొత్స సత్యనారాయణ మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. నమ్మి అధికారం ఇస్తే ఖాళీగా ఉన్నదెవరో... పనిచేయకుండా రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా దోచుకుతిన్నదెవరో రాష్ట్ర ప్రజానీకానికి తెలుసన్నారు. 'ఐదేళ్లు ఖాళీగా ఉండి ఎన్నికలకు ముందు సిద్ధం అంటూ బయటకు వచ్చారు. ప్రజలు మిమ్మల్ని 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారు. చివరికి ప్రతిపక్ష హోదా లేకుండా బుద్ధి చెప్పారు. అసెంబ్లీకి వెళ్లకపోతే వెంటనే రాజీనామా చేయాలి. ఇంట్లో కూర్చొని ప్రెస్ మీట్‌లు పెట్టడానికి కాదు ప్రజలు మీకు ఓట్లు వేసింది' అని షర్మిల అన్నారు.



ఇక బెంగాల్ వంతు!

- బిహార్, అసోంలోనూ మళ్లీ గెలుస్తాం.. ఎన్డీఏ నేతల కదనోత్సాహం
- ప్రధాని అధ్యక్షతన కూటమి పాలిత సీఎంలు, డిప్యూటీ సీఎంల భేటీ
- ఢిల్లీలో అసాధారణ విజయంపై మోదీకి చంద్రబాబు అభినందనలు
- రాత్రికి ఢిల్లీలోనే ఉండిపోవాలని కోరిన షా..మళ్లీ వస్తానని చెప్పిన బాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అసాధారణ విజయం తర్వాత తమ తదుపరి లక్ష్యం బెంగాల్ అని ఎన్డీఏ ప్రకటించింది. బెంగాల్‌తో పాటు రానున్న బిహార్, అసోం అసెంబ్లీ ఎన్నికల్లోనూ తిరిగి గెలుస్తామని ధీమా వ్యక్తంచేసింది. గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు మధ్యాహ్నం జనపథ్‌లోని ఇంపీరియల్ హోటల్లో ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారందరికీ విందు ఇచ్చారు. ఈ ఏడాది, వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కూడా ఎన్డీఏ మిత్రపక్షాలు కలిసికట్టుగా పోటీ చేయాలని నేతలంతా నిర్ణయించారు. సమైక్యంగా, బలంగా పోరాడాలని తీర్మానించినట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావడే విలేకరులకు తెలిపారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై ప్రధానికి నేతలంతా అభినందనలు తెలిపారన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను మోదీ ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో అసాధారణ విజయం సాధించారంటూ ఆయన్ను చంద్రబాబు అభినందించారు. విందు సమావేశం పిచ్చాపాటీగా జరిగిందని, దేశంలో జరుగుతున్న అన్ని విషయాల గురించీ మాట్లాడుకున్నామని సీఎం ఆ తర్వాత విలేకరులకు చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోనూ ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ రాత్రికి ఉండిపోవాలని షా కోరారు. తనకు ఇతరత్రా కార్యక్రమాలున్నందున మళ్లీ వస్తానని చంద్రబాబు ఆయనకు తెలిపారు. మోదీ, షాతో పాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

హిమాలయాలకు వెళ్తున్నారా?

- పవన్‌తో మోదీ చమత్కారం



ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కాషాయ వస్త్రాలతో చూసిన ప్రధాని మోదీ.. 'ఏం.. హిమాలయాలకు వెళ్తున్నారా' అని చమత్కరించారు. అదేం లేదని పవన్ నవ్వుతూ చెప్పారు. దానికంటే ముందు నెరవేర్చాల్సిన బాధ్యతలున్నాయని బదులిచ్చారు. మోదీతో తన సంభాషణ గురించి పవన్ విలేకరులకు చెప్పారు. ఆయన నాయకత్వంలో ఎన్డీఏ దేశమంతా విస్తరిస్తోందని, ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడం చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. ఎన్డీఏపై ప్రజల విశ్వాసం పెరుగుతోందనడానికి ఇది నిదర్శనమని తెలిపారు. ఢిల్లీ ఓటర్లకు చేరువయ్యేందుకు భారీఎత్తున సూక్ష్మప్రణాళికతో కూడిన ప్రచారాన్ని బీజేపీ నిర్వహించిన సంగతి తెలిసిందే. పలు ప్రాంతాల్లో చంద్రబాబు సహా ఎన్డీఏ నేతలను, ఎంపీలను ప్రచారానికి తీసుకొచ్చింది.



పోలీసుల అదుపులో పందేల రాయుళ్లు

సంక్రాంతి వెళ్లినా.. ఆగని కోడి పందేలు!

- 'తూర్పు'లోని పుల్లలపాడు అడవిలో జోరుగా జూదం
- పలు జిల్లాల నుంచి రాక.. లక్షల్లో పందేలు
- పోలీసుల మెరుపు దాడి.. 32 మంది అరెస్టు
- 6.02 లక్షల నగదు, 7 కార్లు స్వాధీనం

నల్లజర్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ వెళ్లినా.. కోడి పందేల జోరు తగ్గలేదు. సెల్‌ఫోన్ సందేశాల ఆధారంగా వారానికో ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు, కామరపుకోట, చింతలపూడి మండలాలకు చెందిన వ్యక్తులు వారాంతంలో పందేలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఫ్లడ్‌లైట్ల వెలుగులో మారుమూల ప్రాంతాల్లో రూ.లక్షల్లో పందేలు సాగుతున్నాయి. ఇదేవిధంగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు అటవీ ప్రాంతంలో పందేలు సాగుతున్న ప్రాంతంపై పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడి చేశారు. నల్లజర్ల సీఐ విజయశంకర్ ఆధ్వర్యంలో మెరుపుదాడి చేసి 32 మంది పందేల రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 6,02,110 నగదు, 28 సెల్‌ఫోన్లు, 7 కార్లు, ఒక బైక్, 2 పుంజులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు చిక్కిన వారిలో కడప, కర్నూలు, ఏలూరు, కాకినాడ, భీమవరం ప్రాంతాల వారు ఉన్నారు. వారిని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

వైద్యం అందక గిరిజన మహిళ మృతి

- డోలిలో స్వగ్రామానికి మృతదేహం



గ్రామానికి రోడ్డు లేక డోలిలో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్న బంధువులు

కుక్కునూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగానే ఉంది. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను మూడు రోజులు, మూడు ఆసుపత్రులకు తిప్పినా ప్రాణాలు దక్కలేదు. చివరికి గ్రామానికి రోడ్డు కూడా లేకపోవడంతో డోలీలో మృతదేహాన్ని తీసుకురావాల్సి వచ్చింది. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెదరావిగూడెం పంచాయతీలోని బండారిగూడెంలో ముచికి దేవమ్మ(45) అనారోగ్యం బారినపడింది. ఆమెను బంధువులు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు కిడ్నీకి సంబంధించిన వ్యాధి రావడంతో డయాలసిస్ చేయాల్సి వచ్చింది. దీంతో బంధువులు ఆమెను చింతూరు, అక్కడి నుంచి రంపచోడవరం, ఆతర్వాత రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ దేవమ్మ చనిపోయింది. అప్పటికే బంధువుల వద్ద ఉన్న డబ్బంతా ఖర్చయిపోయింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు వారి చేతిలో చిల్లిగవ్వ లేదు. దీంతో సీపీఐ మండల కార్యదర్శి ఖైసాక్షి వెంకటాచారిని ఆశ్రయించగా.. ఆయన సాయంతో మహాప్రస్థానం అంబులెన్స్‌లో గురువారం సాయంత్రం మృతదేహాన్ని వెంకటాపురం తీసుకొచ్చారు. అక్కడి నుంచి గ్రామానికి రోడ్డు లేకపోవడంతో డోలి ఏర్పాటుచేసి మృతదేహాన్ని సుమారు రెండున్నర కిలోమీటర్లు మోసుకువెళ్లి.. గ్రామానికి చేరుకున్నారు.

భళా...బాదంచెట్టు



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని మంగళం ట్రెండ్స్ పాఠశాలలోని బాదం చెట్టు ఇది. పాతికేళ్ల క్రితం చేతివృత్తుల శిక్షణా కేంద్రం కోసం ప్రభుత్వం వలయాకారంలో 15గదులతో రెండంతస్తుల భవనం నిర్మించింది.భవనం నడిబొడ్డున ఖాళీ స్థలంలో బాదం చెట్టు నాటారు. కాలక్రమంలో శిక్షణా కేంద్రాన్ని మూతబడగా నిరుపయోగంగా ఉన్న ఆ భవనాన్ని 2001లో జడ్పీ పాఠశాలకు అప్పగించారు. మరమ్మతులు చేపట్టారు. మధ్యలో పెరుగుతున్న బాదం చెట్టు చుట్టూ దిమ్మెకట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు దాన్ని సంరక్షిస్తూ రావడంతో ఆ చెట్టు ఏపుగా పెరిగింది. ఆ భవనం రెండో అంతస్తు మధ్య ఉన్న వలయాకారం ఖాళీస్థలం వరకు పూర్తిగా రెమ్మలు, ఆకులతో వ్యాపించింది. ఉపాధ్యాయులు అప్పుడప్పుడూ చెట్టుకింద కూర్చొని ధ్యానం చేసుకుంటున్నారు. విద్యార్థులు చదువుకుంటున్నారు.



ఐఏఎస్ దినేశ్ కుమార్‌ది రాజద్రోహం

ఆయన తీరుతో ఫైబర్‌నెట్‌కు రూ.వందల కోట్ల నష్టం: జీవీ రెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్‌నెట్‌ను దివాలా తీయించి మూసివేసేందుకు అధికారులు కుయుక్తులు పన్నుతున్నారేమోనని ఆ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ దినేశ్‌కుమార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతూ రాజద్రోహానికి పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. ఫైబర్‌నెట్ ఎండీగా బాధ్యతలు చేపట్టాక సంస్థ ప్రయోజనాలు కాపాడే నిర్ణయం ఒక్కటీ ఆయన తీసుకోలేదని ధ్వజమెత్తారు. ఏనుగులా ఉన్న ఫైబర్‌నెట్‌ను పీనుగగా చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిరంతరం ఫైబర్‌నెట్‌ను లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తుంటే ఎండీ దినేశ్ కుమార్ మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు పనిచేసే మరో ముగ్గురు సంస్థ నష్టపోయేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆ ముగ్గురు.. ఫైబర్ నెట్ చీఫ్ టెక్నాలజీ అధికారి పప్పు సత్యరామ భరద్వాజ్, బిజినెస్ హెడ్ గంధంశెట్టి సురేశ్, అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్‌ఖాన్‌లను తక్షణమే విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ముగ్గురు మరొక్క రోజు కూడా విధుల్లో ఉండడానికి వీల్లేదన్నారు. ఫైబర్‌నెట్‌లో గత యాజమాన్యం హయాంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తే దినేశ్ కుమార్.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సహకరించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై తాను జోక్యం చేసుకుని.. విజిలెన్స్ విచారణకు సహకరించకుంటే తీవ్ర చర్యలు తప్పవని సర్క్యులర్ ఇచ్చిన తర్వాత అధికారులు కొంత సహకరిస్తున్నారని చెప్పారు. ఎలాంటి పేమెంట్లూ చేయవద్దని విజిలెన్స్ సూచించిన తర్వాత కూడా రూ.60 కోట్లు ఎందుకు చెల్లించారని ప్రశ్నించారు. గత ఏడాది ఆగస్టులో దినేశ్ కుమార్ ఫైబర్‌నెట్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ ఒక్క కనెక్షన్ కూడా పెంచలేదని, పైగా ఉన్న కనెక్షన్లు కూడా పోయేలా సమస్యలు సృష్టిస్తున్నారని అన్నారు.. దినేశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టాక సంస్థకు జరిగిన నష్టాలపై సవివరమైన నివేదికను సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్‌లకు అందజేస్తానని చెప్పారు.

3 నెలల క్రితం తీసేసిన వారికి ఇంకా జీతాలు

తాను చైర్మన్‌గా వచ్చాక ఫైబర్‌నెట్‌లో 400 మందికి పైగా ఉద్యోగులను తొలగించామని, ఆ తొలగించిన వారికి ఇప్పటికీ జీతాలు చెల్లిస్తున్నారని జీవీ రెడ్డి వెల్లడించారు. విధులకు రాని ఉద్యోగులను తీసివేయాలని చైర్మన్‌గా తాను ఆదేశాలిచ్చిన తర్వాత కూడా 3నెలలుగా వారికి జీతాలు చెల్లించడమేంటని నిలదీశారు. జీఎస్టీ అధికారులు ఇచ్చిన నోటీసులకు అధికారులు స్పందించకపోవడంతో సంస్థపై రూ.377 కోట్లు జరిమానా విధించారని.. ఈ విషయాన్ని వారు కనీసం తన దృష్టికి తీసుకురాలేదని, సంస్థపై వందల కోట్ల భారం పడేందుకు దినేశ్ కుమార్, అధికారులు కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భారాన్ని వారి నుంచి రికవరీ చేయాలని తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానని తెలిపారు. సంస్థకు సంబంధించి ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయకపోవడంతో ఆ విషయం తెలుసుకుని ఇటీవల తాను అప్రమత్తం చేశానని దాంతో రూ.30 కోట్ల మేర సంస్థకు ఆదా అయిందని చెప్పారు. తాను జోక్యం చేసుకోకుంటే ఈ డబ్బులు కూడా బూడిదలో పోసిన పన్నీరయ్యేవని తెలిపారు.

సంస్థను మూసేస్తే..?

గత యాజమాన్య హయాంలో జరిగిన అక్రమాలపై కేసులు లేకుండా చేసేందుకు ఏకంగా సంస్థనే మూసివేసే కుట్ర చేస్తున్నారా అన్న అనుమానాన్ని జీవీ రెడ్డి వ్యక్తం చేశారు. గత యాజమాన్యంతో ప్రస్తుత అధికారులు కుమ్మక్కయారన్న సందేహం కలుగుతుందని అన్నారు. అది రాజద్రోహమేనని తేల్చిచెప్పారు. ఫైబర్‌నెట్‌కు గతంలో 12 లక్షల కనెక్షన్లు ఉండేవని ఇప్పుడది నాలుగున్నర లక్షలకు పడిపోయిందని ఆయన తెలిపారు. ప్రస్తుత అధికారుల తీరు చూస్తేంటే అవి కూడా పోతాయేమోనన్న భయం వెంటాడుతోందని అన్నారు. ఫైబర్‌నెట్ ఎండీగా బాధ్యతలు చేపట్టాక దినేశ్‌కుమార్ ఒక్క కనెక్షన్ కూడా పెంచలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో తొలగించిన ఎంఎస్‌వోలు కాళ్లరిగేలా తిరుగుతున్నా వారిని కలిసేందుకు కూడా దినేశ్ కుమార్ సమయం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తామే సెట్‌టాప్ బాక్సులు సమకూర్చుకుని కనెక్షన్లు తెచ్చుకుని నడుపుకొంటామని వారు చేసుకుంటున్న విజ్ఞాపనలు వినే సమయం కూడా ఆయనకు లేదని మండిపడ్డారు. వారికి అవకాశం ఇవ్వాలని తాను స్వయంగా సూచించినా అధికారులు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. సంస్థను సక్రమంగా నడిపితే రూ.2వేల కోట్ల టర్నోవర్ జరుగుతుందని కానీ 200 కోట్ల బిజినెస్ కూడా చేసే పరిస్థితి లేకుండా దీనిని తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిందితులు మరణించే వరకు కఠిన కారాగార శిక్ష!

- కిడ్నాప్, సామూహిక అత్యాచారం కేసులో బెజవాడ పోక్సో కోర్టు తీర్పు

విజయవాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తొమ్మిదో తరగతి బాలికను కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితులకు విజయవాడ పోక్సో కోర్టు మరణించే వరకు కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ మేరకు జడ్జి వి.భవాని గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బాలిక.. తల్లిదండ్రులు చనిపోవడంతో తాత వద్ద నివసిస్తోంది. ఇంటికి దగ్గర్లోని స్కూల్లో 8వ తరగతి చదువుతున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన సాయి పరిచయమై తరచూ ఫోన్లో మాట్లాడుతుండేవాడు. తర్వాత బాలిక కృష్ణా జిల్లా పెడన వెళ్లిపోయి అక్కడ 9వ తరగతిలో చేరింది. 2022 మేలో సెలవులకు బాలిక తాత ఇంటికి రాగా, రాత్రి సమయంలో సాయి వచ్చి బాలికను బయటికి పిలిచి బైక్‌పై దగ్గరలోని ఓ పాఠశాలకు తీసుకెళ్లి గదిలో అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను ఇంటి వద్ద వదిలి వెళ్లిన సాయి మళ్లీ రెండ్రోజుల తర్వాత వచ్చి బయటికి రావాలని పిలిచాడు. ఆమె నిరాకరించడంతో తన వద్ద ఇద్దరం కలిసిన ఫొటోలు ఉన్నాయని, రాకుంటే అందరికీ చూపిస్తానని బెదిరించాడు. దీంతో బాలిక బయటికి రాగా, మళ్లీ పాఠశాల గదికి తీసుకెళ్లాడు. అప్పటికే ఉన్న మరో ఇద్దరితో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. వేసవి సెలవులు పూర్తవగానే బాలిక తిరిగి పెడన 'స వెళ్లిపోయింది. కొద్ది నెలల తర్వాత పిన్ని ఇంటికి బాలిక వెళ్లగా కడుపు ఎత్తుగా ఉండటం గమనించి పిన్ని ప్రశ్నించింది. బాలిక జరిగినదంతా చెప్పడంతో విజయవాడ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు దర్శిపేటకు చెందిన సిరిగిరి చంద్రశేఖర్ అలియాస్ సాయి(24), పటమట లంబాడీపేటకు చెందిన అనురాజ్ ప్రకాశ్ అలియాస్ శ్రీను(23)ని అరెస్టు చేశారు. ఒక బాలుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితులు మరణించేంత వరకు కఠిన కారాగార శిక్షతో పాటు సాయికి రూ.32 వేలు, ప్రకాశ్‌కు రూ.20వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు.

ప్రేమించడంలేదని యువతిపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు.. యువకుడి అరెస్టు

తాళ్లపూడి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రేమించడం లేదన్న కోపంతో ఓ యువకుడు ఇంటర్ చదువుతున్న యువతిపై దాడికి పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన గొల్ల దిలీప్ కుమార్ (19) చదువు మధ్యలో ఆపేసి జులాయిగా తిరుగుతున్నాడు. వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న యువతి (19)ని కొన్నాళ్లుగా ప్రేమ పేరిట వేధిస్తున్నాడు. అయితే ఆమె తిరస్కరిస్తూ వస్తోంది. బుధవారం ఆమె చదువుతున్న కళాశాల వద్దకు వెళ్లిన దిలీప్... తనను ప్రేమించాలని, లేదంటే 'నీ జీవితాన్ని నాశనం చేస్తాను' అని యువతిని బెదిరించాడు. ఆమె నిరాకరించడంతో పక్కనే ఉన్న కర్రతో దాడికి పాల్పడ్డాడు. యువతి కేకలు వేసుకుంటూ అక్కడినుంచి పారిపోయి బాత్‌రూమ్‌లో దాక్కుంది. కళాశాల సిబ్బంది రావడంతో దిలీప్ అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం యువతి తన తల్లిదండ్రుల సహకారంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దిలీప్‌కుమార్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం అతన్ని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీలతో పర్యవేక్షణ

- 10,58,892 విద్యార్థులకు 1,535 కేంద్రాలు
- పరీక్షల ఏర్పాట్లపై సీఎస్ విజయానంద్ సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. సజావుగా పరీక్షలు సాగేందుకు పరీక్ష కేంద్రాలను సీసీ టీవీలతో పర్యవేక్షించనుంది. మార్చి 1 నుంచి 20 వరకు రెగ్యులర్ విద్యార్థులకు, 3 నుంచి 15 వరకు ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10,58,892 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందుకోసం ఇంటర్ విద్యామండలి 1,535 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా మరో 67,952 మంది 325 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సీఎస్ కె.విజయానంద్ గురువారం సచివాలయంలో సమీక్షించారు. మొత్తం పరీక్షా కేంద్రాల్లో 68 సున్నితమైన కేంద్రాలు ఉన్నాయని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. పరీక్షల సమయంలో పేపరు లీకేజీ అంటూ తప్పుడు వార్తలు ప్రసారం, వ్యాప్తిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్‌కు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఆ పరిధిలో జిరాక్స్, నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సూచించారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్రస్థాయిలో 18004251531 అనే టోల్‌ఫ్రీ నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏర్పాట్లపై ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్ని కేంద్రాలను సీసీటీవీల కవరేజ్‌తో అనుసంధానం చేస్తున్నామని, చీఫ్ సూపరింటెండెంట్‌లు లైవ్ స్ట్రీమింగ్‌ను పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రతిరోజూ పోలీస్ స్టేషన్ల నుంచి ప్రశ్నపత్రాలు తీసుకోవాలని, పరీక్ష ముగిశాక జవాబుపత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా పంపాలని తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను నిషేధించారు. ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌కు ఒక కీప్యాడ్ ఫోన్‌ను ఇస్తారు. సెట్ నంబరు, మార్పులు, అత్యవసర సమాచారానికి ఆ ఫోనును మాత్రమే వినియోగించాలి. ఆ ఫోనులోని సిమ్ కార్డును కూడా ఇంటర్ బోర్డే ఇవ్వనుంది.

175 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్ష

ఈనెల 23న జరగనున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఏర్పాట్లపైనా సీఎస్ సమీక్షించారు. 175 పరీక్షా కేంద్రాల్లో 92,250 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరావుతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 9.45 గంటల తర్వాత ఎవరినీ లోపలికి అనుమతించబోరని ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధ తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు 2.45 లోపే విద్యార్థులు పరీక్ష హాల్లో ఉండాలన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదల కుదరదు

- అభ్యర్థుల ప్రయోజనాలు ప్రమాదంలో పడతాయి: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దీనివల్ల అర్హులైన అభ్యర్థుల ప్రయోజనాలు ప్రమాదంలో పడతాయని పేర్కొంది. అయితే నోటిఫికేషన్ ఆధారంగా జరిపే తదుపరి చర్యలన్నీ తామిచ్చే తుది తీర్పుకి లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. ఈ నెల 23న జరగనున్న మెయిన్స్ పరీక్షను నిలుపుదల చేయాలని కోరుతూ వేసిన అనుబంధ పిటిషన్లను కొట్టివేసింది. ప్రధాన వ్యాజ్యాలపై విచారణను మార్చి 11కి వాయిదా వేసింది. ఈ వ్యవహారంపై కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌ను నిర్ధారించి గ్రూప్-2 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాఖకు చెందిన ఎం.పార్థసారథి, కడపకు చెందిన కనుపర్తి పెంచెలయ్య, మరో ఇద్దరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీలో మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, క్రీడాకారులకు ప్రత్యేకంగా రోస్టర్ స్లాట్స్(రిజర్వేషన్ పాయింట్లు) కేటాయిస్తూ 2023 డిసెంబరు 7న ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... హైకోర్టులో పిటిషన్లు వేసినవారిలో ఇద్దరు మాత్రమే ప్రధాన పరీక్షకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రధాన పరీక్షలో అర్హత సాధించినవారు కంప్యూటర్ ప్రావీణ్య పరీక్ష(సీపీటీ)కు హాజరుకావాల్సి ఉంటుందని, ఆ తరువాతే రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమల్లోకి వస్తుందని వివరించారు. పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. దీంతో అనుబంధ పిటిషన్లపై తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి... మెయిన్స్ పరీక్షను నిలుపుదల చేసేందుకు నిరాకరిస్తూ గురువారం నిర్ణయం వెల్లడించారు.



గ్రూప్ 2 పరీక్షలపై సమీక్షా సమావేశంలో సీఎస్ విజయానంద్, ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధ తదితరులు

ఈ ఫేక్ వీడియోలను నమ్మకండి




"భారత ప్రభుత్వంతో గూగుల్ ఒక చరిత్రాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ప్రతి భారతీయ పౌరుడిని మిలియనీర్‌ను చేస్తాం. రూ.21 వేలు ఒక్కసారి పెట్టుబడి పెట్టండి. మీ ఖాతాలో డబ్బు పెరగకపోతే నన్నడగండి"

- ఇదీ గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పినట్టు వైరల్ అవుతున్న వీడియో



"ఈ నెలలో ప్రతి ఒక్కరూ రూ.21 వేలు చెల్లించి ఖాతా ఓపెన్ చెయ్యండి. మరుసటి రోజు మీ ఖాతాలో రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు జమవుతాయి. మీ డబ్బుకు నేను గ్యారెంటీ. ప్రతి గంటకు రూ.2 వేలు వడ్డీ వస్తుంది"

- ఇదీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినట్టు వైరల్ అవుతున్న వీడియో



"రిలయన్స్ తరఫున ఒక గొప్ప ప్రాజెక్ట్ చేపట్టాం. రూ.21 వేలు పెట్టుబడి పెడితే చాలు.. మీ ఖాతాలో నెల తిరిగేసరికి రూ.40 లక్షలు వచ్చిపడతాయి. దీనికి నేను గ్యారెంటీ. ఇది మోసమని ఎవరైనా చెబితే వారి మాటలు నమ్మకండి'

'- ఇదీ ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చెప్పినట్టు వైరల్ అవుతున్న వీడియో

క్వాంటమ్ ఏఐ పేరిట ఘరానా దోపిడీ

- 21 వేల పెట్టుబడితో 22లక్షలు ఆర్జనంటూ వల
- నమ్మి పెట్టుబడులు పెట్టిన వారికి నయ వంచన
- తెనాలి సహా పలు ప్రాంతాల్లో సైబర్ బాధితులు
- పట్టించుకోని పోలీసులు.. ఫిర్యాదు రాలేదని వెల్లడి

(తెనాలి-ఆంధ్రజ్యోతి)

రూ. 21వేలు పెట్టుబడి పెడితే కేవలం నెలరోజుల్లో రూ. 20 లక్షలు ఆదాయం రావటం ఎక్కడైనా చూశారా! పైగా మీ పెట్టుబడులకు 100 శాతం గ్యారెంటీ. 100 శాతం వృద్ధి. సంపాదించిన దానిపై 0% టాక్స్ అంటే ఎగిరి గంతేయకుండా ఉంటారా! ఇదంతా చెప్పేది ఏదో గుర్తింపులేని కంపెనీ అయితే పెద్దగా పట్టించుకోరు. గూగుల్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీల సీఈఓలు, కేంద్ర ఆర్థిక మంత్రి, ఆర్బీఐ మాజీ గవర్నర్ వంటివారు చెబితే ఎవరు నమ్మకుండా ఉంటారు? పైగా చిన్న మొత్తమే కదా అన్నట్టు ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టేస్తున్నారు. అయితే.. పెట్టుబడి పెట్టాక నెలలు గడచినా తమ ఖాతాలో ఎలాంటి అదనపు డబ్బు జమ కాకపోవటంతో ఆ తర్వాత జరిగిన మోసం గ్రహించి పెట్టుబడిదారులు లబోదిబో మంటున్నారు. దీనికి కారణం 'ఏఐ' సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ ముఠా చేస్తున్న నయా మోసం. ఎక్కడా చిన్న అనుమానం కూడా రాకుండా వారు చేస్తున్న మోసానికి చదువుకున్నవారు, సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం ఉన్నవారే బాధితులుగా మారుతున్నారు. తాజాగా తెనాలిలో ఒక ప్రభుత్వ ఉద్యోగి రూ.21 వేలు జమచేసి తర్వాత మోసపోయామని గ్రహించారు. ఇదే తరహాలో ఏఐ టెక్నాలజీ మోసానికి గురైవారు మిగిలిన ప్రాంతాల్లో చాలా మందే ఉన్నారని తెలుస్తోంది. కృత్రిమ మేథ(ఏఐ)ను అడ్డు పెట్టుకుని తేలికగా డబ్బు దోచేసేందుకు ఏకంగా ఫేక్ వీడియోలను సృష్టిస్తూ ముఠా సభ్యులు రెచ్చిపోతున్నారు. ప్రముఖులు మాట్లాడినట్టు ఏఐతో ఫేక్ వీడియోలను సృష్టించి వదులుతున్నారు. ఆయా ప్రముఖులను ప్రధాన జాతీయ న్యూస్ చానల్స్ ఇంటర్వ్యూలు చేసినట్టు, వారే స్వయంగా ఇవన్నీ చెప్పినట్టు న్యూస్ రీడర్లు కూడా వార్తల రూపంలో వీటిని చదవటం ఘరానా మోసాల ప్రయత్నానికి పరాకాష్ట. ఇవి కూడా చాలవన్నట్టు కొందరు వ్యక్తులు తామెంతో లాభపడ్డామని అభిప్రాయాలు చెప్పడం గమనార్హం.

క్వాంటమ్ ఏఐతో వల

రానున్న రోజుల్లో 'ఏఐ' గొప్ప విప్లవాన్ని సృష్టిస్తుందని, ఈ రంగంలో పెట్టుబడులు పెడితే కాసులు పంట పండుతుందని 'క్వాంటమ్ ఏఐ' పేరుతో ఒక ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చినట్టు సామాజిక మాధ్యమాల్లో గత నెల నుంచి ఊదరగొడుతున్నారు. అయితే, ఈ ప్రాజెక్టును ఎవరికివారు తాము తీసుకొచ్చామంటే తాము తీసుకొచ్చామని ప్రముఖులు పోటా పోటీగా చెప్పటం విశేషం. ఈ క్వాంటమ్ ఏఐ ప్రాజెక్టు పేరుతో గూగుల్, ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటివి పోటీపడటం చూస్తే కచ్చితంగా ఇది మోసమనే అర్థమవుతుంది. దీనికితోడు రూ.21 వేలు చెల్లిస్తే 30 రోజుల్లో రూ.6 లక్షలు వస్తాయని ఒక వీడియోలో, రూ.15 లక్షలు వస్తాయని మరో వీడియో, రూ.19.5 లక్షలు వస్తాయని మరో వీడియోలో, రూ.40 లక్షలు వెనకేస్తారంటూ మరో వీడియోలో పొంతన లేకుండా చెప్పటం గమనార్హం. ఇన్ఫోసిస్ అధినేత నారాయణ మూర్తి ఈ పెట్టుబడుల విషయంలో జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఒక సెన్సేషన్ అని పేర్కొనటం సైబర్ ముఠా పన్నాగంలో భాగం.

ఇంత దుమారం రేపుతున్నా!

ఏఐ టెక్నాలజీతో ఆర్థిక మోసాలకు తెరదీసి, నిబంధనలకు విరుద్ధంగా అధికారిక ప్రకటన తరహాలో బరితెగించినా సైబర్ నేరాలను అదుపు చేయాల్సిన పోలీసులు వాటిపై దృష్టి పెట్టిన దాఖలా కనిపించటంలేదు. అంబానీ వీడియో గత ఆరు నెలల నుంచి వస్తుంటే, మిగిలిన ప్రముఖుల వీడియోలు నెల నుంచి ఫేస్‌బుక్, ట్విట్టర్, ఎక్స్ వంటి మాధ్యమాల్లో వైరల్ అవుతూనే ఉన్నాయి. అయితే వీటిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, అలాంటి ఫిర్యాదు వస్తే విచారిస్తామని పోలీసులు చెబుతున్నారు. కానీ, మోసపోయినవారు మాత్రం బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు. కాగా.. నకిలీ వీడియోలు వైరల్ చేసేందుకే సోషల్ మీడియాలో ఖాతాలు తెరుస్తున్నారని బాధితులు చెబుతున్నారు. నిన్నటి వరకు డిజిటల్ అరెస్ట్ అంటూ రెచ్చిపోయిన సైబర్ మాఫియా ఇప్పుడు ఏఐ టెక్నాలజీతో నయా మోసాలకు తెరదీసింది. ఆదిలోనే పోలీసులు అప్రమత్తం అయితే సైబర్ ముఠాను కట్టడి చేసే అవకాశం ఉంది.



తిరుపతి విమానాశ్రయంలో నిర్మించిన 3810 మీటర్ల రన్‌వే

తిరుపతి విమానాశ్రయంలో అతిపెద్ద రన్‌వే

రేణిగుంట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు వీలుగా రాష్ట్రంలోనే అతిపెద్ద రన్‌వే అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ విమానాశ్రయంలో అందుబాటులో ఉన్న 2,285 మీటర్ల రన్‌వేను రూ.156.16 కోట్లు వెచ్చించి 3,810 మీటర్లకు విస్తరించారు. ఈ సందర్భంగా గురువారం విమానాశ్రయంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీ గురుమూర్తి, విమానాశ్రయ అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మానే శ్రీనివాస్ మాట్లాడుతూ.. తిరుపతి విమానాశ్రయంలో రన్‌వేను విస్తరించడంతో విశాఖపట్నం, విజయవాడ విమానాశ్రయాల కన్నా పెద్ద రన్‌వే ఏర్పడిందన్నారు. విమానాలు మలుపు తిరిగే ప్రాంతాన్ని కూడా 700 మీటర్ల నుంచి 1500 మీటర్లకు పెంచామన్నారు. దీంతో పెద్ద విమానాలు సులువుగా మలుపు తిరగవచ్చన్నారు. ఇక్కడికి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిపేందుకు చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. రన్‌వేపై లైటింగ్ పనులు కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 2.30 నుంచి శనివారం ఉదయం 5 గంటల వరకూ విమాన సర్వీసులను రద్దు చేస్తున్నామని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.